శనివారం
10•2•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 244
• పేజీలు : 16 + (24/20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

అందరికీ ఆరోగ్యం

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో రోగనిర్ధారణ పరీక్షలు
ప్రభుత్వపరంగానే చికిత్స.. మందుల సరఫరా

- పేదల ఆరోగ్యం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ఆశ వర్కర్లు, రెండో ఏఎన్ఎంల జీతాలు పెంచుతాం
- కేసీఆర్ కిట్ల పథకం ప్రైవేటుకు అనుమతించం
- రాష్ట్రంలో 46,476 మంది బోదకాలు బాధితులు.. వెయ్యి చొప్పున పింఛన్
- ప్రజారోగ్యంపై సమీక్షలో సీఎం కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆరోగ్య తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా గ్రామీణులకు ఆరోగ్యభాగ్యం సమకూర్చేందుకు సరికొత్త చొరవతో ఆయన ముందడుగు వేశారు. చికిత్స కన్నా నిరోధమే ఉత్తమమన్న నానుడికి తగ్గట్టుగా సర్కారీ వైద్యవ్యవస్థను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే క్రమం తప్పకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తుందని, ఏదైనా వ్యాధి ఉన్నట్టు ఆ పరీక్షల్లో తేలితే ప్రభుత్వమే చికిత్స చేయిస్తుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

మిగతా 2వ పేజీలో



శుక్రవారం ప్రగతిభవన్‌లో వైద్య, ఆరోగ్యశాఖపై నిర్వహించిన సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

తెలంగాణ ట్రెండ్ సెట్టర్

అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుస్తాం

- టీఎస్ ఐపాస్ తెలంగాణకు ప్రత్యేకం
- గుజరాత్‌లో మోదీ కూడా తీసుకురాలేదు
- ఇక్కడి సదస్సులన్నీ సక్సెస్ అవుతున్నాయి
- వారసత్వం నిలబెట్టుకోవడం సులభం కాదు
- క్రెడాయ్ యూత్‌కాన్-2018 సదస్సులో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వినూత్న విధానాలు, ఆకర్షణీయమైన పథకాలతో అన్నిరంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తూ దేశంలో ట్రెండ్ సృష్టిస్తామని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేనివిధంగా టీఎస్ ఐపాస్ ప్రవేశపెట్టి తెలంగాణ సర్కారు అందరికీ మార్గదర్శిగా నిలిచిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రతి అంతర్జాతీయ సదస్సు సక్సెస్ అవుతున్నదని సంతోషం వ్యక్తంచేశారు. నిర్మాణరంగంలోకి కొత్తతరం ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. బంగారు భవిష్యత్తున్న

మిగతా 2వ పేజీలో

ఉత్తమ్‌ది కాలకేయ ముఠా

- ఏడు సీట్లయినా గెలువండి: కాంగ్రెస్‌కు మంత్రి తలసాని సవాల్
- ప్రజల మనసులో మాటే కేటీఆర్ చెప్పారు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- తెలంగాణ బాహుబలి కేసీఆర్: టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్
- వారిది బుట్టేచోర్ బ్యాచ్: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఐటీ మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై పలువురు టీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిది కాలకేయ ముఠా అని, కాంగ్రెస్‌ది బుట్టేచోర్ బ్యాచ్ అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు కాదు కదా కనీసం ఏడు సీట్లయినా గెలుచుకోవాలని సవాలుచేశారు. రాష్ట్రాన్ని ధర్మరాజులా పరిపాలిస్తున్న సీఎం కేసీఆర్‌పై ఈర్ష్యాద్వేషాలతోనే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనసులో ఉన్నమాటనే మంత్రి కేటీఆర్ చెప్తే, కాంగ్రెస్ నాయకులు ఉలిక్కిపడుతూ, వ్యర్థప్రేలాపనలకు దిగుతున్నారని దుయ్యబట్టారు.

2



ట్విట్టర్‌లో కేటీఆర్ ఫాలోయర్లు

10,00,000

'మిలియన్ థ్యాంక్స్' చెప్పిన మంత్రి

2

తలసరి విదేశీ అప్పు

26 వేలు

మన రుణాలు 32 లక్షల కోట్లు
లోక్‌సభలో ప్రభుత్వం వెల్లడి

13

కేటీఆర్ ట్విట్టర్@10 లక్షలు

- 'మిలియన్ థ్యాంక్స్' చెప్పిన మంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిరిసిల్ల నుంచి సిలికాన్‌వ్యాలీ వరకు స్వల్పకాలంలోనే సుపరిచితుడైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు ఖాతాలో మరో విశిష్ట రికార్డు చేరింది. అధికారులకు, పార్టీ నేతలకు, కార్పొరేట్ ప్రతినిధులకు, అన్నింటికీ మించి సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు.. వేదికగా ఎంచుకున్న 'ట్విట్టర్' ఖాతా మిలియన్ మైలురాయిని అధిగమించింది. కేటీఆర్ ట్విట్టర్ అకౌంట్ ఫాలోవర్ల సంఖ్య శుక్రవారంనాటికి పది లక్షలు దాటింది. మంత్రులు, ముఖ్యమంత్రులు, అంతర్జాతీయస్థాయి సంస్థల అధినేతలు, సినీనటులు, వివిధ రంగాల ప్రముఖులు, మరెందరో సామాన్యులు ఆయన ఫాలోవర్ల జాబితాలో ఉన్నారు. ప్రాంతీయ నేతకు అతితక్కువ కాలంలో ఇంతమంది ఫాలోవర్లు లభించడం ఆయకే సాధ్యమైందని పలువురు నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన తన ట్విట్టర్ ఫాలోవర్లకు 'మిలియన్ థ్యాంక్స్' చెప్పారు. దాదాపు రెండేండ్ల క్రితం.. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో.. ఆయన ట్విట్టర్ ఫాలోవర్ల సంఖ్య కేవలం యాభైవేలే. ఇప్పుడు ఆ సంఖ్య పది లక్షలకు చేరడం ఆయన పనితీరుకు నిదర్శనం. ఇటీవల రెండు గంటలపాటు ట్విట్టర్‌లో లైవ్ నిర్వహించి వినూత్న ఒరవడికి శ్రీకారంచుట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లాగా మారారు. తన పరిధిలోని శాఖలకు సంబంధించిన సమాచారం తెలియజెప్పడమే కాకుండా, ఇతరశాఖల్లోని ఆసక్తికరమైన అంశాలను సైతం పంచుకొంటున్నారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించడం, సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం, తన పరిధి కాకపోతే వాటిని ఇతరులకు చేరవేయడం, ప్రఖ్యాత వ్యక్తులతో సంభాషణలు కొనసాగించడం వంటివి మంత్రి కేటీఆర్ ప్రత్యేకతలు. ఆపదలో ఉన్నవారు ఎవరైనా, ఎక్కడి నుంచైనా ఆయనకు ఒక్కట్వీట్ చేస్తే చాలు.. సమస్య పరిష్కారమైపోతున్నది. ఒకవేళ తాను బిజీగా ఉంటే.. ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఆన్‌లైన్లోనే 'కేటీఆర్ ఆఫీస్' పేరుతో ఒక ట్విట్టర్ హ్యాండిల్‌ను ఏర్పాటుచేశారు. ఆయన ద్వారా సహాయం పొందినవారిలో కేవలం తెలంగాణవారే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలవారు కూడా ఉండటం విశేషం.



వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌కు హాజరుకండి

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరల్డ్ ఐటీ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమంలో పాల్గొనాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు, నాస్కామ్ ప్రతినిధులు ఆహ్వానించారు. వారు శుక్రవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కోవింద్‌ను కలిశారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో లింక్ ద్వారా ప్రారంభిస్తారని, దీనికి ప్రపంచవ్యాప్తంగా ఐటీరంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతోపాటు 30 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని వివరించారు.



పట్టాదార్ పాస్‌పుస్తకంపై నా ఫొటో వద్దు

అధికారులకు స్పష్టంచేసిన సీఎం కేసీఆర్
ముదురు ఆకుపచ్చ రంగు పాస్‌పుస్తకం ఎంపిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులకు కొత్తగా ఇచ్చే పట్టాదార్ పాస్‌పుస్తకాలపై తన ఫొటో ముద్రించవద్దని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులకు స్పష్టంచేశారు. కొత్తగా ఇచ్చే పాస్‌పుస్తకాల నమూనాను అధికారులు శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు చూపించారు. నమూనా పాస్‌పుస్తకాలను పరిశీలించిన ఆయన పంటలకు గుర్తుగా ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్న పాస్‌పుస్తకాన్ని ఎంపిక చేశారు. పాస్‌పుస్తకంలో సీఎం ఫొటో ఉన్న నమూనాను కూడా చూపించగా, పాస్‌పుస్తకంపై రైతు ఫొటో తప్ప మరెవ్వరి ఫొటో వద్దని చెప్పారు. పాస్‌పుస్తకాలపై రాజకీయ నాయకుల ఫొటోలు అవసరం లేదన్నారు. పాస్‌పుస్తకంపై కేవలం రైతు ఫొటో, ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉండాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

అందరికీ ఆరోగ్యం



శుక్రవారం ప్రగతిభవన్‌లో వైద్యారోగ్యశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, సంజీవరావు, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లు తదితరులు ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించారు. వైద్య, ఆరోగ్యశాఖపై శుక్రవారం ప్రగతిభవన్లో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాల గురించి చర్చించారు. చాలావ్యాధులను ఎంతత్వరగా గుర్తిస్తే చికిత్స అంత సులభమవుతుందని చెప్పారు. బోదకాలు వంటి వ్యాధులను ముందుగా గుర్తిస్తే నయం చేయడం వీలవుతుందని అంటూ, బోదకాలు వ్యాధితో బాధపడేవారికి నెలనెలా రూ.1000 పింఛనుగా ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 46 వేలమందికిపైగా బోదకాలు బాధితులకు దీనివల్ల లబ్ధి చేకూరుతుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత సర్కారు వైద్యం తీరు ఎంతో మెరుగుపడిందని సీఎం కేసీఆర్ ప్రశంసించారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో కీలకపాత్ర వహిస్తున్న ఆశవర్కర్లను గ్రామ ఆరోగ సహాయకులుగా గుర్తిస్తామని, అవసరమైతే మరోసారి జీతాలు పెంచడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సెకండ్ ఏఎన్‌ఎంల జీతాలు కూడా పెంచి వారి సేవలను మరింత సమర్థంగా వినియోగించుకుంటామని చెప్పారు. సర్కారు వైద్యశాలలకు వచ్చే గర్భిణులకు ఇస్తున్న కేసీఆర్ కిట్లను ప్రైవేటు దవాఖానల్లో ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

చికిత్స కన్నా నిరోధమే మేలు

ప్రివెన్షన్ ఈజ్ బెటర్‌దెన్ క్యూర్ అనే మాటను తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో పెట్టదలుకున్నదని, దీనికోసం గ్రామం యూనిట్‌గా ప్రజలందరికీ ప్రభుత్వ ఖర్చుతోనే రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయిలో పనిచేసే వైద్య అధికారులు, సిబ్బంది సేవలను మరింత ప్రభావవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ఆశ వర్కర్లకు మరోసారి జీతాలు పెంచాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్, సెకండ్ ఏఎన్‌ఎంలకు కూడా జీతాలు పెంచనున్నట్లు ప్రకటించారు. ప్రజారోగ్యం విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని సీఎం సూచించారు.

అమెరికా తరహాలో ఆరోగ్య పరీక్షలు

అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటారని, రాష్ట్రంలో కూడా ప్రతి ఒక్కరికీ అటువంటి ఆరోగ్య అవగాహన అలవాటు చేయించాలని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'అవగాహన ఉన్నవారు, ఆర్థికస్తోమత కలిగినవారు పరీక్షలు చేయించుకుంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారు, ముఖ్యంగా పేదలు రోగమొచ్చినపుడు తప్ప దవాఖానలకు వెళ్లరు. వైద్యపరీక్షలు చేయించుకోరు. దీనివల్ల చాలా వ్యాధులను ప్రాథమికస్థాయిలో గుర్తించలేకపోతున్నారు. వ్యాధిని మొదటిదశలోనే గుర్తిస్తే నయం చేయడం తేలిక అవుతుంది. బోదకాలు కూడా అలాంటిదే. ప్రారంభదశలో గుర్తిస్తే నయం చేయవచ్చు. కానీ ముదిరేదాకా గుర్తించరు. చాలారోగాల విషయాల్లో ఇలాగే జరుగుతుంది. ఇకపై ఆవిధంగా జరుగడానికి వీల్లేదు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తుంది. రక్తనమూనాలు సేకరించి, అన్నిరకాల రోగనిర్ధారణ పరీక్షలు చేయించాలి. రోగం గుర్తించిన వెంటనే ప్రభుత్వపరంగానే చికిత్స చేయాలి. మందులు అందించాలి. దీనికోసం ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు. పేద ప్రజల ఆరోగ్యం కాపాడటం కన్నా మించిన ప్రాధాన్యం ప్రభుత్వానికి ఏదీలేదు' అని సీఎం చెప్పారు. ఆశ వర్కర్లకు ఒకసారి జీతాలు పెంచామని, మరోసారి కూడా జీతాలు పెంచడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు. 'ఆశ వర్కర్లను విలేజ్ హెల్త్ అసిస్టెంటుగా గుర్తిస్తాం. సెకండ్ ఏఎన్‌ఎం జీతాలు కూడా పెంచుతాం. వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటాం' అని చెప్పారు.

ప్రైవేటుకు కిట్లు ఇవ్వం

కేసీఆర్ కిట్ల పథకం ప్రైవేటుకు అనుమతించేది లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. దీనిద్వారా అనవసర ఆపరేషన్లు బాగా తగ్గాయని, అదనపుభారం పడినా సరే వైద్యులు, సిబ్బంది ఓపికగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 'వారికి ఇన్సెంటివ్ ఇస్తాం. ప్రైవేటు దవాఖానలకు కూడా కేసీఆర్ కిట్ల పథకం వర్తింపజేయాలని వినతులు వస్తున్నాయి. కానీ ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదు. ప్రభుత్వ దవాఖానల్లోనే అవసరమైన సౌకర్యాలు పెంచుతాం. ప్రభుత్వ వైద్యశాలలను బాగు చేసుకుంటాం తప్ప.. ప్రైవేటు హాస్పిటల్స్‌కు కేసీఆర్ కిట్ల పథకం వర్తింపజేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు' అని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, శాంతికుమారి, ఎంఅండ్‌హెచ్ డైరెక్టర్ వాకాటి కరుణ, పబ్లిక్‌హెల్త్ డైరెక్టర్ లలితాకుమారి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరావు, ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, బాలమల్లు పాల్గొన్నారు.

బోదకాలు బాధితులకు ఊరట

రాష్ట్రంలోని బోదకాలు బాధితులకు ప్రతినెలా రూ. వెయ్యి పింఛను ఇవ్వాలని సీఎం కేసీఆర్‌నిర్ణయించారు. రాష్ట్రంలోని దాదాపు 46,476 మంది బోదకాలు బాధితులకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పెన్షన్ అందించేందుకు వీలుగా వచ్చే బడ్జెట్లో నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. బోధకాలు వ్యాధిగ్రస్తులకు మందులు, ఇతర వైద్య సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. బోదకాలు బాధితుల సమగ్ర సర్వే నిర్వహించాలని, గ్రామాల్లో వారి వివరాలు సేకరించాలని సీఎం కోరారు.

తుమ్మల, కవిత చొరవతో కదలిక

తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో బోధకాలు బాధితులు పెద్దసంఖ్యలో ఉన్నారని, వారు కాలుతీసి కాలు వేయలేని పరిస్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవాలని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ కల్వకుంట్ల కవిత సీఎంకు విన్నవించారు. వారి చొరవతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. బోదకాలు వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా పింఛను ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఔదార్యంతో నిర్ణయించడంపై సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోణప్ప హర్షం వ్యక్తం చేశారు.

సర్కారు వైద్యం తీరుమారింది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సర్కారు వైద్యం తీరుమారిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. 'ప్రభుత్వ దవాఖానలు కూడా ఎంతో మెరుగయ్యాయి. కేసీఆర్ కిట్ల పథకం అద్భుతంగా అమలవుతున్నది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్ర తీసుకున్న చర్యలను ప్రశంసించింది. వైద్య అధికారులు, సిబ్బంది పనితీరుపై సర్వత్రా సంతృప్తి, సంతోషం వ్యక్తమవుతున్నాయి. వైద్యాధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా మలేరియా, డెంగ్యూ మరణాలు తగ్గాయి. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదల ముంగిట్లోకి వైద్యం చేరాలి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పలువిధాలైన వైద్య అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వారందరినీ సమన్వయం చేసుకుంటూ, గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలి. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి' అన్నారు.

అధికారుల సమాచారం మేరకు జిల్లాల వారీగా బోధకాలు వ్యాధిగ్రస్థుల వివరాలు..

జిల్లా పేరు	బాధితుల సంఖ్య
జగిత్యాల	6463
సిద్దిపేట	5199
సూర్యాపేట	4587
కామారెడ్డి	3342
ఖమ్మం	2886
సిరిసిల్ల	2350
జనగాం	2189
కరీంనగర్	1892
నిజామాబాద్	1847
వికారాబాద్	1823
వరంగల్ (రూరల్)	1777
మహబూబాబాద్	1682
నల్లగొండ	1567
సంగారెడ్డి	1464
యాదాద్రి	1410
వరంగల్ అర్బన్	1051
మెదక్	1047
పెద్దపల్లి	913
ఆదిలాబాద్	673
మహబూబ్‌నగర్	644
ఆసిఫాబాద్	479
నిర్మల్	292
మంచిర్యాల	274
జయశంకర్	174
కొత్తగూడెం	142
నాగర్‌కర్నూల్	112
మేడ్చల్	71
రంగారెడ్డి	55
జోగుళాంబ గద్వాల	39
వనపర్తి	32
హైదరాబాద్	0
మొత్తం	**46,476**



తెలంగాణ ట్రెండ్‌సెట్టర్

మొదటిపేజీ తరువాయి...

ఈ రంగంలో పెట్టుబడులకు కొరతలేదని, ప్రభుత్వాలు సంస్కరణలతో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రెట్టింపు ఉత్సాహం ఉన్నపుడే యువతరం అద్భుతాలు సృష్టిస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీలో ప్రారంభమైన క్రెడాయ్ యూత్‌కాన్-2018లో మంత్రి కేటీఆర్.. జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా, కాంగ్రెస్ నేత సచిన్‌పైలట్‌తో కలిసి పాల్గొన్నారు. యువత ఎదుర్కొంటున్న పరిస్థితులపై రూపొందించిన 'ద యూత్ బారోమీటర్' నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణరంగంలో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవాలని, కష్టపడిపనిచేసే తత్వానికితోడు.. సాంకేతికతను, ఆధునిక విధానాలను పాటిస్తూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం యూనిక్ అని, టీఎస్ఐపాస్, టీహబ్ వంటివి ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పారు. అన్నిరాష్ట్రాలతోపాటు ప్రధాని మోదీ కూడా గుజరాత్‌లో ఇలాంటి విధానాలు ప్రవేశపెట్టలేదని చెప్పారు. 15 రోజుల్లో అనుమతులివ్వడం, అలా కాని పక్షంలో అధికారులకు జరిమాన విధించడం ఎక్కడాలేదని వివరించారు. టీఎస్ఐపాస్ ద్వారా ఆరువేల సంస్థలకు అనుమతులిచ్చామని, రూ.లక్షా 20వేల కోట్ల పెట్టుబడులొచ్చాయని, మూడు లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలతోపాటు మరెన్నో పరోక్ష ఉద్యోగాలు సృష్టించామని చెప్పారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలువడానికి ఇలాంటి ఆకర్షణీయ విధానాలు దోహదపడ్డాయని పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా హైదరాబాద్‌లో వ్యాపారం, మార్కెటింగ్‌కు అవకాశాలున్నాయని చెప్పారు. ప్రపంచంలో మరేదేశంలో లేనివిధంగా భారత్‌లో యువత ఉన్నదని చెప్పారు. రాజకీయాల కంటే కూడా ఎకనామిక్స్ ముఖ్యమని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎకనామిక్స్ భవిష్యత్తును బంగారుమయం చేస్తుందని, సంపద, ఉద్యోగాలు సృష్టించి సంక్షేమాన్ని చేరువ చేస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక ఉద్యోగాలను నిర్మాణరంగం అందిస్తున్నదని చెప్పారు. తక్కువ సమయంలోనే చైనా అనేక పట్టణాలు నిర్మించిందని, ఇక్కడా అలాంటివి చేపట్టడంలో యువత పాత్ర కీలకమని, వ్యవస్థను మార్చే బాధ్యత యువతదే అని పేర్కొన్నారు.



శుక్రవారం హెచ్ఐసీసీలో ప్రారంభమైన క్రెడాయ్ యూత్‌కాన్ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వారసత్వం నిలబెట్టుకోవడం సులభం కాదు

రాజకీయాల్లో అయినా, వ్యాపారంలో అయినా వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. వారసత్వంతో వచ్చినవారికి కాస్త అవకాశం ఉంటుందని, అయితే అది ఎంట్రీలెవల్ వరకే పనికొస్తుందని చెప్పారు. ఇతరులకంటే ప్రత్యేకత ఉంటుందని, శత్రువులు కూడా బయటికి గౌరవించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కానీ, దానివల్ల ఎంతోకాలం నిలబడలేమని, ప్రత్యేకతను చాటుకొంటేనే విజయం సాధిస్తామని చెప్పారు. విజయం సాధించాలనే మొదటితరంలో ఉన్న కాంక్షను ప్రస్తుత తరం అందిపుచ్చుకోవాలన్నారు. ప్రత్యేకత చాటుకోవాలని, సొంత ముద్ర వేయాలని సూచించారు.

మోదీ వ్యాఖ్యలు సమంజసం కాదు

- విభజనపై ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టిన కేకే
- విభజన హామీలను వెంటనే నెరవేర్చాలని రాజ్యసభలో డిమాండ్
- బడ్జెట్‌లో ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని ఆగ్రహం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను టీఆర్‌ఎస్ పార్లమెంటరీపార్టీ నాయకుడు కే కేశవరావు తప్పుపట్టారు. రాష్ట్ర విభజన సహేతుకంగా జరుగలేదని ప్రధాని పార్లమెంట్‌లో పదేపదే అనడం సమంజసంగా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అరవై ఏండ్లపాటు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. విభజనను అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఎన్ని కుతంత్రాలు పన్నినా చివరకు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని కేకే చెప్పారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు డిమాండ్ మేరకు నాటి మన్మోహన్ సర్కారు ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని మినహాయింపులు, ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిందని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. నాడు ఇచ్చిన హామీని కేంద్రప్రభుత్వం సాకారం చేయాలని, అందుకు తాము మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రబడ్జెట్‌లో సరైన కేటాయింపులు జరుగలేదని, ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించాలని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ తెరమరుగైందని, రూ. 10వేల కోట్లు అడిగితే మొండిచేయి చూపారన్నారు. కాజీపేట్ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు, ఐఐఎం, ఏఐఐఎంఎస్, గిరిజనయూనివర్సిటీ, ఐటీఐఆర్, మెగా టెక్స్‌టైల్స్ పోర్ట్స్ ఫండ్స్, ఫిషరీస్ రీసెర్చ్ సెంటర్ ఇలా అన్ని హామీలనూ విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.49 గంటలకు

సూర్యాస్తమయం: 6.12 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం దశమి మధ్యాహ్నం 2.46 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ రాత్రి 7.53 వరకు, తదుపరి మూల, అమృతఘడియలు: ఉదయం 10.00 నుంచి 11.36 వరకు, రాహుకాలం: ఉదయం 9.39 నుంచి 11.05 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.49 నుంచి 8.20 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ



పొత్తు కుదితే ఒక్క టిక్కెట్‌తో రెండు సిన్మాలు చూసినట్టుంటుందట.. బాగుంటుంది అంటున్నాడు సార్!

ఉత్తమ్‌ది కాలకేయ ముఠా

- ఏడు సీట్లయినా గెలువండి చూద్దాం: కాంగ్రెస్‌కు మంత్రి తలసాని సవాల్
- ప్రజల మనసులో మాటే కేటీఆర్ చెప్పారు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- తెలంగాణ బాహుబలి కేసీఆర్: టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్
- వారిది బుట్టేచోర్ బ్యాచ్: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తలసాని, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో ఎమ్మెల్యే గణేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లు కాదు కదా కనీసం ఏడు సీట్లు గెలువాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్ విసిరారు. గడ్డాలు మీసాలు పెంచుకొంటే సీట్లు గెలుస్తామనుకోవడం భ్రమే అవుతుందని ఎద్దేవాచేశారు. సీఎం కేసీఆర్ కాంగ్రెస్ కంటే వందరెట్లు అద్భుతంగా పాలిస్తున్నారని.. కాంగ్రెస్ నాయకులు ఈర్ష్య, అక్కసుతో ఏదిపడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. మిత్రపక్షాలకు సున్నంపెట్టిన చరిత్ర బీజేపీదని విమర్శించారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఇప్పుడున్న సీట్లను గెలుస్తారా? అని బీజేపీ నేతలకు సవాల్ విసిరారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో మంత్రి తలసాని మాట్లాడుతూ.. గొర్రెలు మేకలు పంచుతారా? అని విమర్శిస్తున్న నేతలు యాదవుల దగ్గరికిపోయి అడిగితే వారే బుద్ధిచెప్తారని హెచ్చరించారు. మంత్రి కే తారకరామారావు తన రాజకీయ జీవితాన్ని పణంగాపెట్టి రిటైర్‌మెంట్ దశలో ఉన్న ఉత్తమ్‌కు సవాల్ విసిరారని, అయినా నేరుగా స్పందించలేదని చెప్పారు. తెలంగాణను సోనియాగాంధీ ఊరికే ఇచ్చారా? అని ప్రశ్నించారు. పోరాటాల సెగ ఢిల్లీకి తగిలిన తర్వాతనే తెలంగాణ ఇచ్చారని.. అయినా ఆ పార్టీని ప్రజలు ఎందుకు తిరస్కరించారో తెలుసుకోవాలని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్‌కు ప్రజలే గాడ్‌ఫాదర్స్ అని పేర్కొన్నారు.

ప్రజల మనసులో మాటే కేటీఆర్ చెప్పారు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ నాయకులు దద్దమ్మలని ప్రజల మనసులోని మాటనే రాష్ట్ర మంత్రి కేటీఆర్ చెప్పారని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొనకుండా, అభివృద్ధికి సహకరించకుండా అడ్డుపడుతున్న కాంగ్రెస్ నాయకులను దద్దమ్మలు అనకుండా ఏమనాలని ప్రశ్నించారు. శుక్రవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ కాలిగోటికి సరిపోరని, ఆయనపై విమర్శలు చేయడమంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని పేర్కొన్నారు. రాహుల్ చదువులో, అనుభవంలో మంత్రి కేటీఆర్‌కన్నా పెద్దవాడు కాదని.. కేటీఆర్ సిరిసిల్ల నుంచి సిలికాన్‌వ్యాలీ వరకు అభినందనలు అందుకున్నారన్నారు.

ఉత్తమ్‌ది కాలకేయ ముఠా: ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

సీఎం కేసీఆర్ తెలంగాణ బాహుబలి కాగా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిది ప్రజల ఉసురుపోసుకొనే కాలకేయ ముఠా అని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. ధృతరాష్ట్ర కౌగిలి నుంచి తెలంగాణ ప్రజలను బయటపడేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారు. శుక్రవారం ఆయన టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో.. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ధర్మరాజులా పాలిస్తున్నారు కాబట్టే ఆయనను ప్రజలు దీవిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నది ఉన్నట్టుగా అంటే ఉలిక్కిపడిన కాంగ్రెస్ నాయకులు మంత్రి కేటీఆర్‌పై పిచ్చి మాటలు మాట్లాడటం మొదలుపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. సమర్థవంతమైన పనితీరుతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతూ, అనేక అభివృద్ధి కార్యక్రమాలను భుజానికెత్తుకున్న మంత్రి కేటీఆర్ భారతంలో బాలచంద్రుడి లాంటి వారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు బుట్టేచోర్ బ్యాచ్‌లా తయారయ్యారని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు మండిపడ్డారు. గూగుల్‌లో 'పప్పు' అని సెర్చ్‌చేస్తే 'రాహుల్' అని వస్తుందని ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ ఎదుగుదలను, డైనమిజాన్ని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే బిగాల గణేష్ ధ్వజమెత్తారు.

ఓయూలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ ఊరేగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దాసోజు శ్రవణ్‌లాంటివారు మంత్రి కేటీఆర్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని టీఆర్‌ఎస్వీ ఓయూ అధ్యక్షుడు గదరాజు చందు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా ఆ పార్టీ దిష్టిబొమ్మను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాను రాను ఉత్తకుమార్‌రెడ్డిగా మారిపోయారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ్ అక్రమాలు చేశారని ఆరోపించారు. టీఆర్‌ఎస్వీ నాయకులు రఘురాం, జంగం అవినాశ్, పడాల సతీశ్, కృష్ణ, నవీన్, క్రాంతి, దత్తాత్రి, ప్రవీణ్, కృష్ణ, జలందర్, కరుణాకర్, పరుశరాం, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.

పీజీటీ పోస్టుకు ఎంపికైనవారు టీజీటీని వదులుకోవచ్చు

ఆప్షన్ కోసం ఈ నెల 14 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గురుకులాల్లో పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తమ ఆసక్తిని బట్టి టీజీటీ పోస్టును వదులుకోవడానికి ఆప్షన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ విజ్ఞప్తి చేసింది. టీజీటీ పోస్టును వదులుకుంటున్నట్టుగా.. ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్ ఇవ్వడం కోసం ఈనెల 14 వరకు గడువు విధించామని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ ఏ వాణీప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఖాళీగా ఉండే టీజీటీ పోస్టులను ఆ తర్వాత మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

పీహెచ్‌డీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

- న్యాక్ ఏ గుర్తింపు ఉన్న వర్సిటీల్లోనే..
- మిగితా యూనివర్సిటీల్లో యూజీసీ ప్రకారమే ప్రవేశాలు
- ప్రతిపాదనలు సిద్ధంచేసిన త్రిసభ్య కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీహెచ్‌డీ ప్రవేశాల కోసం అన్ని యూనివర్సిటీలకు కలిపి ఉమ్మడి నిబంధనలను రూపొందించడంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నది. న్యాక్ ఏ గుర్తింపు పొందిన యూనివర్సిటీలకు మాత్రమే సొంతంగా ప్రవేశపరీక్ష నిర్వహించుకుని పీహెచ్‌డీ ప్రవేశాలను చేసుకునే అధికారాలను కల్పించనున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు విధివిధానాలపై ఓయూ వీసీ, జేఎన్టీయూహెచ్ వీసీ, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీతో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. న్యాక్ ఏ గుర్తింపు లేని యూనివర్సిటీల్లో యూజీసీ నిబంధనల ప్రకారమే పీహెచ్‌డీ ప్రవేశాలను నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో తయారుచేసిన కమిటీ నివేదికను ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదించే అవకాశాలు ఉన్నాయన్నారు.

పాత నిబంధనల ప్రకారమే దోస్త్-2018

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ఏడాదిలో నిర్వహించినట్టుగానే 2018-19 విద్యా సంవత్సరంలోనూ దోస్త్ నిర్వహించాలని విద్యాకమిషనర్‌ను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జీవో 38ని జారీ చేశారు.

ఎమ్మార్పీకి మించి మద్యం అమ్మితే

దొరికిపోయే యాప్

నేడు ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయించే వ్యాపారుల ఆట కట్టించే విధంగా రూపొందించిన సరికొత్త యాప్‌ను శనివారం ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ ఆవిష్కరించనున్నారు. ఈ యాప్‌లో మద్యం బ్రాండ్లకు సంబంధించిన ఎమ్మార్పీ రేట్లు పొందుపర్చి ఉంటాయి. వినియోగదారుడు మద్యాన్ని కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు ఎక్కువ ధరలు వసూలు చేస్తే వెంటనే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు నేరుగా ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న కాల్‌సెంటర్‌కు చేరుతుంది. దానిపై వెంటనే చర్యలు తీసుకుంటారు.



పకోడీలు అమ్ముకోవటం ద్వారా జీవనాధారం పొందటాన్ని ప్రధాని మోదీ గొప్పగా చెప్పుకొచ్చారు. చదువుకున్న కొడుకుల నిరుద్యోగాన్ని చూసి తల్లిదండ్రులు పడుతున్న బాధ మోదీకి తెలువదు. ఏ తండ్రీ తన కొడుకు పకోడీ అమ్ముకొని బతుకాలని కోరుకోడు.


నీరజ్ శేఖర్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ

రైతులు, పేదల అభ్యున్నతి కోసం మోదీ తీవ్రంగా తపిస్తున్నారు. ఆరోగ్య పథకంతో పదికోట్ల మంది లబ్ధి పొందుతారు. ఇక ఆయుధాల ఒప్పందం గురించి స్థూలంగా వివరాలన్నీ లోక్‌సభకు సమర్పించాం. కానీ నిర్దిష్టమైన వివరాలు, ఆయుధాల రకాలు, ధరలు చెప్పటం వీలు కాదు.

అనంత్‌కుమార్, కేంద్ర మంత్రి



చరిత్రలో నేడు



1824

పెరూ పాలకుడిగా సైమన్ బొలివర్.

1846

ఆంగ్లో-సిక్కు యుద్ధంలో సిక్కులను ఓడించిన ఈస్టిండియా కంపెనీ.





1923

జిగట సిరా (ఇంక్ పేస్ట్)ను తయారుచేసిన స్టాండర్డ్ ఇంక్ కంపెనీ.

భారత్-పాక్‌ల మధ్య అంతర్జాతీయ సరిహద్దు వెంట కాల్పుల ఉల్లంఘనలు సాధారణమైపోయాయి. 2003లో ఇరుదేశాల మధ్య కుదిరిన చారిత్రక కాల్పుల విరమణ ఒప్పందం క్రమంగా నీరుగారిపోయింది. సరిహద్దు వెంట చెదురుమదురు ఘటనలు మొదలుకొని ఇప్పుడు ఇరువైపులా సైనికాధికారుల మరణందాకా వచ్చింది. కార్గిల్ యుద్ధం తర్వాత ఇరుదేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. అణ్వాయుధశక్తి కలిగిన ఇరు దేశాలూ సంయమనం పాటించాలి. శాంతి, సామరస్యాలకు అత్యున్నతస్థాయిలో చర్చలు మొదలు కావాలి.

ది హిందూ

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఈ సందర్భాన్ని కూడా కాంగ్రెస్‌పై విమర్శలకు వేదికగా చేసుకోవటం రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనేనని అర్థమవుతున్నది. మంచి విద్య, అందరికీ ఇండ్లు, మౌలిక వసతులపై కేంద్రీకరిస్తామని చెప్పకుంటున్న కేంద్రం అవి వాస్తవరూపం దాల్చేందుకు కృషిచేయాలి. కేవలం ఎన్నికల కోసమే విమర్శలు చేస్తే పాలకపక్షం బాధ్యత తీరిపోదు. యువభారత్‌గా, నైపుణ్యాలు కలిగిన భారత్ అభివృద్ధి బాటన నడిచేందుకు అందరూ కృషి చేయాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సౌహార్ద్ర సందేశం

కన్నీటి ధారలకు కత్తులు వంగిపోయాయి. మత కక్షలను క్షమాభిక్ష రూపుమాపింది. మత రాజకీయం మీద మానవత్వానిదే పైచేయి అయింది. దేశమంతా విద్వేష దాడులు సాగుతున్న వేళ పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ ప్రాంతవాసులు సౌహార్ద్ర సందేశాన్ని వినిపించారు. ద్వేషం వల్ల సాధించేదేమీ లేదని, సౌభ్రాతృత్వమే బతుకుకు భరోసా ఇస్తుందని చాటిచెప్పారు. ఒకప్పుడు ముజఫర్‌నగర్ అంటేనే మత కలహాలకు మారుపేరుగా వినిపించేది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నకాలంలో– 2013 ఆగస్టు– సెప్టెంబరులలో భారీఎత్తున మతకలహాలు చెలరేగాయి. ఇరు మతాలకు చెందిన 62 మంది ఆ కలహాలలో బలయ్యారు. మరో 93 మంది గాయపడ్డారు. యాభైవేల మంది నిర్వాసితులయ్యారు. నిన్నమొన్నటివరకు ఒక సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న ప్రాంతం మీదుగా మరో వర్గం వారు వెళ్ళాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఈ భయానక పరిస్థితులలో కొందరు ధైర్యం చేసి మరో వర్గం నివసించే ప్రాంతానికి వెళ్ళి స్నేహం హస్తం చాపారు. కానీ మైత్రి నెలకొనడం అంత సులభం కాదు. ఇరు వర్గాలలో గాయాలు ఇంకా మానిపోలేదు. అయినా సరే కొందరు పెద్దలు అనేక రాయబారాలు సాగించారు. చివరికి రెండు వర్గాలలోనూ ఆత్మపరిశీలన మొదలైంది. శాంతి చర్చలు సాగే కొద్దీ ఒక్కో అడుగు ముందుకు పడ్డది. ఒకటి రెండు మహా పంచాయతీలలో కొంత మార్పు కనిపించింది. చివరికి నిర్వాసిత ముస్లింలు ఉంటున్న బారా బస్తీలో ఈ నెల నాలుగవ తేదీన జరిగిన మూడవ పంచాయితీతో ముడిపడ్డది. ముజఫర్‌నగర్ బాధితులు దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయాన్ని లిఖించారు.

మహా పంచాయతీ వేదిక మీదికి వచ్చిన ఒక జాట్ పెద్ద ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ, దాడులు జరిగినందుకు తమ వర్గాన్ని క్షమించవలసిందిగా అర్థించాడు. అల్లర్లకు మూల కారణాలను ఆయన వివరించాడు. ఒక జాట్ కులస్తుడి తలను బండతో పగుల కొడుతున్న వీడియో మొబైల్ ఫోన్స్ ద్వారా వ్యాపించిందని, అదే తమ కులస్తులను రెచ్చగొట్టిందని ఆయన బాధపడ్డాడు. ఆ వీడియో చిత్రీకరణ అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబన్ శిబిరంలో జరిగిందని కూడా ఆయన వెల్లడించాడు. ఆ తరువాత ఒక ముస్లిం పెద్ద వేదిక మీదికి వచ్చి దాడులు సాగించినందుకు తమ వర్గాన్ని క్షమించవలసిందిగా చేతులు జోడించి కోరాడు. ఒక ముస్లిం పాత్రికేయుడిని హతమార్చినట్టు పుకారు వ్యాపించడం వల్ల కొందరు యువకులు రెచ్చిపోయారని ఆయన వివరించాడు. కుత్బా గ్రామంలో ముస్లింలపై జాట్లు దాడులు సాగించారు. కాక్రా గ్రామంలోని జాట్లపై పొరుగు గ్రామమైన పూర్ బాల్యన్ గ్రామ ముస్లింలు దాడులు చేశారు. వేదిక ముందు రెండు వర్గాలకు చెందిన బాధిత కుటుంబాలున్నాయి. బిడ్డలను పోగొట్టుకున్న తల్లులు రెండు మతాలలోనూ ఉన్నారు. ఇక్కడ ఎవరూ నేరస్తులు కారు, అందరూ బాధితులే! కన్నీళ్ళకు, కడుపు కోతకు మతం లేదు. మారణ హోమానికి బలైన కుటుంబాల వారంతా రోదించారు. సమావేశం చివరలో, వేదికపై నుంచి చేసిన విజ్ఞప్తి మేర కు, హిందువులు 'అల్లాహో అక్బర్' అని నినదించారు. ముస్లింలు 'హరహర మహాదేవ' అంటూ గొంతు కలిపారు. ఆ రెండు నినాదాలతో వారికి మతం కాదు, సహృద్భావం ధ్వనించింది. హంతకులకు మతం లేదు, ఆ మారణహోమంలో ఎవరు ఎవరిని హతమార్చారో తెలువదు. కానీ అమాయకులు పోలీసు కేసులతో సతమతమవుతున్నారు.

> **కన్నీళ్ళకు, కడుపు కోతకు మతం లేదు. మారణ హోమానికి బలైన కుటుంబాల వారంతా రోదించారు. సమావేశం చివరలో, వేదికపై నుంచి చేసిన విజ్ఞప్తి మేర కు, హిందువులు 'అల్లాహో అక్బర్' అని నినదించారు. ముస్లింలు 'హరహర మహాదేవ' అంటూ గొంతు కలిపారు. ఆ రెండు నినాదాలతో వారికి మతం కాదు, సహృద్భావం ధ్వనించింది. హంతకులకు మతం లేదు, ఆ మారణ హోమంలో ఎవరు ఎవరిని హతమార్చారో తెలువదు. కానీ అమాయకులు పోలీసు కేసులతో సతమతమవుతున్నారు. పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని ఇరు వర్గాల వారు నిర్ణయానికి వచ్చారు.**

పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని ఇరు వర్గాల వారు నిర్ణయానికి వచ్చారు. ప్రజలలో తప్పుడు కేసులు ఒక ప్రధానాంశంగా రగులుతున్నదని యూపీలోని బీజేపీ ప్రభుత్వం గ్రహించింది. రాజకీయ ప్రేరేపితమైన ఇరువై వేల కేసులను ఉపసంహరించుకుంటున్నామని ముఖ్యమంత్రి కూడా ప్రకటించారు.

జాట్‌లకు, ముస్లింలకు మధ్య వైషమ్యాలు ఎన్నడూ లేవు. జాట్‌కులస్తులలో హిందువులు ఉన్నారు, ముస్లింలూ ఉన్నారు. చరణ్‌సింగ్ నాయకత్వాన రైతువర్గానికి రాజకీయ రూపం ఇవ్వడంలో ఇరు మతాల వారూ ఉన్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో పడ్డప్పుడు, తికాయత్ నాయకత్వంలో సాగిన రైతు ఉద్యమానికి మతం రంగులేదు. సమాజంలో అనేక అవసరాలకు పరస్పరం ఆధారపడి ఉన్నారు. కానీ మత రాజకీయం వారి మధ్య సరిహద్దులు గీసింది. వారి మనసుల్లో ద్వేషాగ్నిని రగిలించింది. నేను జాట్‌గా ఉన్నప్పుడు ఊళ్ళో ఏ సమస్యలు లేవు. మతవాదిగా మారిన తరువాతే సమస్య మొదలైంది అన్నాడొక పెద్ద మనిషి. వ్యవసాయరంగంలో వచ్చిన మార్పు వల్ల కమతాలు చిన్నవై పోయాయి. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. జాట్ యువతలో అసంతృప్తి మొదలైంది. ఈ అసంతృప్తిని మత రాజకీయాలు రగిలించడానికి కొన్నిశక్తులు వాడుకున్నాయి. ఇప్పుడు వారిని ఆవహించిన మతభూతం వదిలిపోయింది. ఒక మతం వారి ఇంటిలో ప్రభోజనానికి ఇతర మతస్తులను ఆహ్వానించడం మళ్ళా మొదలైంది.

జనగళం

రజకులపై సీఎం కేసీఆర్ కరుణ

తెలంగాణ ప్రాంతంలో తరతరాలుగా రజకులు సంప్రదాయ వృత్తినే నమ్ముకొని జవనం కొనసాగిస్తున్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో వృత్తి కరువై పట్టణాలకు వలసలు పెరిగాయి. రజక వృత్తిలో పెట్టుబడిదారులు చొరబడ్డారు. కోట్ల రూపాయలు వెచ్చించి భారీ డ్రైక్లీన్ మిషన్ల ఏర్పాటు చేస్తున్నారు. రజక వృత్తిలో రజకులనే కూలీలుగా మారుస్తున్నారు. దీంతో రజకుల జీవితాలు ఎప్పటిమాదిరిగానే మిగిలిపోతున్నాయి. గత ప్రభుత్వాల ఉదాసీన, నిర్లక్ష్య విధానాల కారణంగా రజకులను వారి వృత్తిలోనే కూలీలుగా చూస్తున్నారు. పెద్దపెద్ద లాండ్రీ, డ్రై క్లీనింగ్ షాపుల యజమానులు శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. రజకుల దుస్థితి చూసిన తెలంగాణ ప్రభుత్వం రజకుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషిచేస్తున్నది. ఇందులో భాగంగానే రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, రజక సహకార సంఘాల సమాఖ్య సహకారంతో రజకుల అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందిస్తున్నది.

దీనికోసం తెలంగాణ రజక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటుచేసి రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రజక సంఘాల కోరికమేరకు 2017–18 బడ్జెట్‌లో 250 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. 31జిల్లాలలో పెద్ద ఎత్తున 1300 రజక ప్రతినిధులతో ప్రభుత్వం ఎగ్జిబిషన్ నిర్వహించింది. దీంతో పాటు ఆధునిక వాషింగ్ మిషన్ల వాడకంపై రజక వృత్తిదారులకు అవగాహన కల్పించింది.

సంప్రదాయకంగా మురికి నీటిలో బట్టలు ఉతుకుతూ రోగాల బారిన పడకుండా ఆధునిక పద్ధతులతో వృత్తిని కొనసాగించేందుకు అవసరమైన సాయం అందిస్తున్నది. ఇకనుంచి రజక కులస్తులు మురికినీళ్లల్లో బట్టలుతికే విధానం పోవాలి. గత ప్రభుత్వాలకుభిన్నంగా తెలంగాణ ప్రభుత్వం రజకుల అభ్యున్నతి కోసం నిబద్ధతతో కృషిచేస్తున్నది. మురికినీళ్ళల్లో బట్టలుతికే విధానానికి స్వస్తి చెప్పడానికి గ్రేటర్ హైదరాబాద్‌లో పదిచోట్ల, జిల్లా కేంద్రానికి ఒకటి చొప్పన ఆధునిక లాండ్రీ యూనిట్లను ఏర్పాటు చేయటానికి కసరత్తు చేస్తున్నది. అలాగే సంప్రదాయ వృత్తి పనులకు గౌరవందక్కేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలకు సీఎం కేసీఆర్ చొరవచూపటం హర్షణీయం.

– కొండూరు సత్యనారాయణ
రాష్ట్ర కన్వీనర్
(తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

ఊపర్ షేర్వానీ అందర్ పరేషానీ

నోట్ల రద్దు బాధితుడు, పీడితుడు యాదగిరికి మొన్న ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జనరల్ బడ్జెట్ సంతృప్తి కలిగించలేకపోయింది. ఒకటి శాతం సంపన్నులను, బిలియనీర్లను మినహాయిస్తే, 130 కోట్ల మంది సామాన్య భారతీయుల్లో యాదగిరి ఒకడు. అన్నిబాధలు యాదగిరివే. టీవీ ఛానళ్లలో, అక్కడ ఇక్కడ కొందరు నోరారా, చెవులూర శ్లాఘిస్తుంటే యాదగిరి మాత్రం 'అదోలా' (వందేండ్ల వేలాది తెలుగు కథల్లో తరచూ వినిపించే, కనిపించే పదాలు 'అదోలా', 'పెదాలు') ముఖం పెట్టి 'దెబ్బకు దయ్యం వదిలింది' అన్నాడు.

దెబ్బేందో, దయ్యమేందో 351వ ఎపిసోడ్‌లో చూడండంటూ స్పెన్స్‌తో చంపకుండా యాదగిరి వెంటనే అన్నడు. 'ఈ మధ్య గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో గ్రామీణ పేద ప్రజలు నిర్భయంగా గర్జించి దెబ్బకొట్టకుంటే దయ్యం వదలకపోయేది. మోదీజీ ప్రభుత్వాల ఈ 5వ బడ్జెట్ కూడా గత 4 బడ్జెట్ల వలెనే ఉండేది' అన్నడు. యాదగిరి అతి సామాన్యుడు. దినదిన గండంగా బతుకుబండిని గుంజుకొస్తున్నడు. ఆర్థిక సమస్యలో, ఇంకే సమస్యలో ఉన్నవని భార్యను, ముద్దుబిడ్డలను చంపి, తాను చావాలనుకొని ధైర్యవంతుడు యాదగిరి. 'ఫిర్ సుబహోగీ' అన్న ఆశావాదం యాదగిరిది. మోదీజీ కేవలం మాటల్లో చూపి భ్రమింపజేసే 'మంచి రోజులు' కేసీఆర్ చేతలతో నిజంగా వస్తున్నాయని దృఢంగా విశ్వసిస్తున్న వాడు యాదగిరి. ఈ దేశంలోని అతి సామాన్యుల్లో ఒకడైన యాదగిరి మొన్నటి అరుణ్‌జైట్లీ 5వ (ఈ టర్మ్‌లో చివరి) బడ్జెట్‌పై కొంచెం క్రూడ్‌గా వ్యక్తపరిచిన అభిప్రాయాన్ని ఈ దేశంలో అసంఖ్యాక పాఠక జనం, అనన్య ప్రచారం గల ఒక ఇంగ్లిష్ దినపత్రికకు వాషింగ్టన్ నుంచి పొలిటికల్ రైటప్‌లు పంపించే ప్రసిద్ధ పత్రికా రచయిత, మేధావి సాఫిస్టిటెడ్‌గా, సటల్‌గా, సోబర్‌గా వ్యక్తపరిచిన అభిప్రాయం ఇది.. 'త్వరలో 8 రాష్ట్రాల్లో శాసనసభల ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికలు లేనట్లయితే ఈ బడ్జెట్ రూపం మరోవిధంగా ఉండేది' అంటూ ముక్తాయింపు పలికాడు. మోదీజీ, ట్రంప్ ద గ్రేట్ ఆలింగన మిత్రులే కాదు అపూర్వ సహోదరులు కూడా. ఈ ఫిబ్రవరి 1 అనంతరం ఇక్కడ, ఈ దేశంలో, అక్కడ అమెరికా (యూఎస్‌ఏ)లో ఆర్థిక మార్కెట్లు కుప్పకూలాయి, కోలుకోవడం సులభం కాదు. అంకెలు తమ అసలు స్వరూపాన్ని మరుగుపరుస్తూ అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తూనే వలపింపజేసే, విలపింపజేసే సంఖ్యారణ్యం బడ్జెట్. తమిళనాడు తొలి ముఖ్యమంత్రి, మదరాసు రాష్ట్రం (స్వాతంత్ర్యానంతరం) చివరి ముఖ్యమంత్రి, తమిళతలంపై ప్రాంతీయ పార్టీ పాలనాశకం ప్రారంభకుడు అరిగ్నర్ అన్నాదురైను (కంజీవరం నటరాజన్ అన్నాదురై) ఒక మిత్రుడు అడిగాడు మొన్న వచ్చిన బడ్జెట్‌ను చదివినవా అని. 'చదువలేదు. చదవను' అన్నాడు. 'ఎందుకు' ఎదురుప్రశ్న. 'బడ్జెట్ చదివే సమయంలో ఒక సినిమా స్క్రిప్ట్ రాసుకోవచ్చు' అన్నా సమాధానం. అన్నాదురై పవర్‌ఫుల్ రైటర్, ఒరేటర్. సినిమా, డ్రామా స్క్రిప్టులతో సామాజిక విప్లవం తెచ్చి, తమిళ రాజకీయాల రంగు, రుచి మార్చిన ఉద్యమకారుడు ఆయన. జయలలిత శవం పక్కనే శవరాజకీయం ప్రారంభించినవాళ్లు అన్నా నేలపై సున్నా ఫలితంతో పలాయ మంత్రం పఠించకతప్పదు. ఉత్తరభారతం పెత్తనాన్ని, మొత్తం దేశం నెత్తిమీద హిందీ భాష రుద్దుడును (ప్రాంతీయ భాషల వికాసానికి విఘాతం కలిగిస్తూ) తీవ్రంగా వ్యతిరేకించిన దక్షిణ భారత నాయకుడు అన్నా. పరిస్థితులు మారినయి గనుక భారతదేశం నుంచి తమిళనాడు విడిపోయి స్వతంత్ర రాజ్యం.. తమిళ ఈలం.. ఏర్పాటుకావడం అనవసరమని విజ్ఞత, కాలజ్ఞత ప్రకటించిన మొట్టమొదటి మేటి ద్రవిడ కజగం నాయకుడు అన్నాదురై. ద్రవిడ కజగం అధినేత, తన నేత రామస్వామి నాయకర్ తాను ప్రవచించిన సిద్ధాంతాలకు తిలోదకాలు ఇస్తున్నప్పుడు అన్నాదురై తిరుగుబాటు బావుటా ఎత్తి ద్రవిడ మున్నేత్ర కజగం (డీఎంకే) పార్టీని స్థాపించారు. కరుణానిధి, యంజీ రామచంద్రన్, జయలలిత తదితర అప్పటి యువనేతలందరూ అన్నా అడుగుజాడల్లో నడిచారు. ఇప్పటికీ కజగం పార్టీలన్నీ అన్నా పేరుతోనే అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నాయి. అన్నాదురై అధికారం చేపట్టిన ముహూర్త బలం ఎటువంటిదో కానీ యాభై ఏండ్లయినా జాతీయ పార్టీ ముద్రగల పార్టీలేవీ చెన్నైలో తలెత్తి నిలువలేకపోతున్నాయి.

అన్నాదురై భారత ప్రభుత్వ బడ్జెట్ ప్రసంగం చదువడానికి ఇష్టపడలేదు. కానీ, స్వతంత్ర భారతదేశం ప్రథమ ఆర్థికమంత్రి ఆర్.కె. షణ్ముఖంషెట్టి తమిళుడు. 1947–49లలో ఆయన కేంద్ర ప్రభుత్వంలో, జవహర్‌లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో ఆర్థికమంత్రి. షణ్ముఖం షెట్టి తర్వాత, జవహర్‌లాల్ ప్రభుత్వంలో రెండో ఆర్థికమంత్రి జాన్‌మత్తయి మళయాళీ. షెట్టి, మత్తయి ఇద్దరు మద్రాసు విశ్వవిద్యాలయం పట్టభద్రులు, ప్రఖ్యాత ఆర్థికవేత్తలు. షెట్టి తర్వాత 1949–50లలో కేంద్ర ఆర్థికమంత్రిగా వ్యవహరించిన మత్తయి జాతీయ ప్రణాళికా సంఘం, జవహర్‌లాల్ సన్నిహితుడు పి.సి.మహలనోబిస్ ప్రణాళికా విధాన రూపకల్పనలో ప్రాధాన్యం పొందడం ఇష్టంలేక నిరసన తెలుపుతూ 1950 బడ్జెట్‌ను ప్రవేశపెట్టగానే రాజీనామా చేశారు. తర్వాత మత్తయి స్థానంలో వచ్చిన కేంద్ర ఆర్థికమంత్రి చింతామణి ద్వారకనాథ్ దేశ్‌ముఖ్ (సి.డి.దేశ్‌ముఖ్). దేశ్ ముఖ్ 1950 నుంచి 1956 వరకు ఆరేండ్ల దీర్ఘకాలం ఆర్థిక మంత్రి పదవిని అత్యంత ప్రతిభావంతంగా నిర్వహించడం విశేషం. రాజకీయాలు, పార్టీలతో సంబంధంలేని దేశ్‌ముఖ్ బ్రిటిష్ ప్రభుత్వంలో సీనియర్ ఐసీఎస్ అధికారి. బ్రిటిష్ ప్రభుత్వం దేశ్‌ముఖ్‌ను 1943లోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా నియమించింది. ఈ ఉన్నత పదవి నిర్వహించిన మొదటి భారతీయుడు దేశ్‌ముఖ్. నాటి రాజకీయాల్లో ప్రాబల్యం వహించిన మొరార్జీ దేశాయి విముఖత కారణంగా జవహర్‌లాల్ ప్రభుత్వం బొంబాయి ప్రెసిడెన్సీ విభజనకు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఏర్పాటుకు అంగీకరించలేదు. మహారాష్ట్ర నిర్మాణానికి అంగీకరించనందుకు నిరసనగా సి.డి.దేశ్‌ముఖ్ ఆర్థికమంత్రి పదవికి రాజీనామా ఇచ్చారు. దేశ్‌ముఖ్ సంస్కృత పండితుడు. ఆయన బడ్జెట్ ప్రసంగాల్లో సంస్కృత హితోక్తులు, సూక్తులు వినిపించేవి. తమిళ ఆర్థిక మంత్రుల బడ్జెట్ ప్రసంగాల్లో తిరుక్కురల్ హిత వాక్యాలు ప్రతిధ్వనించేవి. దేశ్‌ముఖ్ అనంతరం 1957–58లలో కేంద్ర ఆర్థికమంత్రిగా (స్వాతంత్ర్యం అనంతరం మొదటి పదేండ్లలో మూడవ దక్షిణ భారత ఆర్థిక మంత్రి–ముగ్గురు మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం పట్టభద్రులు) వ్యవహరించిన టి.టి.కృష్ణమాచారి 1958లో ముంద్రా కుంభకోణం కారణంగా రాజీనామా ఇవ్వకతప్పలేదు. టి.టి.కె.రాజీనామా తర్వాత కొద్దిరోజులు ప్రధాని జవహర్‌లాల్ స్వయంగా ఆర్థిక శాఖను నిర్వహించారు. తర్వాత మొరార్జీ దేశాయి 1963 వరకు కేంద్రంలో ఆర్థికమంత్రి. టి.టి.కె.కు ఏ శాఖ ఇచ్చినా ఆర్థికమంత్రిత్వ శాఖను ఇవ్వబోనని పట్టుబట్టిన జవహర్లాల్ తర్వాత తన చివరిరోజుల్లో పట్టు సడలించారు. టి.టి.కె.రెండోసారి 1964–65లలో కేంద్ర ఆర్థికమంత్రి. ఆయన స్థానంలో లాల్‌బహదూర్‌శాస్త్రి నియమించిన ఆర్థికమంత్రి బెంగాలీ సచీంద్ర చౌధరి ప్రసంగాల్లో ఠాగోర్ వాక్యాలు వినిపించేవి. గాలిబ్ తదితర ఉర్దూ కవుల మాటలు వినిపించినవి మన్మోహన్‌సింగ్ బడ్జెట్ ప్రసంగాలు. షెట్టి, మత్తయి, సి.డి.,చౌదరి, మన్మోహన్‌సింగ్ నిజానికి భారత జాతీయ కాంగ్రెస్‌తో, కాంగ్రెస్ రాజకీయ సంస్కృతితో సంబంధం లేనివారు. భారత జాతీయ కాంగ్రెస్‌తో సంబంధం లేని ప్రముఖులను, మేధావులను కూడా మంత్రివర్గంలో చేర్చుకోవాలని గాంధీజీ ఇచ్చిన సలహాలను గౌరవించి జవహర్‌లాల్ తన క్యాబినెట్‌లో షెట్టి, మత్తయి, సి.డి., శ్యాంప్రసాద్ ముఖర్జీ, బీఆర్ అంబేద్కర్ తదితరులకు స్థానం ఇచ్చారు.

> బిపిన్ రావత్ దైనిక ప్రసంగాలు, వ్యాఖ్యలే ఈ దేశం ఇచ్చే జవాబులా? పార్లమెంట్‌లో చంద్రబాబు గొంతు వినిపించి, గోడు చెప్పి మోదీజీ తన 'మన్‌కీ బాత్' వినిపించాడని, తెలంగాణ పట్ల తనకున్న అసహనాన్ని వ్యక్తపరిచాడని యాదగిరి అంటాడు. దేశ విభజన, దేశానికి స్వాతంత్ర్యం ఇష్టంలేని వాళ్లు బ్రిటిష్ పాలకుల తొత్తులుగా వ్యవహరించి క్విట్ ఇండియా ఉద్యమంలో ద్రోహం చేశారని, క్షమార్పణ పత్రాలు రాసిచ్చారని కూడా సామాన్యుడు యాదగిరి అంటున్నాడు.

తిండి లేకుండా 4 రోజులు లంఖణం పెట్టించి 5వ రోజు వచ్చి అడిగిండట హైదరాబాద్ బిర్యానీ కావాలా అని. మోదీజీ ప్రభుత్వం, అందులోని ఆర్థికమంత్రివర్యులు 2014 నుంచి నాలుగేండ్లు బడ్జెట్‌లలో భారత గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయం, గ్రామీణ వృత్తులు, రైతుల బాగోగుల గురించి పట్టించుకోలేదు. ఇదే నాలుగేండ్లలో (ఢిల్లీలో మోదీజీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వారం రోజులకు తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ ప్రభుత్వం అనేక అవరోధాలతో, సమస్యలతో అవతరించి, వెంటనే ప్రగతిపథాన్ని ఎంచుకున్నాయి). తెలంగాణ ప్రభుత్వం రైతుల రుణమాఫీ మొదలుకొని మిషన్ కాకతీయ, భగీరథ, నిరంతర విద్యుచ్ఛక్తి సరఫరా, ఎకరానికి 8 వేల పెట్టుబడి, వివిధ గ్రామీణ వృత్తులకు ప్రోత్సాహం తదితర పథకాలతో గ్రామీణ బహుముఖ వికాసానికి, అపూర్వ అభివృద్ధికి కంకణం ధరించింది. మోదీజీ తన 5వ బడ్జెట్‌లలో గ్రామీణ ప్రాంతానికి, రైతులోకానికి అరచేతిలో వైకుంఠాన్ని, గగన కుసుమాలను, శశి విషాణాలను చూపిస్తున్నది. పైకం లేని పథకాలతో, అమలుకాని మాటలతో, ఆకర్షణీయ మయసభలతో రైతుల, గ్రామీణ వృత్తుల ఆకలి మంటలు ఆరవు. హైదరాబాద్ మిత్రుడొకాయన మోదీజీ డ్జెట్ 'ఊపర్ షేర్వానీ అందర్ పరేషానీ' అని అన్నాడు. గ్రామీణ ప్రాంతాన్ని ఉద్ధరించబోతున్నామన్న ఉధృత ప్రచారంతో రక్షణరంగాన్ని, మధ్యతరగతి కోట్లాది ప్రజలను, జీతభత్యాల మీద బతికే కోట్లాది ఉద్యోగ వర్గాలను మోదీజీ 5వ బడ్జెట్ ఘోరంగా అలక్ష్యం చేసింది. 'ముందు నీ శత్రువు శక్తిని సరిగ్గా తెలుసుకో' అని నాడు చాణక్యుడు తన యుద్ధతంత్రంలో మొదటిపాఠం చెప్పాడు. శత్రువు ప్రోత్సాహంతో కేవలం ముగ్గురే ముగ్గురు (పఠాన్‌కోట్ సైనిక శిబిరంపై దాడి మొదలుకొని, అంతకుముందు కూడా) మిలిటెంట్లు దాడిచేసి మన మూడురకాల సాయుధ బలగాలను మూడురోజుల పాటు ముప్పుతిప్పలు పెడుతున్నారు! ఈ మాట అంటే దేశభక్తి లేనట్లా? బిపిన్ రావత్ దైనిక ప్రసంగాలు, వ్యాఖ్యలే ఈ దేశం ఇచ్చే జవాబులా? పార్లమెంట్‌లో చంద్రబాబు గొంతు వినిపించి, గోడు చెప్పి మోదీజీ తన 'మన్‌కీ బాత్' వినిపించాడని, తెలంగాణ పట్ల తనకున్న అసహనాన్ని వ్యక్తపరిచాడని యాదగిరి అంటాడు. దేశ విభజన, దేశానికి స్వాతంత్ర్యం ఇష్టంలేని వాళ్లు బ్రిటిష్ పాలకుల తొత్తులుగా వ్యవహరించి క్విట్ ఇండియా ఉద్యమంలో ద్రోహం చేశారని, క్షమార్పణ పత్రాలు రాసిచ్చారని కూడా సామాన్యుడు యాదగిరి అంటున్నాడు. సర్దార్‌పటేల్ ప్రధాని అయితే ఈ తొత్తులను, గాంధీజీ హంతకులను తొక్కిపెట్టేవాడని యాదగిరి అంటాడు. ఇటీవలి కోక డాబు బడ్జెట్ గురించి సామాన్యుడు యాదగిరి అభిప్రాయాలు చాలా ఉన్నాయి.

బడ్జెట్



కె. బాలకిషన్ రావు

అరకొర కేటాయింపులే!

ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర రైల్వే ప్రగతికి తగిన ఊతమిచ్చేలా కొంతమేర నిధుల కేటాయింపులు జరుగటం ఊరట నిస్తున్నది. ఏండ్ల తరబడి నత్తనడక నడుస్తున్న కొత్త రైలు మార్గాల నిర్మాణాలను పూర్తిచేయాలని రైల్వేశాఖ సంకల్పించటం ముదావహం. వివిధ పనుల నిర్మాణానికి రాష్ట్రానికి రూ.1813 కోట్లు కేటాయించింది. గతంతో పోలిస్తే 5 శాతం ఎక్కువని రైల్వే శాఖ చెబుతున్నది. కానీ నిర్మాణంలో ఉన్నవాటిని త్వరగా పూర్తిచేయాలంటే మరిన్ని నిధులు అవసరం. 149 కి.మీ. మనోహరాబాద్–కొత్తపల్లి మార్గానికి 125 కోట్లు కేటాయించడం తొలిదశ పనులు వేగవంతం చేయడానికి దోహదపడుతుంది. రానున్న ఆర్థిక సంవత్సరం చివరినాటికి 32 కి.మీ. మనోహరాబాద్–గజ్వేల్ మార్గం మొదటి దశ పూర్తవుతుందని రైల్వేశాఖ భరోసా ఇస్తున్నది. అదేవిధంగా అక్కన్నపేట్–మెదక్ (17కి.మీ) మార్గానికి 130 కోట్లు కేటాయించడం వల్ల దీని నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావడానికి వీలవుతుంది. ఈ రెండు ప్రాజెక్టులు ఎన్నో ఏండ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఇక మహబూబ్‌నగర్–మునీరాబాద్ (246 కి.మీ) లైన్‌కు 275 కోట్లు కేటాయించారు. ఈ లైన్ మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణా స్టేషన్ వరకే తెలంగాణ రాష్ట్రంలో (కేవలం 66 కి.మీ.) ఉంది. మిగతాదంతా కర్ణాటక రాష్ట్రంలోనే. పైగా దీనిలో 29 కి.మీ మార్గం అంటే జక్లేరు వరకు లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 37కి.మీ మార్గం పూర్తిచేయాల్సి ఉన్నది. భద్రాచలం రోడ్–సత్తుపల్లి (56.25కి.మీ) మార్గానికి 120 కోట్లు కేటాయించడం ద్వారా పనులు చురుకుగా ముందుకు కదలడానికి వీలవుతుంది. ఖాజీపేట వర్క్ షాప్‌కు 200 కోట్లు, సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ డబ్లింగ్‌కు 259 కోట్లు, కాజీపేట–బల్లార్ష మూడోలైన్‌కు 301 కోట్లు, కాజీపేట– విజయవాడ లైన్‌కు 60కోట్లు, ఎంఎంటీఎస్ రెండో దశకు 21.25 కోట్లు, చర్లపల్లి టెర్మినల్‌కు 5 కోట్లు కేటాయింపులు కొంత సంతృప్తిని కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖాజీపేట వర్క్‌షాప్ పనులు మొదలవుతాయని భావించవచ్చు.అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 221కి.మీ మేరకు బైపాస్ లైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నది.

లైన్లకు భారీగా కేటాయింపులు కావాలి: రైల్వే పింక్ బుక్ ప్రకారం దక్షిణ మధ్య రైల్వే కేటాయింపులు పరిశీలిస్తే.. (బ్రాకెట్లలో కి.మీ. తర్వాత ఉన్నది ప్రాజెక్టు నిర్మాణ వ్యయం మొత్తం) భద్రాచలం–కొవ్వూరు (151 కి.మీ.–రూ.914 కోట్లు) మార్గానికి ఈ బడ్జెట్లో కేవలం ఒక కోటిని కేటాయించింది. కొత్తగూడెం–కొండపల్లి (125 కి.మీ.–రూ.616 కోట్లు) మార్గానికి మరీ తక్కువలో తక్కువగా రూ.10 వేలు కేటాయించడం చూస్తే.. అసలు నిధులే రాలేదంటే బాగుంటుంది. మణుగూరు–రామగుండం (200 కి.మీ.–రూ.1112కోట్లు) మార్గానికి కేవలం 50 లక్షలు విదిల్చింది. నల్లగొండ–మాచర్ల (92 కి.మీ.–రూ.45కోట్లు) మార్గానికి 10 లక్షలు మాత్రమే కేటాయింపులు చేసింది. ఇలాంటి చిన్నచిన్న కేటాయింపుల ద్వారా ఏం పనులు చేపడతారో ఎవ్వరికీ అర్థం కాదు. బడ్జెట్లో చేర్చినందుకు మొక్కుబడిగా కొన్నింటికి వేయి, పదివేలు కేటాయింపులు చేయటం ప్రాజెక్టుల నిర్మాణాన్ని అపహాస్యం చేయటమే.

విద్యుద్దీకరణకు పెరిగిన ప్రాధాన్యం: దేశంలో రైల్వే లైన్ల విద్యుద్దీకరణకు రైల్వేశాఖ అత్యంత ప్రాముఖ్యాన్ని ఇస్తున్నది. దీనికోసం ఏటా 4 వేల కి.మీ. మార్గం విద్యుద్దీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. దీనిలో భాగంగానే తెలంగాణలోని 554 కి.మీ మేర మార్గాన్ని విద్యుద్దీకరణలో చేర్చింది. దీనికి 713 కోట్లు వ్యయం చేయనున్నది. రాష్ట్రంలోని అన్ని మార్గాలను విద్యుద్దీకరణ చేయడానికి మరో ఐదు నుంచి ఆరేండ్ల సమయం పట్టవచ్చని తెలుస్తున్నది. ఇప్పటికే అన్నిమార్గాలు ఏ విధంగా విద్యుద్దీకరించాలో నివేదికలను కూడా రూపొందించినట్లు సమాచారం. అంటే భవిష్యత్తులో డీజిల్ ఇంజిన్ల స్థానంలో పొగలేని, కాలుష్యం లేని విద్యుత్తు ఇంజిన్లు దౌడు తీయనున్నాయన్న మాట.

కొత్త లైన్లు సర్వేలకే పరిమితమా?: తెలంగాణలో కొత్తగా మూడు రైలు మార్గాల నిర్మాణం కోసం సర్వేను చేపట్టడానికి అనుమతించినట్లు ప్రకటించారు. కానీ ఇప్పటికే 880 కి.మీ. మేర ఏడు లైన్లకు సర్వే పూర్తయింది. కానీ వీటిని మూలకుపడేశారు. మరో 17 వందల కి.మీ. మేరకు సర్వే ప్రతిపాదనలున్నా పట్టించుకోలేదు. సర్వే పూర్తయిన వాటి మంజూరుకు అనుమతించడం లేదు. ప్రాజెక్టు అన్నిరకాలుగా లాభదాయకంగా ఉంటేనే మంజూరు చేస్తామని రైల్వే చెబుతున్నది. కానీ లాభదాయకమైన ప్రాజెక్టులను కూడా మంజూరు చేయడంలేదు. నిర్మాణంలో ఉన్న వాటికేమో నిధులను అరకొరగా ఇస్తున్నది. ఎన్నో ఏండ్లుగా రాజకీయ గ్రహణం పట్టిన రైల్వే ఇప్పుడిప్పుడే దాన్ని వదిలించుకొని సరైన దారిలోకి వచ్చే ప్రయత్నం చేస్తూ నిధుల సమీకరణ సమస్యను ఎదుర్కొంటున్నది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అన్ని రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన మేర నిధుల మంజూరుకు ఊతమివ్వాలి. ఏ విధంగా అయితే బుల్లెట్ రైలును మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిధులు సమకూరుస్తున్నదో అదేవిధంగా రైల్వేలో నిర్మాణంలోని ప్రాజెక్టులపై దృష్టిపెట్టాలి. నిధుల సమీకరణకు మార్గాలను అన్వేషించాలి. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న లైన్లను పూర్తిచేసిన తర్వాతే కొత్తవాటిని మంజూరు చేయాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నిరు. అందువల్ల వీటిని పూర్తిచేయడానికి భారీగా నిధులు సమీకరించడాన్ని తొలి ప్రాధాన్యంగా పెట్టుకున్నప్పుడే రైల్వేలో నవ శకానికి నాంది.

> ఎన్నో ఏండ్లుగా రాజకీయ గ్రహణం పట్టిన రైల్వే ఇప్పుడిప్పుడే దాన్ని వదిలించుకొని సరైన దారిలోకి వచ్చే ప్రయత్నం చేస్తూ నిధుల సమీకరణ సమస్యను ఎదుర్కొంటున్నది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అన్ని రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన మేర నిధుల మంజూరుకు ఊతమివ్వాలి. ఏ విధంగా అయితే బుల్లెట్ రైలును మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిధులు సమకూరుస్తున్నదో అదేవిధంగా రైల్వేలో నిర్మాణంలోని ప్రాజెక్టులపై దృష్టిపెట్టాలి.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పీహెచ్‌డీ విద్యార్థికి నెలకు రూ.80,000

పీఎంఆర్‌ఎఫ్ పథకం కింద అందజేయనున్న కేంద్రం

ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీల్లో చదివిన వారికే అవకాశం



న్యూఢిల్లీ: విద్యార్థుల మేధో వలసలను నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాన్ని తీసుకొచ్చింది. ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులు పీహెచ్‌డీ చేయాలనుకుంటే వారికి నెలకు రూ.80వేల వరకు ఉపకారవేతనం ఇవ్వాలని నిర్ణయించింది. పీహెచ్‌డీ సీటు పొందిన విద్యార్థుల్లో ఎంపిక చేసిన వారికి ప్రధానమంత్రి పరిశోధన ఫెలోషిప్(పీఎంఆర్‌ఎఫ్) పథకం కింద నెలకు రూ.70,000 నుంచి రూ.80,000 వరకు ఉపకారవేతనం అందజేయనున్నట్లు తెలిపింది. అలాగే వార్షిక పరిశోధన నిధి కింద రూ.2లక్షలు అందజేయనున్నట్లు పేర్కొంది. మూడేండ్లకుగాను ఈ పథకానికి రూ. 1,650కోట్లు కేటాయించడానికి ఇప్పటికే క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద ఏటా 1000 మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ ఈ పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించామని, దీనికి సంబంధించిన నిధులకు బుధవారం క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, ఐఐఐటీ, ఎన్ఐటీలలో చదివిన బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు దేశంలోని ఐఐటీల్లో, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పిస్తామని, ఈ ప్రవేశాలు నేరుగా ఉంటాయని తెలిపారు. అయితే ఈ ప్రవేశాలకు గ్రేడ్ పాయింట్ 8.5గా నిర్ణయించామని పేర్కొన్నారు. 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు వివరించారు.

బ్రిటిష్ కాలం నాటి రైల్వే వంతెనలే మేలు

- **స్వాతంత్ర్యం అనంతరం నిర్మించినవి అధ్వానం**
- **పార్లమెంటరీ కమిటీ నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిర్మించిన రైల్వే వంతెనల కంటే.. బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనల పరిస్థితే బాగున్నదని పార్లమెంటరీ కమిటీ తెలిపింది. నిర్మాణాల సమయంలో అధికారులు, కాంట్రాక్టర్లు లాలూచీ పడటంతోనే వంతెనల నాణ్యత అధ్వానంగా ఉంటున్నదని పేర్కొన్నది. దేశంలోని రైల్వే వంతెనల నిర్వహణపై ప్రజాపద్దుల కమిటీ శుక్రవారం పార్లమెంట్‌కు నివేదిక ఇచ్చింది. రైల్వే వంతెనల పనుల్లో ఆలస్యం కారణంగా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదని పేర్కొన్నది. రైల్వే వంతెనల నిర్మాణం లేదా పునర్ నిర్మాణ పనులను ఈ-టెండర్ విధానం ద్వారా చేపట్టాలని, దీనివల్ల నిర్మాణాల్లో పారదర్శకత సాధ్యమవుతుందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గే



నేతృత్వంలోని కమిటీ సిఫారసు చేసింది. నిర్మాణాల్లో నాణ్యతలోపిస్తే జరిమానా విధించడంతోపాటు ఆయా కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పేర్కొన్నది. రైల్వే వంతెనల పరిస్థితిపై 2015లో కాగ్ ఇచ్చిన నివేదికను సైతం కమిటీ ప్రస్తావించింది. వంతెనల మరమ్మతుకు నిధుల కొరత కారణమంటున్న అధికారులు.. ఏటా బడ్జెట్‌లో కేటాయిస్తున్న రూ.60.95 కోట్ల నిధులను మాత్రం వినియోగించడంలేదని కమిటీ పేర్కొన్నది.

భారతీయ అమెరికన్లపై కాల్పులు

- **ఒకరి మృతి: మరొకరి పరిస్థితి విషమం**
- **అమెరికాలో ఘటన: దుండగుడి అరెస్టు**

వాషింగ్టన్: ఓ దుండగుడు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో ఓ భారతీయ అమెరికన్ మృత్యువాత పడగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్నది. బర్నెట్ ఫెర్రీ రోడ్డులోని ఓ దుకాణంలో పనిచేస్తున్న 44 ఏండ్ల పరమ్‌జిత్‌సింగ్‌పై దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో బాధితుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పరమ్‌జిత్‌పై కాల్పులు జరిపిన అనంతరం అక్కడే ఉన్న మరో దుకాణంలోకి వెళ్లిన దుండగుడు.. అక్కడ క్లర్క్‌గా పనిచేస్తున్న పార్తీ పటేల్ (30)పై కాల్పులు జరిపాడు. అనంతరం దుకాణంలో ఉన్న నగదును చోరీచేసి పారిపోయాడు. ప్రస్తుతం పార్తీ పటేల్ పరిస్థితి విషమంగా ఉన్నదని అధికారులు తెలిపారు. ఈ రెండు ఘటనలపై దర్యాప్తు చేసిన అధికారులు సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడిని లామార్ రషద్ నికోలస్ (28)గా గుర్తించి అరెస్టు చేశారు. అతడిపై హత్యానేరంతో పాటు చోరీ, దాడి తదితర కేసులను నమోదు చేశారు. నిందితుడు కాల్పులు జరుపడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా కాల్పుల్లో చనిపోయిన పరమ్‌జిత్‌సింగ్ ఎనిమిదేండ్ల కిందట అమెరికా వచ్చాడని స్థానికంగా వ్యాపారం నిర్వహించే అతని సోదరుడు తెలిపారు. బాధితునికి ఇద్దరు పిల్లలు ఉన్నట్టు వెల్లడించారు.



కాల్పులు జరిపిన లామార్ రషద్ నికోలస్



'మ్యాథ్స్ హాల్ ఆఫ్ ఫేమ్'లో భారత సంతతి చిన్నారి

లండన్: బ్రిటన్‌లో భారత సంతతి బాలిక సోహినీరాయ్ (8) గణితంలో అసాధారణ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నది. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న 'మ్యాథ్స్ పజిల్స్'లో సోహినీ విశేష ప్రతిభ చూపుతున్నది. యునైటెడ్ కింగ్‌డమ్ మ్యాథ్స్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో 'టాప్-100' క్లబ్‌లో చేరింది. ఆమె తండ్రి మైనక్ రాయ్ మాట్లాడు తూ 'వరల్డ్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో మ్యాథ్స్ పజిల్స్ పరిష్కారంతో సోహినీ సంతోషంగా ఉంది' అని చెప్పారు. సోహినీ తాత డీఎన్ రాయ్ మాట్లాడుతూ తన మనుమరాలికి గణితంపై ఆసక్తి జన్యుపరంగానే వచ్చిందన్నారు.

రిజిజుపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

న్యూఢిల్లీ: ఎంపీ రేణుకాచౌదరిపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన ఫేస్‌బుక్ పోస్టు వివాదాస్పదమైంది. ఆయనపై ఆమె శుక్రవారం రాజ్యసభలో సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. బుధవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మాట్లాడుతుండగా ఆమె గట్టిగా నవ్వారు. దీంతో ఆమెపై ప్రధాని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిపై కిరణ్ రిజిజు రామాయణ సీరియల్‌లో శూర్పణఖ నవ్వునూ, రాజ్యసభలో రేణుకా చౌదరి నవ్వునూ పోల్చు తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ట్విట్టర్‌లో రేణుకా చౌదరి నవ్వునూ మాత్రమే ట్వీట్ చేయడం వివాదాస్పదమైంది. రేణుకా చౌదరి మాట్లాడుతూ ఓ మహిళా ఎంపీని అవమానిస్తూ వీడియోను ట్వీట్ చేయడం సహించరాని నేరమన్నారు.

సమాచారం లీక్ చేస్తున్న ఐఏఎఫ్ కెప్టెన్ అరెస్టు

న్యూఢిల్లీ: భారత వైమానిక దళ (ఐఏఎఫ్) సమాచారం అనుమానాస్పద వ్యక్తులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై వాయుసేన కెప్టెన్ అరుణ్ మార్వాను ఢిల్లీ ప్ర త్యేక విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సైబర్ స్పేస్, వాయుసేన కార్యకలాపాల రహస్య వివరాలను ఇతరులకు చేరవేస్తున్నట్టు పోలీసులు అను మానిస్తున్నారు. అరుణ్‌ను జనవరి 31న వాయుసేన అధికారులు అరెస్టు చేసి ప్ర శ్నించారు. ప్రస్తుతం అతడ్ని ఢిల్లీ పోలీసులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

నీతి ఆయోగ్ ఆరోగ్య సూచీలో కేరళ ఫస్ట్

ఏపీకి 8, తెలంగాణకు 11 వ స్థానం

న్యూఢిల్లీ: ఆరోగ్యకర రాష్ట్రాల సూచీలో కేరళ ముందు స్థానంలో నిలిచింది. గతం కంటే మెరుగైన ప్రదర్శన చూపినా ఉత్తర్‌ప్రదేశ్ చివరి స్థానం దక్కించుకున్నది. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఆరోగ్య సూచీలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో వరుసగా పంజాబ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు నిలిచాయి. కాగా, ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ 8, తెలంగాణ 11 వ ర్యాంకులో నిలిచాయి. రాజస్థాన్, బీహార్, ఒడిశాలు ఆశాజనకమైన వృద్ధి చూపలేకపోయాయి.

మాల్దీవుల సంక్షోభంపై మోదీ, ట్రంప్ ఆందోళన

ఫోన్లో ఇరుదేశాల అధినేతల సంభాషణ

వాషింగ్టన్/బీజింగ్: మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభంపై భారత ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలో ప్రజాస్వామ్యసంస్థలను, దేశీయ చట్టాలను గౌరవించాల్సిన ఆవశ్యకత గురించి కూడా వారు మాట్లాడుకున్నారని వైట్‌హౌస్ శుక్రవారం తెలిపింది. ఈ ఏడాదిలో తొలిసారి ఇరుదేశాల అధినేతలు ఫోన్లో దీనిపై చర్చించారని తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్, ఇండో- పసిఫిక్‌లో భద్రత, మయన్మార్-బంగ్లాదేశ్‌లలో రోహింగ్యాల సమస్య సైతం వారి సంభాషణల్లో ప్రస్తావనకు వచ్చిందని వైట్ హౌస్ అభిప్రాయ పడింది. ఇదిలా ఉంటే మాల్దీవులపై భారత్‌తో వివాదం పెట్టుకోవద్దని చైనా భావిస్తున్నది. మాల్దీవుల సమస్య ఇండియా-చైనా మధ్య మరో వివాదాంశం కారాదని తమ దేశం కోరుకుంటున్నట్లు చైనా అధికారవర్గాలు శుక్రవారం పీటీఐకి తెలిపాయి. మాల్దీవుల్లో పరిస్థితి ఇంకా ముదిరితే, సైన్యాన్ని పంపి ఆదుకోవడానికి భారత్ ప్రత్యేక దళాలను సిద్ధం చేసిందని చైనా అనుమానిస్తున్నది. మాల్దీవుల్లో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించే మార్గాలను వెదుకడానికి భారత్‌తో తాము సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంది. మరోవైపు భారత్‌కు చెందిన జర్నలిస్టుతోపాటు ఇద్దరు జర్నలిస్టులను మాల్దీవుల ప్రభుత్వం అరెస్టు చేసింది.

పశ్చిమాసియా పర్యటనలో ప్రధాని

మూడుదేశాల్లో నాలుగురోజులపాటు పర్యటన

జోర్డాన్‌లో మోదీకి ఘనస్వాగతం.. రాజు అబ్దుల్లా-2తో భేటీ

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇరుదేశాల అంగీకారం

నేడు పాలస్తీనాకు మోదీ.. తొలిసారిగా భారత ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:

భారత ప్రధాని నరేంద్రమోదీ పశ్చిమాసియా పర్యటన ప్రారంభమైంది. మూడు దేశాల్లో నాలుగు రోజులపాటు ఆయన పర్యటించనున్నారు. పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయడమే ఎజెండాగా ప్రధాని పర్యటన సాగనున్నది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన ప్రధాని మోదీ జోర్డాన్ రాజధాని అమ్మాన్‌కు చేరుకున్నారు. అమ్మాన్‌లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. మోదీ తొలిసారిగా జోర్డాన్‌లో పర్యటిస్తున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో ఆ దేశానికి వెళ్లిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. జోర్డాన్ ప్రధానమంత్రి హనీఅల్ ముల్కీ విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికారు. అనంతరం రాజు అబ్దుల్లా-2తో మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై వారిరువురూ చర్చించారు. 'రాజు అబ్దుల్లా-2తో సమావేశం అద్భుతంగా సాగింది. భారత్-జోర్డాన్‌ల మధ్య ఐదు దశాబ్దాలుగా ఉన్న స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టమయ్యేలా మా చర్చలు జరిగాయి' అని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో తెలిపారు. ఈ నెలాఖరులో జోర్డాన్ రాజు జరిపే భారత పర్యటన కోసం తామంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇరుదేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందని జోర్డాన్ రాజు వెల్లడించారు.

నాలుగురోజుల పర్యటనలో భాగంగా మోదీ నేడు పాలస్తీనా వెళ్లనున్నారు. అక్కడినుంచి యూఏఈ, ఒమన్ దేశాలకు వెళ్తారు. శనివారం వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లాకు హెలికాప్టర్ ద్వారా మోదీ చేరుకుని పాలస్తీనా నేత మహమూద్ అబ్బాస్‌తో భేటీ అవుతారు. విద్య, వైద్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందం జరిగే అవకాశం ఉంది. గత ఏడాది జూలైలో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ గతనెలలో భారత్‌లో పర్యటించారు. ప్రస్తుతం మూడుదేశాల పర్యటనలో ఇజ్రాయెల్ బద్ధ శత్రువైన పాలస్తీనా పర్యటనకు మోదీ వెళ్తున్నారు. జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా అమెరికా ప్రకటించిన తర్వాత దీనిని వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్యసమితిలో భారత్ ఓటేసింది. అంతేకాదు, ఇజ్రాయెల్‌తో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తూనే.. తాము ఏ వైపు ఉంటామో భారత్ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రధాని పాలస్తీనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పాలస్తీనాలో పర్యటిస్తున్న తొలి భారత ప్రధాని మోదీ కావడం మరో విశేషం.

ఈ నెల 10న యుఏఈ చేరుకునే ప్రధాని మోదీ.. అబుదాబిలో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 11వ తేదీన దుబాయ్‌లో జరిగే ఆరవ ప్రపంచ గవర్నమెంట్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారు. అక్కడినుంచే ఓ ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకిస్తారు. భారత సంతతి ప్రజలతో జరిగే కార్యక్రమంలోనూ ఆయన ప్రసంగించనున్నారు. యుఏఈలో 30 లక్షలమంది భారతసంతతికి చెందినవారు ఉన్నారు. 11, 12 తేదీల్లో ఒమన్ చేరుకోనున్న ప్రధాని అక్కడి వ్యాపారవేత్తలతో సమావేశం కానున్నారు. సోమవారం సాయంత్రం మోదీ భారత్‌కు తిరిగిరానున్నారు. పశ్చిమాసియా, గల్ఫ్‌దేశాలతో భారత సంబంధాలను బలోపేతం చేసేందుకు తన పర్యటన దోహదపడుతుందని భావిస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ట్విట్టర్‌లో తెలిపారు. మహమూద్ అబ్బాసీతో భేటీపై ఆసక్తిగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. 2015 తర్వాత ప్రధాని గల్ఫ్ దేశాల్లో పర్యటించడం ఇది ఐదవసారి అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు.



ప్రధాని మోదీ, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 స్నేహపూర్వక ఆలింగనం



బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్, అద్వానీ

సంక్షేమ పథకాలతోనే ఎన్నికల్లో గెలుపు

వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు మోదీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో ప్రకటించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో విజయతీరాలకు చేరుస్తాయని ప్రధాని మోదీ చెప్పారు. ఆ సంక్షేమ పథకాలను ఎంత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తే, పార్టీ గెలుపునకు అవి అంతలా ఉపయోగపడుతాయని అన్నారు. ఎంపీల పనితీరుపైనే పార్టీ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. శుక్రవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రత్యేకించి రైతులు, పేదల సంక్షేమమే లక్ష్యంగా రూపొందించామని మోదీ పేర్కొన్నారు. పదికోట్ల కుటుంబాలకు ప్రయోజనం కలిగించేలా రూపొందించిన ఆరోగ్యబీమా పథకం ప్రజాదరణ చూరగొంటుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో కీలకాంశాలను ప్రజలకు వివరించాలని, పోలింగ్‌బూత్ స్థాయి సమావేశాలను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రాచుర్యం కల్పించాలని ఎంపీలను ఆయన కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా, కాంగ్రెస్ సభ్యులు ఎగతాళి చేయడాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. రాహుల్ గాంధీ ఆలోచనావిధానం అప్రజాస్వామికంగా ఉందని అమిత్‌షా దుయ్యబట్టారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించి కాంగ్రెస్ పలు ఆరోపణలు చేస్తున్నదని, వాటికి జైట్లీ తన సమాధానంలో సమర్థవంతంగా తిప్పికొట్టారని షా తెలిపారు.

దద్దరిల్లిన ఉభయసభలు

పార్లమెంట్‌లో కొనసాగిన ఏపీ ఎంపీల నిరసన ■ లోక్‌సభ మార్చి5వరకు వాయిదా ■ రాజ్యసభలోనూ కొనసాగిన ప్రతిష్టంభన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పార్లమెంట్‌లో ఎంపీల ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఉభయ సభల్లోనూ ఏపీ ఎంపీలు వరుసగా రెండోరోజు కూడా నిరసనకు దిగారు. ఆంధ్రప్రదేశ్‌కు మరింత ఆర్థిక సాయం చేయాలన్న డిమాండ్ మధ్య లోక్‌సభ వాయిదా పడింది. శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ, వైసీపీకి చెందిన 15 మంది ఎంపీలు వెల్‌లోకి ప్రవేశించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ తొలుత ప్రశ్నోత్తరాలను వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశం కాగానే జీరో అవర్ చేపట్టకుండా టీడీపీ, వైసీపీ సభ్యులు వెల్‌లోకి వచ్చి నిరసన తెలుపుతుండటంతో సభను వచ్చేనెల ఐదో తేదీకి నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో బడ్జెట్ తొలి విడుత సమావేశాలు ముగిశాయి. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని ఆ రాష్ట్ర ఎంపీ లు, రాఫెల్ ఒప్పందంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ సభ్యులు పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. టీడీపీ సభ్యుడు ఎన్ శివప్రసాద్.. పొడవైన వెంట్రుకల విగ్ ధరించి వెంకటేశ్వర స్వామి, విజయవాడ కనకదుర్గ తనను ఆవహించాయంటూ వినూత్న వేషధారణతో నిరసన తెలిపారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఉదయం సభ ప్రారంభం కాగానే టీడీపీ, వైసీపీ సభ్యులూ వెల్‌లోకి దూసుకొచ్చి ఏపీ ప్రత్యేక హోదా పై నినాదాలు చేశారు. దీంతో మొదట 12గంటలకు వాయిదాపడిన రాజ్యసభ తిరిగి ప్రారంభం కాగానే మరోసారి సభ్యులు నిరసనకు దిగారు. దీంతో చైర్మన్ వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా వేశారు. అనంతరం కూడా ఎంపీలు ఆందోళన కొనసాగింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం ఒడిశా ఎంపీ ఏవీ స్వామి పార్లమెంట్ ప్రాంగణంలో కుప్పకూలిపోయారు. ఒక్కసారిగా కింద పడటంతో ఆయన తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆయనను దవాఖానకు తరలించారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు ధ్రువపత్రంగా ఆధార్

డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల్లో చిరునామా, వయసు నిర్ధారణకు ఆధార్‌ను ధ్రువపత్రంగా వాడవచ్చని, ఈమేరకు 1989 మోటారు వాహనాల చట్టాన్ని సవరిస్తున్నట్లు కేంద్రం రాజ్యసభలో తెలిపింది.



లోక్‌సభలో ప్లకార్డులతో ఆందోళనకు దిగిన టీడీపీ, వైసీపీ సభ్యులు



రాష్ట్రపతిని కలిసిన అనంతరం బయటకు వస్తున్న విపక్ష పార్టీల నేతలు

లోయా మృతిపై సిట్ దర్యాప్తు జరిపించండి

రాష్ట్రపతిని కోరిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సీబీఐ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ లోయా మృతిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ప్రతిపక్షాలు కోరాయి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ దర్యాప్తు కొనసాగేలా చూడాలని సూచించాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఎన్ఐఏలపై తమకు విశ్వాసం లేదని తెలిపాయి. కాంగ్రెస్, తృణమూల్, డీఎంకే తదితర పార్టీల ఎంపీలు రాష్ట్రపతితో శుక్రవారం భేటీ అయ్యారు. ఈమేరకు 15 పార్టీలకు చెందిన 114మంది ఎంపీలు సంతకం చేసిన విజ్ఞాపన పత్రాన్ని రాష్ట్రపతికి అందజేశారు. తమ విజ్ఞప్తిపై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తెలిపారు.

రాఫెల్‌పై అబద్ధాలు ఆపండి: రాహుల్

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు విషయంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చెప్పేవన్నీ అబద్ధాలేనని రాహుల్‌గాంధీ విమర్శించారు. యుద్ధ విమానాల కొనుగోలు వివరాలను యూపీఏ మూడుసార్లు వెల్లడించిందని ట్విట్టర్‌లో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, దానిని సాధించేందుకు అన్ని రాజకీయపక్షాలూ ఏకం కావాలని మరో ట్వీట్‌లో రాహుల్ పిలుపునిచ్చారు.

అమెరికాలో మళ్లీ షట్‌డౌన్

- **కొన్ని గంటలకు పరిమితం**
- **అధికార రిపబ్లికన్ సెనెటర్ సుదీర్ఘ ప్రసంగం వల్లే షట్‌డౌన్**
- **బడ్జెట్ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం తర్వాత తెరుచుకున్న ప్రభుత్వ కార్యాలయాలు**

వాషింగ్టన్, ఫిబ్రవరి 9: అమెరికాలో మూడు వారాల తర్వాత శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు మరోసారి మూతపడ్డాయి. గురువారం అర్ధరాత్రి లోపే అమెరికా బడ్జెట్ బిల్లుకు సెనెట్ ఆమోదం తెలుపాల్సి ఉన్నా అధికార రిపబ్లికన్ పార్టీ సెనెటర్ రాండ్ పాల్ సుదీర్ఘంగా ప్రసంగించడం ప్రధాన అవరోధంగా మారింది. దీంతో శుక్రవారం తొలి గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు మూత పడ్డాయి. శుక్రవారం తెల్లవారుజామున 71 – 28 ఓట్ల తేడాతో బడ్జెట్ బిల్లును సెనెట్ ఆమోదించినా సాంకేతిక సమస్య తలెత్తింది. సెనెట్‌లో 100 మంది సభ్యుల మధ్య ఏకాభిప్రాయంతో బిల్లును ఆమోదించాలి. అలా కాకపోవడంతో మళ్లీ బిల్లును అమెరికా కాంగ్రెస్ (ప్రజాప్రతినిధుల సభ)లో ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఈ బిల్లుకు 240 స్థానాలు గల కాంగ్రెస్‌లో 186 మంది సభ్యులు శుక్రవారం ఆమోదం తెలుపడంతో వచ్చేనెల 23 వరకు ప్రభుత్వ వ్యయానికి నిధులు కేటాయింపు పొడిగించాలన్న అంశంపై కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. కాంగ్రెస్‌లో బిల్లు ఆమోదం పొందగానే ప్రభుత్వ కార్యాలయాలన్నీ తెరుచుకున్నాయి. తాజా పరిణామంపై ప్రజాప్రతినిధుల సభ స్పీకర్ పాల్ ర్యాన్ మాట్లాడుతూ సొంత పార్టీ సెనెటర్ తీరునే తప్పుబట్టారు. వక్రబుద్ధితో తెచ్చి పెట్టిన అనవసర షట్‌డౌన్ అని అభిప్రాయ పడ్డారు. డెమొక్రాట్ సభ్యురాలు నీతా లౌవీ మాట్లాడుతూ పరిపాలనలో రిపబ్లికన్లు విఫలమయ్యారన్నారు. అంతకుముందు గురువారం బడ్జెట్ బిల్లుపై సెనెట్‌లో రిపబ్లికన్ సెనెటర్ రాండ్ పాల్ తొమ్మిది గంటల పాటు సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రభుత్వ వ్యయ బడ్జెట్‌లో లోటు ఉండటమేమిటని అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే రెండేండ్ల పాటు రుణాలతో మిలిటరీ, పౌర సేవల వ్యయాన్ని 300 బిలియన్ డాలర్లకు పెంచాల్సిన అవసరమేమిటని పాల్ ప్రశ్నించారు. ఇది ఖజానాను దోపిడీ చేయడమేనని వ్యాఖ్యానించారు. గురువారం బడ్జెట్‌కు సెనెట్‌లో ఆమోదం పొందేందుకు ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అర్ధరాత్రి నుంచి ప్రభుత్వ కార్యాలయాలు మూడు వారాల వ్యవధిలో రెండోసారి మూతపడ్డాయి.



వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీ హోదాలో తొలిసారి మీడియాతో మాట్లాడుతున్న భారతీయ-అమెరికన్ రాజ్‌షా

సరదా ఇద్దరి ప్రాణం తీసింది

- బస్సు, స్కూటర్ ఢీ: ఇద్దరి మృతి, ఒకరి పరిస్థితి విషమం
- బాధితులంతా పదో తరగతి విద్యార్థులే


మృతులు ప్రవీణ్, మధు (ఫైల్ ఫొటోలు)

మెహిదీపట్నం: బైక్‌పై తిరుగాలన్న సరదా.. కనీస ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోని నిర్లక్ష్యం ఇద్దరు పదో తరగతి విద్యార్థుల ప్రాణాలు తీసింది. బస్సు, యాక్టివా స్కూటర్ ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన హైదరాబాద్ హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగింది. వనపర్తి జిల్లా ఖిలాఘన్‌పూర్ మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన కృష్ణ కుటుంబంతో కలిసి హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని అల్లూరి సీతారామరాజునగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకు ప్రవీణ్ అలియాస్ పవన్ (14)గుడిమల్కాపూర్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సాయినగర్‌లో నివాసం ఉంటున్న సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన బాలయ్య కుమారుడు మధు(14) మెహిదీపట్నంలో పదో తరగతి చదువుతున్నాడు.గుడిమల్కాపూర్ హీరానగర్‌కు చెందిన కృష్ణ కొడుకు చందు (14) తాళ్లగడ్డలో పదో తరగతి చదువుతున్నాడు. వీరు ముగ్గురు గుడిమల్కాపూర్ ఉషోదయ కాలనీలోని వివేకానంద పాఠశాలలో ట్యూషన్‌కు వెళ్లేవారు. శుక్రవారం ఉదయం ట్యూషన్ లేకపోవడంతో ముగ్గురు కలిసి సరదాగా తిరిగేందుకు హోండా యాక్టివాపై ట్యాంక్‌బండ్‌కు బయలుదేరారు. మాసాబ్ ట్యాంక్ మీదుగా వెళ్తుండగా ఎన్ఎండీసీ వద్ద సికింద్రాబాద్‌కు వెళ్తున్న బస్సును ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో బండి అదుపుతప్పడంతో ముగ్గురూ బస్సు కింద పడగా ప్రవీణ్, మధు పైనుంచి బస్సు వెళ్లింది. ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా, మధు తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మరణించాడు. చందు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ సిద్ధం

కీసర, ఏడుపాయలు, బీరామ్‌గుట్టకు 352 సర్వీసులు

11వ తేదీ నుంచి 16 వరకు ఆపరేషన్స్: గ్రేటర్ ఈడీ పురుషోత్తం నాయక్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మహాశివరాత్రి వేడుకలకు గ్రేటర్ ఆర్టీసీ సిద్ధమైంది. శివరాత్రి సందర్భంగా నగర సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కీసరగుట్ట, ఏడుపాయలు, బీరామ్‌గుట్టకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నది. ఈ నెల11వ తేదీ నుంచి ప్రారంభించి 16వ తేదీవరకు మొత్తం 352 సర్వీసులు నడిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో కీసరగుట్టకు 288 ప్రత్యేక బస్సులు నడుపుతుండగా, ఏడుపాయల, బీరామ్‌గుట్టకు కలిపి 64 బస్సులు తిప్పనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ ఏ పురుషోత్తం నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆపరేషన్స్ కోసం ప్రత్యేకంగా క్యాంపు ఆఫీసర్లను నియమించామన్నారు. నగరంలోని అన్ని డిపోల పరిధిలోని ముఖ్య కూడళ్ల నుంచి బస్సులు నడుపనున్నట్టు చెప్పారు. భక్తులను కీసర ఆలయానికి చేరవేసేందుకు ఈ నెల 11వ తేదీ నుంచి 16 వరకు, ఏడుపాయల, బీరామ్‌గుట్ట జాతరకు 12వ తేదీ నుంచి 14 వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కీసరగుట్ట జాతరకు సంబంధించి ఇంచార్జిగా కుషాయిగూడ డివిజనల్ మేనేజర్ ఆర్ కవిత (ఫోన్ నంబర్ 9959226119)ను నియమించామన్నారు. సికింద్రాబాద్, రెజిమెంటల్ బజార్, ఆల్ఫా పాయింట్ ఇంచార్జిగా డివిజనల్ మేనేజర్ ఏ శ్రీధర్ (ఫోన్ నంబర్-9959226143)ను నియమించామని చెప్పారు. ఏవైనా సందేహాలు ఉంటే ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి కీసరగుట్టకు బస్ చార్జీలు (రూ.ల్లో)

ప్రారంభ స్టాప్	సిటీ ఆర్డినరీ	మెట్రో ఎక్స్‌ప్రెస్
సికింద్రాబాద్	40	40
ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్	25	30
అమ్ముగూడ	30	30
వెంకటాపూర్	40	40
కీసర	15	15
అఫ్జల్‌గంజ్	40	45
తార్నాక	30	40
ఘట్‌కేసర్	25	30
రామంతాపూర్	40	40
ఉప్పల్	40	40
దిల్‌సుఖ్‌నగర్	45	45

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

సెల్ఫ్‌డిఫెన్స్, పౌష్టికాహారం, బహిష్టు పరిశుభ్రతపై అవగాహన

58 ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయనున్న జిల్లా విద్యాశాఖ

మహిళా పీఈటీలకు ప్రారంభమైన మూడురోజుల శిక్షణ




గోషామహల్ స్టేడియంలో కొనసాగుతున్న శిక్షణ (ఇన్‌సెట్) పీఈటీలతో మాట్లాడుతున్న కలెక్టర్ యోగితారాణా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల భద్రత కోసం జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంతోపాటు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించనున్నారు. సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌తోపాటు పౌష్టికాహారం, బహిష్టు పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. నిర్భయ లాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో బాలికలు ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు శారీకంగా, మానసికంగా సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. భద్రతాపరంగా పాఠశాల స్థాయిలోనే ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బాలికల్లో భయాన్ని, ఆందోళనను పోగొట్టేందుకు మార్షల్ ఆర్ట్స్‌ను ఎంచుకున్నారు. ఇందుకోసం మహిళా పీఈటీలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలో 182 ఉన్నత పాఠశాలలుండగా 58 పాఠశాలల్లో మహిళా పీఈటీలు పనిచేస్తున్నారు. వారిని సన్నద్ధం చేసేందుకు గోషామహల్ పోలీస్ స్టేడియంలోని లర్నింగ్ సెంటర్‌లో మూడు రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తున్నారు. షీ-టీమ్స్ కోచ్‌లు రవి, లక్ష్మి నేతృత్వంలో ఈ శిబిరం కొనసాగుతున్నది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా శుక్రవారం శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పీఈటీలతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. యుక్త వయసు బాలికల్లో శరీర మార్పుల పరంగా పలు అనుమానాలు, మానసికంగా పలు భయాందోళనలు ఉంటాయని, కొన్ని విషయాలను కన్న తల్లితో సైతం పంచుకునేందుకు సంకోచిస్తారని ఇలాంటి సమయంలో పీఈటీలు అండగా నిలువాలని కలెక్టర్ సూచించారు. ఆడపిల్లలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, రుతుక్రమం సమయంలో ఎలాంటి పరిశుభ్రత పాటించాలి, యవ్వనంలో శరీరంలో వస్తున్న మార్పులు, పౌష్టికాహారం, ఆలోచలను ఎలా నియంత్రించుకోవాలో వారికి వివరించాలన్నారు. ఇందుకోసం ప్రతివారం ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. ఏయే అంశాలను బోధించాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఉత్తమంగా పనిచేసే పీఈటీలకు గ్రేడింగ్ ఇచ్చి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగదు పురస్కారం అందజేస్తామన్నారు. పీఈటీలు ఉన్న పాఠశాలల్లో ఆటవస్తువులు, ఇతర సామగ్రి అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు హిమోగ్లోబిన్ టెస్ట్‌లు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. ఏడు శాతం కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్, పోలిక్‌ఆసిడ్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. యుక్తవయసు బాలికల్లో శారీరక, మానసిక మార్పులు, వారిలో కలిగే ఆందోళనలను సామాజిక కార్యకర్త డాక్టర్ కవితారెడ్డి వివరించారు. వాటిని ఎలా నివృత్తి చేయాలో చెప్పారు. కార్యక్రమంలో ఇంచార్జి డీఈవో సత్యనారాయణరెడ్డి, ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్లు, డీప్యూటీ ఐవోఎస్‌లు అనురాధ, ప్రసన్న, ఎస్సై జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఉత్తమ వర్సిటీల జాబితాలో ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ: శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న ఉస్మానియా యూనివర్సిటీ మరో ఘనతను దక్కించుకున్నది. ప్రపంచంలోని వెయ్యి అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాలో చోటు సంపాదించింది. ఇటీవల విడుదల చేసిన 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీస్ ర్యాంకింగ్స్-2018'లో ఓయూ స్థానం సంపాదించింది. వివిధ విభాగాల్లో 800-1000 ర్యాంకుల మధ్య ఓయూ నిలిచినట్టు ఓయూ స్టాటిస్టిక్స్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సీ శ్రీనివాసులు తెలిపారు. బోధనలో 33.9, పరిశోధనలో 8.4, సైటేషన్‌లో 14.5, ఇండస్ట్రీ ఆదాయంలో 32, అంతర్జాతీయ ఖ్యాతిలో 15.1 స్కోరింగ్ సాధించిందని చెప్పారు. గతేడాదితో పోలిస్తే బోధన, సైటేషన్, అంతర్జాతీయ ఖ్యాతి అంశాల్లో ఈ ఏడాది స్కోరింగ్ మెరుగుపడిందన్నారు. పరిశోధన, ఇండస్ట్రీ ఆదాయంలో తగ్గిందని, దేశంలోని అన్ని యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నదన్నారు.

అనూహ్యంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

రానున్న 36 గంటల్లో హైదరాబాద్‌కు వర్షసూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాజధానిలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. శుక్రవారం మధ్యాహ్నం కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతంగా మారింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా మూడు డిగ్రీలు పెరిగి 34 డిగ్రీలుగా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత ఒక డిగ్రీ పెరిగి 18 డిగ్రీలుగా నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా రానున్న 36 గంటల్లో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశమున్నదన్నారు.

డ్రగ్స్ దందా.. ముగ్గురు విదేశీయులు అరెస్ట్

ముంబైలో కొని హైదరాబాద్‌లో అమ్మకాలు


పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు నిందితులు, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ముంబైలో అగ్గువకు డ్రగ్స్ కొని హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముగ్గురు విదేశీయులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ఒక నిందితుడు గతంలో డ్రగ్స్ కేసులో అరెస్టయ్యి జైలు నుంచి విడుదలైన తర్వాత అదే దందా కొనసాగిస్తున్నాడని టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు శుక్రవారం తెలిపారు. సియర్రాలియోన్‌కు చెందిన అనోల్డ్ మార్టియన్స్ డన్‌లాక్ 2016 జులైలో టూరిస్ట్ వీసాపై ముంబైకి, నైజీరియాకు చెందిన ఓక్రీ జాన్ చుకువ్ 2016లో స్టూడెంట్ వీసాపై, ఓర్జీ ఫిలిప్ కెల్చుకువ్ 2016 ఏప్రిల్‌లో స్టూడెంట్ వీసాపై హైదరాబాద్‌కు వచ్చారు. డన్‌లాక్ ముంబైలో ఉన్నప్పుడు పబ్‌లకు వెళ్తూ డ్రగ్స్ క్రయ విక్రయాలను పరిశీలించాడు. పలువురు నైజీరియన్లు కొకైన్, హెరాయిన్‌ను అగ్గువకు కొని దేశంలోని వివిధ నగరాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు గుర్తించాడు. దీంతో తాను కూడా డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఏడాది కిందట హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్ జహీరానగర్‌లోని నైజీరియన్ ఓర్జి ఫిలప్ రూమ్‌లో ఉంటున్నాడు. సైనిక్‌పురిలో ఉంటున్న మరో నైజీరియన్ ఓక్రీ జాన్ డ్రగ్స్ అమ్ముతూ గత ఏడాది జూలైలో ఎల్బీనగర్ పోలీసులకు పట్టుబడ్డాడు. నవంబర్‌లో జైలు నుంచి విడుదలై జహీరానగర్‌లోని డన్‌లాక్, ఓర్జీ ఫిలిప్స్ వద్దకు చేరుకున్నాడు. ముగ్గురు ముఠాగా ఏర్పడ్డారు. డాన్ లాక్ ముంబై నుంచి గ్రాము రూ.2 వేలు చొప్పున కొకైన్, హెరాయిన్ కొని హైదరాబాద్‌కు తీసుకొస్తే మిగతా ఇద్దరు అమ్మేవారు. ఈ క్రమంలో జహీరానగర్‌లో కస్టమర్ల కోసం ఎదురుచూస్తుండగా వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రియుడి వేధింపులు తట్టుకోలేక..

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


అపర్ణ (ఫైల్)

జీడిమెట్ల: ప్రియుడి వేధింపులు తట్టుకోలేక ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు,ఎస్సై రామచందర్ కథనం ప్రకారం.. చింతల్ పరిధిలోని చెరుకుపల్లి కాలనీ శ్రీనిలయ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న గుంటూరు నాగమల్లేశ్వర్ రావు, సువర్ణ దంపతుల కుమార్తె అపర్ణ(20) నిజాంపేటలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నది. ఇటీవల జరిగిన క్యాంప స్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగానికి ఎంపికైంది. శనివారం గేట్ పరీక్షకు హాజరు కావాల్సి ఉన్నది. అపర్ణ, అదే కళాశాలకు చెందిన సహ విద్యార్థి ప్రణీత్ కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నట్టు సమాచారం. ప్రణీత్ కొన్నాళ్లుగా అపర్ణను మానసికంగా వేధిస్తున్నాడు. మూడు రోజులుగా చింతల్ వరకు వెంబడిస్తూ వేధింపులకు గురిచేశాడు. దీంతో అపర్ణ గురువారం ప్రణీత్‌తో కలిసి హైదరాబాద్ శివారులోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి సువర్ణ కూరగాయల మార్కెట్ నుంచి వచ్చిన తర్వాత ఫ్యాన్‌కు వేలాడుతున్న అపర్ణను చూసి స్థానికుల సాయంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అయితే అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మార్చి నుంచి ఉద్యోగానికి వెళ్లాల్సిన కూతురు విగతజీవిగా మారడంతో అపర్ణ తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ప్రణీత్ ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

నరబలి నిజమే!

- కొలిక్కి వస్తున్న చిలుకానగర్‌లో శిశువు హత్య కేసు
- ఘటనాస్థలంలో క్షుద్రపూజల ఆనవాళ్లు గుర్తించిన క్లూస్ టీం
- రాజశేఖర్ ఇంట్లో రక్తపు మరకలు లభ్యం?


రాజశేఖర్ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో/ఉప్పల్, నమస్తే తెలంగాణ: ఉప్పల్ చిలుకానగర్‌లో గ్రహణం రోజు జరిగిన శిశువు హత్యకేసు ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఇంటి యజమాని రాజశేఖర్ క్షుద్రపూజలు చేయించాడని పోలీసులకు పక్కా ఆధారాలు దొరికినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే నరబలి జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఘటన వెలుగులోకి వచ్చినరోజే ఆధారాలు సేకరించినా, రాజశేఖర్‌పై అనుమానంతో ఉప్పల్ పోలీసులు శుక్రవారం మరోసారి సంఘటనా స్థలంలో హైదరాబాద్ క్లూస్ టీం ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. రాజశేఖర్ ఇంటి పైభాగంలో తల లభ్యమైన చోట, ఇంట్లో, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుమానం ఉన్న ఇండ్లు, స్థలాల్లో పరిశీలించారు. పోలీసులు ఇప్పటివరకు రాజశేఖర్, కాలనీకి చెందిన మెకానిక్ నరహరి, వారి కుటుంబసభ్యులతోపాటు 80 మందిని విచారించి వివరాలు సేకరించారు. అన్నిటి ఆధారంగా నరబలి జరిగిందని దాదాపు నిర్ధారణకు వచ్చారు. అయితే మొండెం ఆచూకీ ఇప్పటికీ మిస్టరీగా మారింది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ జాయింట్ సీపీ, మల్కాజిగిరి డీసీపీ, ఏసీపీలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చీపురు పుల్లలు, వాటికి తాళ్లు..

క్లూస్ టీం అత్యాధునిక టెక్నాలజీతో ఘటనాస్థలంలో పరిశీలించగా కొన్ని మసిపూసిన చీపురు పుల్లలు, వాటికి దారాలు కట్టిన అనవాళ్లు లభ్యమయ్యాయి. డాబాపై, రాజశేఖర్ ఇంట్లో కొన్ని రక్తపు మరకలు దొరికాయి. వాటిని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించారు. ఇంట్లోని మరకలు మనుషులవో జంతువులవో తేలాలని, డాబాపై ఇంట్లో దొరికిన రక్తపు మరకలు ఒకరివే అయితే గుట్టు వీడినట్టేనని పోలీసులు భావిస్తున్నారు. విచారణలో వెలుగుచూస్తున్న విషయాలు, సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాల ప్రకారం రాజశేఖర్ ఇంటిపైకి వేరే వ్యక్తులు వచ్చి క్షుద్రపూజలు, నరబలి వంటి సాహసానికి పాల్పడే అవకాశం తక్కువని పోలీసులు చెప్తున్నారు. భార్య అనారోగ్యం, ఆర్థిక సమస్యలు వంటివి రాజశేఖర్‌పై అనుమానం కలిగేలా చేస్తున్నాయన్నారు. అతడు పూజలు, మంత్రాలను ఎక్కువగా నమ్ముతాడని తేలిందన్నారు. గుళ్లకు తిరుగడంతోపాటు స్వామీజీలు, క్షుద్రపూజలు చేసేవారిని కలుస్తుంటాడని వెల్లడైందన్నారు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి సూచనతో గ్రహణం రోజు క్షుద్రపూజ తంతు జరిపించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఒకవేళ దొరికిపోయినా ఏం చేయాలో పక్కాగా ప్రణాళిక రూపొందించి అమలు చేసినట్టు అనుమానిస్తున్నారు. నరబలి విషయం బయటికి వచ్చినా మొండెం దొరుకకుంటే కేసు నిలువదనే ఉద్దేశంతో శిశువు మొండెంను మాయం చేశారని, అందుకే విచారణలోనూ సహకరించడంలేదని అంచనావేస్తున్నారు. మరోవైపు శిశువు వివరాలు తెలుసుకొనేందుకు కిడ్నాప్ కేసులను విశ్లేషిస్తూ, వందల కాల్‌డేటాను జల్లెడ పడుతూ, అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. దీంతోపాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందే దశలో ఉన్న చిన్నారులను నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఎక్కడైనా చేర్పించారా అనే కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శనివారం 10 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM

బహుముఖ అనైద

ఈమె ఒక చెఫ్.. పాప్‌సింగర్.. మరో వైపు రచయిత్రిగానూ రాణిస్తున్నది. నటిగా, దర్శకురాలిగా, పెయింటర్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంటున్నది. ఒక మనిషి ఒకే రంగంలో రాణించాలా? జీవితాంతం ఒకే పనికి అంకితమైపోవాలా? ఏం? భిన్నరంగాల్లో అడుగుపెట్టి విజయం సాధించలేమా? కృషి, పట్టుదల ఉంటే అదేం పెద్ద విషయం కాదని నిరూపిస్తున్నది అనైద. విభిన్న రంగాల్లో విజయకేతనం ఎగురవేయడం సులభమే అని రుజువు చేస్తున్నది.



అనైద భారతీయ మూలాలు కలిగిన ఇరానియన్. గ్రీక్ వంటి ఫారిన్ కంట్రీస్‌లో పెరిగిన ఆమె.. మల్టీటాలెంటెడ్‌గా పేరు సంపాదించింది. ఎంబీఏ పూర్తి చేసిన అనైద.. కేవలం ఒకే రంగానికి పరిమితం కావొద్దనుకొన్నది. అందుకే విభిన్న రంగాలను ఎంచుకొని ముందుకు సాగుతున్నది. ప్రస్తుతం హోటెల్ రంగంలోనూ అడుగుపెట్టి ఒక చెఫ్‌గా భిన్న రుచులను భోజన ప్రియులకు పరిచయం చేసే సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇటీవలే ఆమె హైదరాబాద్ వచ్చిన సందర్భంగా 'జిందగీ' ఆమెను పలుకరించింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి

అనైద బహుముఖ ప్రజ్ఞాశాలి. ఏ రంగంలోనైనా రాణించగలనే ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. ప్రముఖ చెఫ్‌గానే కాకుండా రచయితగా, పాప్‌సింగర్‌గా, దర్శకురాలిగా, యోగా శిక్షకురాలిగా బహుముఖ ప్రజ్ఞను కనబరుస్తున్నాదామె. ఒక మనిషి ఒకే విషయంపై పట్టు సాధించాలని, ఒకే రంగానికి పరిమితం కావాలనే నిబంధన పెట్టుకోకుండా ముందుకు సాగడం వల్లే తనికిది సాధ్యమైందంటున్నది అనైద. నేటి తరం కూడా ఒకే విషయంపై దృష్టిని కేంద్రీకరించకుండా, భిన్న రంగాల్లో దూసుకెళ్లాలని సూచిస్తున్న అనైద మంచి రచయిత్రి కూడా. ఆమె పలు మ్యాగజైన్లకు, పత్రికలకు భిన్నమైన అంశాలపై ఆర్టికల్స్ రాస్తుంటుంది.

ఈ ప్రపంచంలో పుట్టిన వ్యక్తులెవ్వరూ తక్కువ కాదు. ప్రతి ఒక్కరిలో ఏదో తెలియని శక్తి ఉంటుంది. అది ఎవరికివారే గుర్తించుకోగలిగితే ఏ రంగంలోనైనా విజయం వరించడం కష్టమేం కాదు. ప్రకృతి మనకెంతో ఇచ్చింది. దాన్ని సరైన విధంగా ట్యూన్ చేసుకుంటేనే సరికొత్త ఆలోచనలు వస్తాయి. అవి కార్యరూపం దాలిస్తే అనుకున్నది సాధించగలం. ఇదే సూత్రాన్ని పాటిస్తున్నది అనైదా పర్వానె.

పవర్ ఆఫ్ యు



నేటి యువత ఒకే రంగంపై దృష్టి పెట్టడం మానుకోవాలి. వారిలో ఉన్న శక్తిని వారే గుర్తించాలి. విభిన్న రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలి. గెట్ ఎనర్జీ విత్ వర్క్- వర్క్ విత్ ఎనర్జీ అనే కాన్సెప్ట్‌తో ముందుకు సాగుతున్నా. ప్రత్యేకమైన శిక్షణా తరగతుల ద్వారా అందరికీ ఇదే చెబుతున్నా. నేను చేపట్టిన ఈ పర్షియన్ పాపప్ కూడా అందులో భాగమే. ఒక చెఫ్‌గా పర్షియన్, ఇండియన్ ఫ్లేవర్స్‌ను సమ్మిళితంగా ఫుడ్‌లవర్స్‌కు అందించాలనుకొని ప్రారంభించా.

- అనైదా పర్వానె

బాగా తినండి.. ఆరోగ్యంగా ఉండండి..

చాలామంది ఎక్కువగా తింటే లావైపోతామేమోనని భయపడుతుంటారు. కానీ అనైద మాత్రం 'ఎంత తింటారో తినండి.. ఆరోగ్యంగా ఉండండి' అని చెబుతున్నది. దాని కోసం స్పెషల్ వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ యోగా ట్రిక్స్ నేర్పిస్తున్నది. ముంబైలోని ప్రముఖ యోగా గురువు డాక్టర్ శివశక్తి దగ్గర శిక్షణ తీసుకొన్న ఆమె.. ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూ అందరిలో అవేర్‌నెస్ కూడా పెంచుతున్నది. ఈ నెల 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నది. హత యోగాలో ఆమె నిష్ణాతురాలు.

అనైద ఒక వైద్యురాలు

విభిన్న రంగాల్లో ఉత్తేజంగా పాల్గొంటూ ముందుకు సాగుతున్న అనైదాలో మరో కోణం వైద్యవృత్తి. అదే తెబ్బె సొన్నాతి. ఇది పర్షియన్ సంప్రదాయ ఔషధ చికిత్స. ఆ దేశంలో అదొక వైద్య కోర్సు. అంటే ప్రకృతినే ఒక ఔషధంగా వాడుతూ రోగాన్ని నయం చేసే వైద్యమిది. అలాంటి వైద్యకోర్సును అభ్యసించడం తల్లి నుంచి ఆమె వారసత్వంగా తీసుకున్నది. తన తల్లి చేసిన వైద్యాన్నే తానూ చేయాలని నిర్ణయించుకొని, ఈ కోర్సును ఎంచుకున్నదామె.

స్పెషల్ పాప్‌అప్


హోటల్ రంగంలో అడుగుపెట్టిన అనైద వినూత్న ప్రయోగాలకు తెరతీసింది. భారతీయ మూలాలు కలిగిన ఆమె ఎక్కువగా విదేశాల్లోనే గడిపింది. అయితే ముంబైలో స్థిరపడిన తల్లిదండ్రుల కోసం వస్తుండేది. అలా ఇండియన్, పర్షియన్ సంస్కృతుల మేళవింపుగా ఒక వినూత్నమైన డిషెస్‌కు శ్రీకారం చుట్టింది. ముంబైలో సోడాబాటిల్ ఓపెనర్‌వాలా అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. దీని ద్వారా దేశంలోని ప్రధాన నగరాల్లో స్పెషల్ పర్షియన్ పాపప్‌లను నిర్వహిస్తున్నది. పాపప్ అంటే ముఖ్యంగా భారతీయ, పర్షియన్ ఘుమఘుమల సమ్మేళనంగా చెప్పొచ్చు. అనైదాస్ మ్యాజిక్ సూప్ కూడా అందులో భాగమే. ఆమె తయారు చేసే పర్షియన్ హలీమ్ మరీ ప్రత్యేకం.ఇటీవల ఆమె తయారు చేసిన హలీమ్‌కు, హైదరాబాద్ స్పెషల్ హలీమ్‌తో సమానంగా క్రేజ్ వచ్చిందంటే ఆరుచి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌లోనూ ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నదామె. బంజారాహిల్స్ సోడాబాటిల్ ఓపెనర్‌వాలా రెస్టారెంట్‌లో ఫిబ్రవరి ఒకటిన ప్రారంభమైన ఫుడ్‌ఫెస్ట్ ఈ నెలంతా కొనసాగుతుంది. దీనికోసం ఆమె ముంబైకి చెందిన ఒక చెఫ్, హైదరాబాద్‌కు చెందిన మరో చెఫ్‌తో కలిసి పనిచేస్తున్నది.

మైఖేల్ జాక్సన్‌తో కలిసి..



ప్రపంచ మేటి పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్‌తో కలిసి పనిచేసే అవకాశం అనైదాకు లభించింది. 'వాట్ మోర్ కెన్ ఐ గివ్' అనే పాటకు జాక్సన్‌తో కలిసి ముప్పై మంది టీమ్ పనిచేశారు. వారిలో ఆసియా నుంచి ఎంపికైన ఒకే ఒక్క వ్యక్తి అనైదా. అలా ప్రపంచవ్యాప్తంగా పదమూడు భాషల్లో ఆమె పాప్‌సాంగ్స్ పాడింది. పర్షియన్, హిందుస్థానీ సంగీతాల్లో కూడా ఆమెకు ప్రవేశం ఉంది. ఆమె కొన్ని వీడియో సాంగ్స్‌కు దర్శకత్వం కూడా వహించింది.

పెదవులపై మచ్చలా?



- వర్జిన్ ఆలివ్ ఆయిల్‌ను పెదాలపై రాసుకోవాలి. గంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ రెమిడీని మూడుసార్లు పాటించడం ద్వారా వారంలోనే తెల్లని మచ్చలను తొలగించొచ్చు.
- వెల్లుల్లిని పేస్టుగా చేసుకొని అందులో ఆల్మండ్ నూనె కలిపి పెదవులపై అద్దాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- మజ్జిగను కాటన్‌తో పెదాలపై రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. ఇలా వారానికి నాలుగుసార్లు ప్రయత్నించాలి.
- ఆపిల్ వెనిగర్‌ను కాటన్ బాల్‌తో పెదాలకు రాయాలి. 5-10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు ప్రయత్నించండి.
- నిద్రపోయే ముందు కాస్త కొబ్బరి నూనెను పెదవులపై రాసి పడుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి.

మహిళలకు రక్షణగా..



మహిళలు ప్రయాణాలు చేయాలనుకుంటున్నారు. కానీ ఆ ప్రయాణాల్లో ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆలోచిస్తారు. వెనుకడుగు వేసి ప్రయాణాల్ని మానుకుంటారు. అలాంటి వాళ్ల కోసం రష్మీ చడ్డా ఓ ఆలోచన చేసింది.

రష్మీ చడ్డా ఓయోయాగే అనే ట్రావెల్ సంస్థను స్థాపించింది. మహిళలకు రక్షణగా అనువైన ప్రయాణాలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నది. మహిళా ప్రయాణికులు ప్రయాణాల్లో పడే ఇబ్బందులు, కష్టాలు రాకుండా చూసుకుంటుంది. ఒంటరిగా ప్రయాణాలు, క్షేత్రాల పర్యటనకు వెళ్లాలనుకునేవాళ్లకు, రోడ్ ట్రిప్‌లు వేయాలనుకునేవాళ్లకు ఈ సంస్థ సేవలందిస్తున్నది. కొత్త ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తారు. ఈ ఆలోచన రష్మీ పాఠశాలలో చదువుకునేటప్పుడు వచ్చింది. స్కూల్ లెవల్ క్రీడాకారిణిగా చాలా ప్రాంతాల్లో తిరిగేది. టోర్నమెంట్స్‌లో పాల్గొంటున్న సమయంలో ఆమె ఎదుర్కొన్న సమస్యల్లో నుంచి ఈ ఆలోచన పుట్టింది. ఈ ఆలోచన నచ్చడంతో చాలా మంది మహిళ ప్రయాణికులు రష్మీని సంప్రదించి ఒంటరి, గ్రూపు ప్రయాణాలకు శ్రీకారం చుడుతున్నారు. ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో సర్వీస్ అందిస్తున్నది. భవిష్యత్తులో టూరిజం హబ్‌ను స్థాపించి మరిన్ని సేవలందిచాలనుకుంటున్నది.

నమస్తే తెలంగాణ
నిధి
[హైదరాబాద్]
శనివారం 10 ఫిబ్రవరి 2018

కనీస మొత్తం కడితే..

పండగ ఆఫర్లు ఉన్నాయని ప్రభాకర్ పదివేలు పెట్టి కొత్త మొబైల్ కొన్నాడు. బిల్లు వచ్చాక ఐదు శాతం చొప్పున సొమ్ము కొన్ని నెలలు కట్టుకుంటూ వచ్చాడు. తీరా ఆరు నెలల తర్వాత, తన బిల్లు తడిసిమోపెడు అయ్యింది. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. క్రెడిట్ కార్డు సంస్థలు మనం వస్తువు కొన్నప్పట్నుంచి బిల్లు మొత్తంపై వడ్డీని వసూలు చేస్తాయి. అంతేతప్ప, ఐదు శాతం సొమ్ము చెల్లించాం కదా.. మిగతా 95 శాతంపై వడ్డీ లెక్కిస్తాయని అనుకోవద్దు. మీరు ఆ సొమ్ము చెల్లించేంత వరకూ, క్రెడిట్ కార్డు బిల్లు పెరుగుతుందే తప్ప తగ్గనే తగ్గదని గుర్తుంచుకోవాలి. మనం బకాయిపడ్డ బిల్లుపై తదుపరి జరిమానా పడకుండా.. కనీస మొత్తం చెల్లిస్తామని గుర్తుంచుకోవాలి. ఇలా కనీస మొత్తం కట్టడం వల్ల క్రెడిట్ స్కోరుపై ఎలాంటి ప్రభావం పడకుండా తోడ్పడుతుంది. అందుకే, మొత్తం సొమ్ము చెల్లించడంపైనే దృష్టి పెడితే ఉత్తమం.



ఆరోగ్య బీమా కంపెనీ మారొచ్చా?

అత్యవసరాల్లో అక్కరకొస్తుందని ఆరోగ్య బీమా పాలసీ తీసుకుంటాం.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాక.. అట్టి సంస్థ మీరు సరైన సేవను అందించకపోతే ఎలా? క్లెయిముల పరిష్కారంలో నత్తనడకను తలపిస్తే ఏం చేయాలి? నగదురహిత సౌకర్యం అందించకపోతే జేబులో నుంచి సొమ్ము పెట్టుకోవడం కష్టమే కదా! మరి, ఇలాంటి అనుభవం ఎదురయ్యాక కూడా కిమ్మనకుండా ఉండనక్కర్లేదు. మొబైల్ కంపెనీని మార్చినట్లే.. ఆరోగ్య బీమా పాలసీని మంజూరు చేసిన కంపెనీని మార్చుకోవచ్చు. ఫలితంగా, నో క్లెయిమ్ బోనస్, వెయిటింగ్ పీరియడ్ వంటి ప్రయోజనాలను కోల్పోనక్కర్లేదు. అయితే, ఏయే సందర్భాల్లో ఆరోగ్య బీమా కంపెనీని మార్చుకోవచ్చో తెలుసా? ఇందుకు నిబంధనలేం చెబుతున్నాయంటే..

- మీరు క్రమం తప్పకుండా ఆరోగ్య బీమా పాలసీ రెన్యువల్ చేయించినప్పుడే బీమా సంస్థను మార్చుకోవచ్చు.
- కేవలం ప్రీమియం చెల్లించేటప్పుడే ఈ అవకాశం. అంతే తప్ప పాలసీ మధ్యలో కంపెనీని మార్చుకోలేరు.
- ప్రీమియం చెల్లించే తేదీ కంటే 45 రోజుల ముందే కంపెనీ మారే ప్రక్రియను ప్రారంభించాలి. ఇందుకోసం ఎంతలేదన్నా ముప్పయ్ రోజులు పడుతుంది.
- సంస్థను ఎందుకు మారుతున్నారో కొత్త సంస్థకు చెప్పాలి.
- కొత్త కంపెనీకి మారేటప్పుడు నియమ నిబంధనల గురించి పక్కాగా తెలుసుకోవాలి.

ఛాయ్ ఖర్చుతోనే.. చక్కటి భద్రత

నిరుపేద కుటుంబంలో పుట్టిన నరేష్.. కష్టపడి ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో బహుళ జాతి సంస్థలో మేనేజర్‌గా చేరాడు. అతనికి తగ్గట్టుగానే మంచి భార్య లభించింది. వారి కుటుంబం ఆనందమయంగా ఉందడానికి నిదర్శనమే.. బంగారం లాంటి ఇద్దరు పిల్లలు. వారిద్దరూ పేరెన్నిక గల స్కూల్లో 3,6వ తరగతి చదువుతున్నారు. ఒక రోజు అర్ధరాత్రి ఆఫీసు నుంచి నరేష్ ఇంటికొస్తుండగా.. కొందరు ఆకతాయిలు మద్యం తాగిన మత్తులో అతివేగంగా వచ్చి నరేష్ కారును ఢీకొట్టి పరారయ్యారు. దీంతో, అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసిన అతని కుటుంబంలో ఎక్కడ్లేని విషాదం అలుముకున్నది.



ప్రతిఒక్కరి కుటుంబంలో ఇంతటి విషాదం నిండుతుందని చెప్పలేం కానీ.. జీవితంలో ఎప్పుడేం జరుగుతందో మాత్రం ఎవరూ ఊహించలేరు. పొరపాటున ఇంటి పెద్ద హఠాత్తుగా దుర్మరణం చెందితే.. ఆ కుటుంబానికి కలిగే మానసిక వేదన అంతా ఇంతా కాదు. మొత్తం కుటుంబమంతా ఆర్థికంగా చితికిపోతుంది. అప్పటివరకూ వచ్చే ఆదాయం కూడా రాదు. ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు.. ఆర్థికంగా ఆదుకోవడానికి ఈ ప్రపంచంలో ఏ ఒక్క వస్తువు కానీ సేవ కానీ లేదని గుర్తుంచుకోండి. నిర్దిష్టమైన ఆర్థిక ప్రణాళికలుంటే తప్ప.. అట్టి కుటుంబం ఆర్థికంగా నిలబడదని మరిచిపోవద్దు. పొరపాటున ఇంట్లో ఆర్జించే వ్యక్తిని కోల్పోవాల్సి వస్తే.. ఆయా కుటుంబానికి పూర్తి స్థాయిలో ఆదుకునేవి టెర్మ్ పాలసీలు మాత్రమే. ఆదాయాన్ని సంపాదించే వ్యక్తి మరణించడం వల్ల ఆయా కుటుంబ జీవనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి తోడ్పడుతుందీ పాలసీ. చిన్నారుల స్కూల్ ఫీజులు, కుటుంబ పోషణకు అంతరాయం కలిగించకుండా ఆదుకుంటుంది. ఒకేసారి కొంత మొత్తం చేతికి అందిన తర్వాత.. జాగ్రత్తగా పొదుపు చేస్తే భవిష్యత్తులో ఆర్థికంగా లోటు రాకుండా తోడ్పడుతుంది. మొత్తానికి, టెర్మ్ పాలసీలనేవి ఆయా కుటుంబం భవిష్యత్తును నిలబెట్టడమే కాకుండా.. క్రమం తప్పకుండా ఆదాయాన్ని కూడా తెచ్చిపెట్టడంలో తోడ్పడుతాయి.

ఖర్చు అతి స్వల్పం..

టెర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఇవి అన్ని జీవిత బీమా పాలసీల్లోకెల్లా నామమాత్రపు ఖర్చుతో లభించేవి. మన జీవితానికి కవరేజీని అందించడానికే ప్రీమియం చెల్లిస్తాం. మనం ఓ పది లక్షలు పెట్టి వాహనం కొన్నామనుకుందాం. ఏటా రూ.25,000 నుంచి రూ.30 వేల దాకా ప్రీమియం చెల్లిస్తాం. అదే టెర్మ్ పాలసీ తీసుకుంటే.. ఏడాదికి రూ.8,000 నుంచి రూ.10 వేలు కడితే చాలు.. కోటి రూపాయల పాలసీని తీసుకోవచ్చు. ఉదాహరణకు, సిగరెట్ కూడా అలవాటు లేని ముప్పయ్యేండ్ల వ్యక్తి.. టెర్మ్ పాలసీ తీసుకుంటే వార్షిక ప్రీమియం రూ.9,000 దాకా కట్టాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని 365 చొప్పున లెక్కిస్తే.. రోజుకయ్యే ఖర్చు కేవలం ఇరవై ఐదు రూపాయలే. అంటే, ప్రతిరోజు సుమారు రెండు ఛాయ్‌లకు అయ్యే ఖర్చుతోనే.. దాదాపు రూ.కోటి రూపాయల కవరేజీని అందుకోవచ్చని గుర్తుంచుకోండి. ఖరీదైన కార్లు కొనేటప్పుడు వాటి రక్షణ కోసమే అధిక ప్రీమియంలు చెల్లిస్తుంటాం. అలాంటిది, మన కుటుంబానికి రక్షణనివ్వడానికి మనమెంత జాగ్రత్తలు తీసుకోవాలి? ఇప్పటికైనా మనమంతా ఒకసారి ఆలోచించాలి. కుటుంబాన్ని పోషించే ప్రతిఒక్కరూ తప్పకుండా టెర్మ్ పాలసీని ఎంచుకోవాలి. మన జీవితానికే రక్షణ కాకుండా.. మనపై ఆధారపడ్డవారికి ఆర్థికంగా నిలబెట్టే బాధ్యత మనపై ఉంటుందని మరిచిపోవద్దు.

ఎంత పాలసీ తీసుకోవాలి?

ఒక్కో వ్యక్తి ఎంతమేరకు టెర్మ్ పాలసీ తీసుకోవాలి? టీచర్లు అయినా ఐటీ ఉద్యోగి అయినా.. టెర్మ్ పాలసీ తీసుకునేటప్పుడు మూడు అంశాలపై దృష్టి సారించాలి. ఆర్జనపరులెవరైనా నలభై ఏండ్లలోపు గలవారు.. తమ వార్షిక ఆదాయానికి 20 నుంచి 30 రెట్లు టెర్మ్ పాలసీ తీసుకోవాలి. నలభైలో పడిన వ్యక్తి ఏడాది సంపాదనకు 10 నుంచి 20 రెట్లు, యాభైలో పడిన వారు ఐదు నుంచి పది రెట్ల మేరకు పాలసీని ఎంచుకోవాలి. వీలైనంతవరకూ పదవీవిరమణ పొందేవరకూ ఈ పాలసీ తీసుకోవడం అన్నివిధాల శ్రేయస్కరం.

> **కుటుంబానికి ఆర్థిక భరోసా!**
>
> భవిష్యత్తును బంగారుమయం చేయడానికి రకరకాల మదుపు సాధనాల్లో పెట్టుబడి పెడతాం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, పోస్టల్ పథకాలు వంటివాటిలో అన్నివిధాల మెరుగైనవి ఎంచుకుంటాం. భవిష్యత్తులో ఇల్లు కొనుక్కోవడం లేదా వాహనం తీసుకోవడం.. చిన్నారులకు ఉన్నతవిద్య, వారి పెళ్లి, ఇతరత్రా ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి అక్కరకొచ్చే పొదుపు పథకాలపై దృష్టి పెడతాం. మరి, ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఇంటి యజమాని హఠాత్తుగా దుర్మరణం చెందితే.. అట్టి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేవి టెర్మ్ పాలసీలు. వీటిని అన్ని బీమా సంస్థలు అందజేస్తున్నాయి.
>
> **– పునీత్‌నంద,** ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

రుణాలున్నాయా?

మనలో చాలామంది రకరకాల రుణాలను తీసుకుంటారు. వాహన, గృహ, వ్యక్తిగత.. ఇలా రుణం ఏదైనా సరే.. టెర్మ్ పాలసీ తీసుకునేటప్పుడు అందులో వాటిని చేర్చాలి. గృహయజమాని దుర్మరణం చెందితే, అట్టి రుణాలను కట్టాల్సిన అవసరముండదు.

- ప్రజల జీవన విధానంలో ఎక్కడ్లేని మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా, తీవ్రమైన వ్యాధులు లేదా జబ్బుల బారిన పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకునేందుకు, కుటుంబ పోషణకు ఇబ్బంది రానీయకుండా ఉండేందుకు.. క్రిటికల్ ఇల్‌నెస్ ప్రయోజనాన్ని అందించే టెర్మ్ పాలసీని తీసుకోవాలి. అనారోగ్య సమస్యలు తలెత్తితే, ఈ పాలసీ ఆర్థికంగా ఆదుకుంటుంది.

పాలసీ తీసుకుంటున్నారా?

టెర్మ్ పాలసీ వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకున్నాక.. ఈ పాలసీ తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారా? అయితే, బీమా సంస్థలు అడిగే ప్రతి ప్రశ్నకు నిజాయితీగా సమాధానాలివ్వాలి. ఉదాహరణకు, జీవన విధానం, వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్య చరిత్ర వంటివి తప్పకుండా పొందుపరచాలి. ఈ పాలసీని అందించేటప్పుడు, పలు సంస్థలు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయాల్సిందేనని పేర్కొంటాయి. అలాంటివి చేపట్టినప్పుడే, బీమా సంస్థ ఎంత మొత్తం పాలసీ ఇవ్వాలనే విషయంలో ఒక అంచనాకు వస్తుంది. పాలసీదారులు తప్పుడు సమాచారాన్నిచ్చి పాలసీ తీసుకున్నాక.. ఆతర్వాత అట్టి విషయం బయటపడితే.. బీమా సంస్థ పరిహారం చెల్లించదని గుర్తుంచుకోండి. కాబట్టి, కుటుంబానికి సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని సంస్థకు తెలియజేస్తే.. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని గుర్తుంచుకోండి.



బాలికలంటే కొందరు తల్లిదండ్రులకు నేటికీ వివక్షే.. ఉన్నత చదువులు చెప్పిస్తే పెళ్లి కాదేమోననే బెంగ.. పెళ్లి చేయడానికి సరైన వరుడు దొరకడేమోననే దిగులు.. ఇలా, అధిక శాతం తల్లిదండ్రులు ఇదో పెద్ద సమస్యగా పరిగణిస్తున్నారు. ఇలాంటి ప్రతికూల ఆలోచనల నుంచి సామాన్య ప్రజానీకం బయటపడాలని.. అమ్మాయికి ఉన్నత విద్య, పెళ్లికి అక్కరకొచ్చే విధంగా.. కేంద్రం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. సగటు మధ్యతరగతి తల్లిదండ్రుల ఆలోచన ధోరణిని మార్చివేస్తున్న ఆ పథకం ప్రత్యేకతేమిటో ఒకసారి చూద్దామా..

అమ్మాయికి కొండంత అండ!

పిల్లలు పుట్టగానే తల్లిదండ్రులకు రకరకాల ఆలోచనలు. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలని, పెళ్లి అత్యంత ఘనంగా నిర్వహించాలని భావిస్తారు. అమ్మాయి పుడితే.. చదువుతో పాటు వివాహానికీ అయ్యే ఖర్చులను ముందు నుంచే లెక్కలేస్తుంటారు. ఇలాంటి ఆలోచనలున్నవారికి మార్గదర్శిగా, పుట్టబోయే ఆడపిల్లలకు ఆర్థిక భరోసాను అందించడానికి కేంద్ర ప్రభుత్వం 'సుకన్య సమృద్ధి యోజన' పథకానికి శ్రీకారం చుట్టింది. అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా పథకాన్ని తీర్చిదిద్దింది. క్రమ పద్ధతిలో పెట్టుబడి, నష్టభయం లేకపోవడంతో.. ఈ పథకంలో ఖాతాను తెరవడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు. బాలికలకు విద్య, అమ్మాయిల వివాహానికి ఆర్థిక భరోసా అందించే.. సుకన్య సమృద్ధి యోజన పథకం 2015 జనవరి 22, న ప్రారంభమైంది. తెలంగాణలోనూ ఈ పథకానికి మంచి ఆదరణ లభిస్తున్నది. పోస్టాఫీసులు, బ్యాంకులు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తుండటంతో.. ఈ పథకంలో చేరేందుకు చాలా మంది తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు.

> **ఆడపిల్లలకు అద్భుత పథకం**
>
> 
>
> మహిళలకు, తల్లిదండ్రులకు ఆర్థిక భద్రత ఈ పథకంతో కలుగుతుంది. బాలికల విద్య, వివాహం పట్ల ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. స్త్రీలపై వివక్ష తొలగిపోవటంలో, వారికి ఆర్థిక పరిపుష్టి కల్గించడంలో సుకన్య సమృద్ధి యోజన పథకం కీలక పాత్ర పోషిస్తున్నది. ఇంతగా లాభం ఉన్న పథకాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు తపాలాశాఖ సిద్ధమైంది. ప్రచారంలో భాగంగా మేళాలను నిర్వహిస్తున్నాం. ప్రజల వద్దకు పథకాన్ని చేరువ చేస్తున్నాం. చాలా మంది అవగాహన లేక వెనకడుగు వేస్తున్నారు. ఇదొక అద్భుతమైన పథకం. మీ ఇంట్లో ఆడపిల్లలకై ఇప్పుడు చేసే పొదుపు, వారు భవిష్యత్‌లో అత్యున్నత స్థితికి చేరుకునే సంకల్పంలో ఆసరగా ఉంటుంది. వారు కన్న కలలు సాకారమయ్యేలా సహాయపడుతుంది.
>
> **– ముద్దు వెంకట మురళీధర్,** చీఫ్ పోస్టు మాస్టర్, జీపీవో, హైదరాబాద్

ప్రయోజనముందా?

ఖాతా తెరిచిన తేదీ నుంచి 14 ఏళ్లు మాత్రమే సొమ్ము జమ చేయాల్సి ఉంటుందనేది నిబంధన. ఉదాహరణకు 4 ఏళ్ల అమ్మాయి పేరిట ఖాతా తెరిస్తే ఆమెకు 18 ఏళ్లు వచ్చే వరకు మాత్రమే జమ చేయడానికి వీలుంటుంది. ఖాతా తెరిచినప్పట్నుంచి 21 సంవత్సరాల తర్వాత మెచ్యూర్ అవుతుంది. అప్పుడే మొత్తం సొమ్ము చేతికి వస్తుంది. ఉదాహరణకు ఒక అమ్మాయి పేరున ప్రతి నెల రూ. 1000 చొప్పున 14 ఏళ్లు పొదుపు చేస్తే 21 ఏళ్ల తర్వాత సుమారుగా రూ. 5,26,991 వస్తాయి. సుకన్య ఖాతాలో వేసిన డబ్బులు, వాటిపై వచ్చే వడ్డీలకు సెక్షన్ 80–సి కింద, ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఖాతా తెరవడం ఇలా...

దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కడైనా ఖాతా తెరవవచ్చు. పోస్టాఫీసులు అందరిలో అవగాహన కల్పించేందుకు సుకన్య సమృద్ధి యోజన మేళాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశాయి. అయితే ఇలాంటి మేళాల్లో ఖాతాలను అందించేందుకు ఒకటి రెండు రోజులు తీసుకుంటుండగా, ప్రధాన కార్యాలయాల్లో కొన్ని గంటల్లోనే ఖాతాలు అందజేస్తున్నాయి.

50 శాతం ఉపసంహరణ..

పథకం ప్రారంభంలో అమ్మాయికి 18 ఏళ్లు వచ్చే వరకు డిపాజిట్ అయిన మొత్తాన్ని పాక్షికంగా ఉపసంహరించుకోవడం సాధ్యమయ్యేది కాదు. కానీ, ప్రస్తుతం బాలికకు 18 దాటినా లేదా ఉన్నత విద్య కోసం.. పథకంలో అంతకు ముందు ఏడాది వరకు ఉన్న డిపాజిట్ మొత్తంలో 50 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. ఖాతా ప్రారంభించిన 21 సంవత్సరాల తర్వాత ఖాతాలోని డిపాజిట్ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఒకవేళ బాలిక ప్రమాదకర వ్యాధితో బాధపడితే ఖాతాను ముందుగానే క్లోజ్ చేసుకోవచ్చు. అప్పుడు నిబంధనలకు అనుగుణంగా చెల్లించిన సొమ్మును తిరిగి పొందవచ్చు.

> **పథకం ముఖ్యాంశాలు**
>
> 1. దరఖాస్తుకు కావల్సిన పత్రాలు.. ఆడపిల్ల జన్మదిన ధ్రువపత్రం, తల్లి లేదా తండ్రి గుర్తింపు పత్రం, చిరునామా పత్రం, 3ఫొటోలు (పాప, పేరెంట్)
> 2 10 ఏళ్లలోపు వయస్సు గల బాలికల పేరున తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన ఖాతా పోస్టాఫీస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తెరవవచ్చు.
> 3. కనీస సొమ్ము రూ. 1000. తర్వాత ఎంతైనా, ఎప్పుడైనా డిపాజిట్ చేసుకోవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ. లక్షన్నర మించరాదు. ఖాతాను ఎక్కడికైనా బదిలీ చేసుకోవచ్చు
> 5. ఖాతా తెరిచిన తేదీ నుంచి 21 ఏళ్ల తర్వాత నిలిపివేయబడుతుంది. అప్పటి వరకు జమ చేయబడిన సొమ్ముకు చక్రవడ్డీని కలిపి అమ్మాయికి నేరుగా అందజేస్తారు.
> 7. మధ్యలో సొమ్ము కట్టలేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రూ. 50 జరిమానా చెల్లించి కొనసాగవచ్చు.

ఎంత పొదుపు? 21 ఏళ్ల తర్వాత వచ్చే రాబడి? (రూ.లలో)

నెలకు	ఏడాదికి	మొత్తం (14ఏళ్లకు)	ఫలితం (21ఏళ్లకు)
1000	12,000	1,68,000	5,26,991
5000	60,000	8,49,000	26,34,947
10,000	1,20,000	16,80,000	52,69,887
12,500	1,50,000	21,00,000	65,87,357

... సిద్ధార్థ్ బీసగోని
ఫొటో: అజహర్ షేక్

నష్టం తక్కువ.. రాబడి ఎక్కువ

ఫండ్ పరిచయం మార్కెట్ పరిస్థితులను బట్టి మదుపరులు తమ పెట్టుబడుల వ్యూహాన్ని మార్చుతున్నారు. కొన్నిసార్లు ఒకే మదుపు సాధనంపై అధిక దృష్టి సారిస్తే.. మరికొన్ని సందర్భాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే, ఇలా కాకుండా, పెట్టుబడుల్లో సమతుల్యాన్ని ఎప్పటికప్పుడు పాటించాలి. డెట్, ఈక్విటీ, ఇతర పెట్టుబడి సాధనాల్లో పరిస్థితులకు తగ్గట్టుగా మదుపు చేయాలి. సరిగ్గా, ఇలాంటి సందర్భంలోనే బ్యాలెన్స్‌డ్ ఫండ్ చక్కగా అక్కరకొస్తుంది. డెట్, ఈక్విటీ మార్కెట్లలో ఒకవైపు పెట్టుబడి రక్షణ ఉండటంతో బాటు మరోవైపు పెట్టుబడిపై తగినంత రాబడి రావాలని ఆశిస్తున్నారు. ఇలాంటి వారికి చక్కటి ప్రత్యామ్నాయం.. బ్యాలెన్స్‌డ్ ఫండ్ అని చెప్పొచ్చు.

ఫండ్ సిద్ధాంతం..

1995లో ఆరంభమైన యూటీఐ బ్యాలెన్స్‌డ్ ఫండ్ మదుపు సాధనాల్లో సమతుల్యాన్ని కోరుకునే వారికి అతికినట్లు సరిపోతుంది. ఇందులో పెట్టుబడి పెట్టేవారికి క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందించడమే కాదు.. మన పెట్టుబడి మొత్తం కూడా గణనీయంగా పెరుగుతుంది. ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. డెట్‌ను పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారు. ప్రధానంగా దీర్ఘకాలిక కార్పొరేట్ బాండ్లలో మదుపు చేస్తారు. ఈక్విటీ క్షీణిస్తుందని గట్టి సంకేతాలు అందితే తప్ప ఫండ్ మేనేజర్ ఈక్విటీ, డెట్‌ల మధ్య కేటాయింపుల్లో మార్పు చేయరు. ఈక్విటీల్లో గరిష్ఠంగా 75 శాతానికి మించి మదుపు చేయడానికి అంగీకరించరు. రెండు లేదా మూడేండ్లలో మెచ్యూర్ అయ్యే కార్పొరేట్ బాండ్లలో డెట్‌ను మదుపు చేస్తారు. మొత్తానికి, కాస్త తెలివిగా గవర్నమెంట్ సెక్యూరిటీల్లో 20 నుంచి 30 శాతం దాకా ఈ ఫండ్ మదుపు చేస్తుంది. ప్రస్తుతానికి, అరవై శాతం మేరకు లార్జ్ క్యాప్ ఫండ్లు, మధ్యలో కాస్త సమతుల్యాన్ని పాటించే ఫండ్లలో మదుపు చేయడానికి ముందుకొస్తుంది. స్మాల్ క్యాప్ ఫండ్ల మీద దృష్టి సారిస్తుంది. మధ్యస్థ కంపెనీల విషయానికొస్తే.. ఐటీ, కెమికళ్లు వంటి వాటిలో మదుపు చేస్తుంది.



వి. శ్రీవాస్తవ
ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, యూటీఐ

యూటీఐ ఎందుకు?

23 ఏండ్ల నుంచి యూటీఐ బ్యాలెన్స్‌డ్ ఫండ్ మంచి పనితీరును కనబరిచింది. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. ఆరంభం నుంచి 15.80 శాతం చొప్పున సొమ్మును ఆర్జించి పెట్టింది. ఇందులో మదుపు చేయగా గిట్టుబాటయ్యే డివిడెండ్‌పై పన్ను కట్టక్కర్లేదు. దీర్ఘకాలిక మూలధనలాభంపై పన్ను కూడా లేదు. ఒక్క 2013 తప్ప 2003 నుంచి క్రమం తప్పకుండా డివిడెండ్‌ను ప్రకటించింది. 2017 మార్చి నుంచి నెలసరి డివిడెండ్లను మదుపరులకు అందజేస్తోంది. పెట్టుబడి సాధనాల్లో వైవిధ్యాన్ని కోరుకునేవారికి.. దీర్ఘకాలంలో సంపదను సృష్టించాలని ఆశించేవారికి ఈ ఫండ్ అతికినట్లు సరిపోతుంది. తక్కువ నష్టభయం ఉంటూనే ఈక్విటీల్లో మంచి ఆదాయం రావాలని ఆశించేవారికి ఈ ఫండ్ చక్కగా ఉపయోగపడుతుంది.



రైతులకూ పాత కారుపై రుణం

కొత్త కారు అంటే ఎంపికలో తర్జనభర్జన పడాల్సి ఉంటుంది తప్ప.. పాత కారుతో ఎలాంటి ఇబ్బందులుండవు. మార్కెట్లో బోలెడన్నీ రకాలు అందుబాటులో ఉంటాయి. పైగా, మన ఆర్థిక స్తోమతకు తగ్గట్టు నచ్చిన కారును ఎంచుకోవచ్చు. కాకపోతే, పాత కార్ల మీద బ్యాంకులు రుణాలెలా మంజూరు చేస్తాయి? ఎవరెవరికీ ఎంతెంత ఇస్తాయో చూద్దామా..

కారు కొనుగోలు చేసే డీలర్ వద్ద ఉండే బ్యాంకు సిబ్బంది.. రుణం విషయంలో రకరకాలుగా చెబుతుంటారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. పాత కారు తీసుకునే ఉద్యోగి కనీస వార్షిక జీతం రూ. 3 లక్షల కంటే తక్కువగా ఉండకూడదు. స్వయం ఉపాధి పొందేవారు, వ్యాపారుల వార్షిక ఆదాయం రూ.4 లక్షల లోపు ఉండాలనేది నిబంధన. రైతులూ పాత కార్లను కొనుగోలు చేయవచ్చు. కాకపోతే, ఏడాదికి కనీసం రూ.4 లక్షలైనా ఆదాయం కలిగి ఉండాలి.



- పాత కార్లపై హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్, యాక్సిస్, కోటక్ మహీంద్ర వంటి బ్యాంకులు అర్హులకు రుణాలను మంజూరు చేస్తాయి. బ్యాంకులు, రుణగ్రహీత ఎంచుకునే వ్యవధిపై వడ్డీ రేటు ఆధారపడుతుంది. ఉదాహరణకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడేండ్లలోపు రుణాలపై సుమారు 11.45 శాతం వడ్డీని వసూలు చేస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడేండ్లలోపు వ్యవధి గల రుణాలపై రూ.17.25 శాతం, ఆతర్వాత కాలానికి గాను 17.50 శాతం వడ్డీని తీసుకుంటాయి. గరిష్ఠంగా ఏడేండ్ల దాకా రుణం చెల్లించే అవకాశాన్ని ఈ బ్యాంకు కల్పిస్తుంది. సుమారు 85 శాతం మేరకు రుణాన్ని మంజూరు చేయడానికి అంగీకరిస్తుంది.
- కార్పొరేట్ రేట్లకే పాతకారు రుణాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అందిస్తుంది. 13.50 నుంచి 14.25 శాతం చొప్పున ఈ బ్యాంకు రుణాన్ని అందజేస్తుంది. ఇతర ఉద్యోగులు, వ్యాపారులైతే.. 24 నెలల్లోపు వ్యవధిని ఎంచుకుంటే.. 15.75 శాతం నుంచి 18.25 శాతం వడ్డీని వసూలు చేస్తుంది. 36 నెలల వ్యవధి నుంచి అరవై నెలల్లోపు అయితే 15.25 నుంచి 17.75 శాతం రుణాన్ని మంజూరు చేస్తుంది.

నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 10 ఫిబ్రవరి 2018



ఏవీ కీసర మిడోస్..

తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్‌కు చెందిన ఏవీ కన్‌స్ట్రక్షన్స్.. తాజాగా 'ఏవీ కీసర మిడోస్' వెంచర్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. బోగారం, కీసరలో సుమారు ఇరవై ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నామని సంస్థ వెల్లడించింది. హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకుని.. 279 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నది. ప్రాజెక్టును ప్రకటించి.. ప్లాట్లను విక్రయించేసి చేతులు దులిపేసుకోవడం కాకుండా.. దాదాపు ఐదేండ్ల పాటు ఆయా లేవుట్ పర్యవేక్షణ బాధ్యతలనూ తామే చేపడతామని ఏవీ కన్‌స్ట్రక్షన్స్ తెలియజేసింది. లేఅవుట్‌లో రహదారులు, ఎలక్ట్రికల్ లైన్లు, మొక్కల సంరక్షణ వంటివి నిర్వహిస్తామని ప్రకటించింది. ఇందులో చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలం, లోటస్ పాండ్ వంటివి ఏర్పాటు చేయనుంది. ఎకరంన్నర స్థలంలో ప్రత్యేక పార్కును అభివృద్ధి చేస్తున్నది. కేవలం పెద్ద ప్లాట్లే కాకుండా చిన్న ప్లాట్లకూ ఇందులో స్థానం కల్పించింది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా ఈ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నామని సంస్థ ఎండీ జక్కా వెంకట్‌రెడ్డి 'నమస్తే సంపద'కు తెలిపారు.



'టెక్' డెవలపర్లు!

నగరానికి చెందిన నిర్మాణ సంస్థలు ఆధునిక బాటపట్టాయి. వాణిజ్య భవనాల నిర్మాణంలో ఆధునిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగిస్తున్నాయి. పలువురు డెవలపర్లు ఐవోటీ, వర్చువల్ రియాల్టీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద అధిక దృష్టి సారిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియాను వినియోగించే నిర్మాణ సంస్థల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా ఐటీ నిపుణులను సైతం పలు కంపెనీలు నియమిస్తున్నాయి.

సాధారణంగా నగర నిర్మాణ సంస్థలు ఫ్లాట్లు, విల్లాలే కాకుండా వాణిజ్య భవనాలను నిర్మిస్తుంటాయి. వాణిజ్య భవనాల్లో ఐటీ, రిటైల్ సముదాయాలు అధికంగా ఉంటాయి. అయితే, ప్రస్తుతం సొంతింటిని కొనుక్కుంటున్నవారిలో సింహభాగం యువతీయువకులే. మరి, వీరిని వీలైనంత సులువుగా చేరేందుకు నగర నిర్మాణ సంస్థలు ఆధునిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగిస్తున్నాయి. వాణిజ్య భవనాల నిర్మాణంలో ఖర్చు పెరిగినా వెనకడుగు వేయడం లేదు.

- సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ నిర్మాణ సంస్థలు విరివిగా వినియోగిస్తున్నాయి. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మాదాపూర్, కొండాపూర్, కోకాపేట్ వంటి ప్రాంతాల్లో నిర్మించే అపార్టుమెంట్లు, విల్లా ప్రాజెక్టులను కట్టే డెవలపర్లు వర్చువల్ రియాల్టీ మీద దృష్టి సారిస్తున్నారు. ఇండ్లను కొనడానికి వచ్చే వారికి వర్చువల్ రియాల్టీ ద్వారా.. తమ ప్రాజెక్టులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటే కలిగే అనుభూతిని ముందే చూపెడుతున్నారు. మరికొందరు కొనుగోలుదారులకు చేరువ కావడానికి డిజిటల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నారు. ఈ పోకడల ఇటీవల కాలంలో మరింత పెరిగింది. నగరానికి చెందిన పీబీఈఎల్ సంస్థ ముందునుంచీ డిజిటల్ మీడియాలో తమ ప్రత్యేకతను చాటి చెబుతున్నది. ముంబైకి చెందిన హీరానందాని గ్రూప్ ప్లాట్లను విక్రయించడానికి డిజిటల్ ప్లాట్‌ఫారంను అధిక శాతం వినియోగించింది. ప్రస్తుతం, దాదాపు అందరూ డెవలపర్లు తమ ప్రాజెక్టులను డిజిటలీకరణ చేయడానికి దృష్టి సారిస్తుండటం విశేషం. కొందరు డెవలపర్లు తమ వ్యాపార ప్రణాళికలు, వచ్చే ఐదేండ్లలో చేపట్టనున్న ప్రాజెక్టులు వంటి వివరాలను డిజిటల్ ప్రచారంలో పొందుపరుస్తున్నారు. కొనుగోలుదారుల్లో 90 శాతం ఐటీ ఉద్యోగులే ఉండటంతో.. వారిని చేరుకోవడానికి డెవలపర్లు ప్రయత్నిస్తున్నారు.
- హైదరాబాద్‌లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రధానంగా, పశ్చిమ హైదరాబాద్‌లో ఈ పోకడ అధికంగా కనిపిస్తుంది. కొనుగోలుదారులు ఆధునిక గృహాల వైపు అధిక దృష్టి సారిస్తున్నారు. టెక్నాలజీతో కూడుకున్న నిర్మాణాలే భవిష్యత్తులో నిలబడతాయని సుమారు ఎనభై శాతం కొనుగోలుదారులు సీబీఆర్‌ఈ నిర్వహించిన సర్వేలో వెల్లడించారు. ఈ సందర్భంగా సీబీఆర్‌ఈ దక్షిణాసియా ఛైర్మన్ అంశుమన్ మ్యాగజీన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడానికి భారత్ రియల్ రంగం ఆధునికత వైపు పరుగులు పెడుతుందన్నారు. టెక్నాలజీని విరివిగా వినియోగించడం వల్ల అటు డెవలపర్లకే కాకుండా కొనుగోలుదారులకూ ఉపయోగం ఉంటుందన్నారు.

క్రెడాయ్ యూత్‌కాన్- 2018 ప్రారంభం

నిర్మాణాల్లో యువ నినాదం



నవ యువ డెవలపర్లు భారత నిర్మాణ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. తల్లిదండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని.. ఈ రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాల్లో నూతన పద్ధతులను పాటిస్తున్నారు. సరిగ్గా, ఇదే సమయంలో భారత దేశంలోని యువ డెవలపర్లను ఏకతాటిపైకి తీసుకొచ్చింది క్రెడాయ్. దేశంలోని వివిధ నగరాల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో తాజాగా క్రెడాయ్ యూత్‌కాన్-2018 పేరిట జాతీయ సదస్సును నిర్వహించింది.

హెచ్‌ఐసీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ రంగంలో యువత పరిస్థితులను తెలియజేసే 'ద యూత్ బారోమీటర్' సర్వే నివేదికను పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆవిష్కరించారు. యువత (మిలీనియల్స్) ఎలా ఆలోచిస్తున్నారు? తల్లిదండ్రులతో ఎంతకాలం ఉంటున్నారు? ఎందుకు ఉంటున్నారు? ఖర్చు, పొదుపు ఎలా చేస్తున్నారు? వంటి అంశాలపై ప్రత్యేక నివేదికను తయారు చేసింది. ఈ నివేదికలో ప్రధానంగా మూడు అంశాల గురించి ప్రస్తావించింది. వీరి ప్రవర్తనాసరళి రియల్, రిటైల్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే విషయాలను పొందుపర్చింది.

82%

యువత తమ తల్లిదండ్రులతో కలిసి నివసించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. తల్లిదండ్రులను వదిలేసి బయటికి వెళితే.. పెరిగిన ఇండ్ల ధరలను తట్టుకోవడం కష్టమని అనుకుంటున్నారు.

68%

తల్లిదండ్రులతో నివసించలేని యువత అద్దెకు ఉండటానికే ఆసక్తి చూపిస్తున్నారు.

అధిక శాతం మంది సొంతిల్లు కొనాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. అపార్టుమెంట్ నిర్మిస్తున్న ప్రాంతం, ఫ్లాట్ సైజు వంటి విషయాల్లో రాజీపడటానికి ఏమాత్రం అంగీకరించడం లేదు.

భారత్‌లో 25 శాతం దాకా యువత ఒక కంపెనీని ఎంచుకునేటప్పుడు జీతం, ఇతర ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నారు. తమ ఇంటి నుంచి 45 నిమిషాలు కంటే అధిక దూరం ప్రయాణించడానికి 73 శాతం మంది అంగీకరించడం లేదు.

24% యువత తమ సంపాదనను పొదుపు చేయడానికే ఆసక్తి చూపిస్తున్నారు.

ఈ సందర్భంగా క్రెడాయ్ నేషనల్ అధ్యక్షుడు జక్సాసీ షా మాట్లాడుతూ.. 'క్రెడాయ్‌లో ఎల్లప్పుడూ యువతకు అధిక ప్రాధాన్యతనిస్తాం. ఎందుకంటే, రేపటి తరానికి వారే నాయకులు. అందుకే, ఈ రంగంలో యువ బిల్డర్లకు రకరకాల అంశాలపై అవగాహనను పెంచేందుకు కృషి చేస్తున్నాం. రియల్ ఎస్టేట్‌తో సహా పలు రంగాల్లో పెరుగుతున్న యువత ప్రభావాన్ని యూత్ బారోమీటర్ నివేదిక ద్వారా తెలుసుకునేందుకు ప్రయత్నించామ'న్నారు.

అందుబాటు గృహాలపై లేదు జీఎస్టీ



మోడీ సర్కార్ ఇండ్ల కొనుగోలుదారులకు భలే నజరానా ప్రకటించింది. అందుబాటు గృహాలను కొనేవారి నుంచి ఎట్టి పరిస్థితుల్లో జీఎస్టీ (గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్)ని వసూలు చేయకూడదని నిర్ణయించింది. దీని వల్ల ఇండ్ల కొనుగోలుదారులకు అతిపెద్ద ప్రయోజనం కలుగుతుందని చెప్పొచ్చు.

కేంద్ర బడ్జెట్‌తో ఉసూరుమనిపించిన మోడీ సర్కార్ బిల్డర్లకు తాజా ఆదేశాలను జారీ చేసింది. అందుబాటు గృహాలను కొనేవారి నుంచి జీఎస్టీని వసూలు చేయకూడదని డెవలపర్లకు తెలియజేసింది. ప్రస్తుతమున్న ఎనిమిది శాతం జీఎస్టీని.. ఇన్‌పుట్ క్రెడిట్ ద్వారా సర్దుబాటు చేయవచ్చని సూచించింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లభించిన తర్వాత.. ఇండ్ల ధరలు తగ్గితే తప్ప బిల్డర్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లించనక్కర్లేదు. ఇటీవల జనవరి 18న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వెలువడిన ఈ నిర్ణయం వల్ల.. తాజా నిర్ణయం అమల్లోకి వచ్చింది. 2017-18 బడ్జెట్‌లో అందుబాటు గృహాలకు కేంద్రం మౌలిక సదుపాయాల హోదాను మంజూరు చేసింది. సీఎల్‌ఎస్‌ఎస్ (క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీము)కు లోబడి నిర్మించే అందుబాటు గృహాలను ప్రోత్సహించడానికి.. జీఎస్టీపై రాయితీని అందజేసింది. స్థలం, అక్కడి ధర, నిర్మాణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని.. జీఎస్టీని లెక్కిస్తే అయ్యేది ఎనిమిది శాతమే. ఈ సౌలభ్యం జనవరి 25 నుంచి అందుబాటులోకి వచ్చింది. అయితే, హైదరాబాద్ వంటి నగరాల్లో అందుబాటు గృహాల సంఖ్య ఎంత ఉంటుందో ఎవ్వరికీ తెలియదు.

సుడోకు

డైలీ సుడోకు 122 సమాధానం

3	5	4	7	9	8	1	2	6
8	2	1	5	4	6	9	3	7
6	9	7	3	1	2	5	4	8
2	7	8	4	5	9	3	6	1
4	1	6	2	3	7	8	9	5
5	3	9	8	6	1	2	7	4
1	6	3	9	8	4	7	5	2
9	8	2	6	7	5	4	1	3
7	4	5	1	2	3	6	8	9

డైలీ సుడోకు -123

	9		2					
	2		3			1		
3	4	1				6	2	
	7	3		8				
6								5
				1		7	3	
	5	8				3	1	2
		7			2		5	
					8		9	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

దక్షిణ హైదరాబాద్‌పై దృష్టి పెట్టాలి!

వట్టినాగులపల్లి.. వినూత్న ప్రణాళిక

పెరిగిన ఉద్యోగావకాశాలు, ఆర్థిక అభివృద్ధి కారణంగా పశ్చిమ హైదరాబాద్‌లో భూములు దొరకని పరిస్థితి. ప్రస్తుతం నివారణ చర్యలను చేపట్టకపోతే, రానున్న రోజుల్లో కోటి మంది జనాభా, మొత్తం ఉద్యోగుల్లో అరవై శాతం ఈ ప్రాంతంలోనే నివాసం ఏర్పాటు చేసుకునే ఆస్కారముంది. ఇదే వాస్తవమైతే, పశ్చిమ హైదరాబాద్ కాస్త బెంగళూరు తరహాలో అస్తవ్యస్తంగా మారే ప్రమాదముంది. కాకపోతే, దీనికి పక్కనే గల.. దక్షిణ హైదరాబాద్‌లో సుమారు 36 కిలోమీటర్ల మేరకు ఔటర్ రింగ్ రోడ్డు వెళుతుంది. రెండు రాష్ట్ర రహదారులు, ఐదు రేడియల్ రోడ్డులు దీన్ని మీదుగానే వెళుతున్నాయి. ఒకవైపు పశ్చిమం జనసాంద్రతతో నిండిపోతే.. మరోవైపు దక్షిణ హైదరాబాద్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. మరి, రెండు జలాశయాలు, పర్యావరణాన్ని పూర్తి స్థాయిలో పరిరక్షిస్తూనే దక్షిణ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కుదరదా? అర్బన్ ప్లానర్లు, విధానకర్తలు ఈ అంశాన్ని పట్టించుకోకపోతే అక్రమ కట్టడాల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గే ప్రసక్తే ఉండదు. జలాశయ పరిరక్షణ కమిటీ ఆదేశాలను చాలా మంది పట్టించుకోవడం లేదు. దీంతో, కేసులూ అధికమవుతున్నాయి. ఇలాంటి ప్రతికూల అంశాల కారణంగా, దక్షిణ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడంలేదు

ఈపీటీఆర్‌ఐ ఏం చెబుతున్నది?

2007లో ఈపీటీఆర్‌ఐ సమర్పించిన నివేదికలో పలు ఆసక్తికరమైన విషయాలు బహిర్గతమయ్యాయి. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల ప్రవాహం దాదాపు 584 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. ఇది ఇంచుమించు 1,44,248 ఎకరాలతో సమానం. ఈ రెండు జలాశయాలు ప్రవహించే ప్రాంతంలో దాదాపు నాలుగు వేల చెక్ డ్యాములను నిర్మించారు. దీంతో, రెండు జలాశయాలు తరుచు ఎండిపోతున్నాయి. డెడ్ స్టోరేజీ స్థాయికి చేరుకుంటున్నాయి. గత రెండు దశాబ్దాల్లో ఇవి పూర్తిగా ఎఫ్‌టీఎల్ స్థాయికి చేరుకోలేదు. వీటిని పూర్తి స్థాయిలో పరిరక్షించాలంటే.. ముందుగా, ఆ నాలుగు వేల చెక్‌డ్యాములను తొలగించాలి. ఫుల్ ట్యాంక్ లెవెల్‌లోని ఆక్రమణలను తొలగించాలి. ఇతర నీటి సంరక్షణ స్ట్రక్చర్లను తొలగించాలి. లేకపోతే, మూసీ నది పూర్తిగా కనుమరుగయ్యే స్థితికి చేరుకుంటుంది. 2000 నుంచి 2003 మధ్యలో ప్రతి ఐదు కిలోమీటర్‌కి ఒక అడ్డుకట్ట వేశారు. చెక్ డ్యామ్, పర్కొలేషన్ ట్యాంకులు, కందకం వంటివి ఏర్పాటు చేశారు. అధిక వర్షం కురిసినప్పుడూ రెండు జలాశయాలు పూర్తి స్థాయిలో నిండని పరిస్థితి. ఇన్నిన్ని చెక్ డ్యాములను ఏర్పాటు చేస్తే, అందులోకి నీరు ఎలా ప్రవహిస్తుంది? అసలు జలాశయమే నిండని పరిస్థితి ఉన్నప్పుడు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి అడ్డుకట్ట వేయడం వల్ల ఉపయోగమేమిటి? మరి, ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఏం చేయవచ్చు?

కాలుష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో వెదజల్లని కట్టడాలను ఈ ప్రాంతంలో అనుమతించవచ్చు. చెరువులకు నష్టాన్ని కలిగించని, కాలుష్యాన్ని వెదజల్లని ఐటీఈఎస్ సంస్థల ఏర్పాటుకు అనుమతించవచ్చు. పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు స్థానం కల్పించవచ్చు. లేఅవుట్లను అనుమతించాల్సి వస్తే.. 40 శాతం స్థలంలోనే అభివృద్ధికి అనుమతించాలి. అరవై శాతంలో ఉమ్మడి సదుపాయాల్ని పొందుపరచాలి. రోడ్డు విస్తీర్ణం బట్టి భవనం ఎత్తును కొలిచే ఎఫ్‌ఎస్‌ఐని 1 శాతమే అనుమతించాలి. హిమాయత్ సాగర్ పరివాహకంలో ఒక కిలోమీటర్ చొప్పున అడవుల పెంపకాన్ని అనుమతించినట్లే.. ఉస్మాన్‌సాగర్ చుట్టూ అనుమతించాలి. ఈ ప్రాంతాలను రిజర్వు ఫారెస్ట్ ఏరియాగా ప్రకటించాలి. జలాశయంతో పాటు ఒడ్డు ప్రాంతాల్లో పూడికతీత పనులను తక్షణమే చేపట్టాలి. ఈ రెండు చెరువులు కలిసి హైదరాబాద్‌కు 170 ఎంఎల్‌డీ లీటర్ల నీటిని చౌక ధరకే అందజేస్తుంది. ఇలా, పక్కా నిబంధనల్ని ఏర్పాటు చేసి.. చెరువుల సంరక్షణకు పెద్దపీట వేస్తూనే, 111 జీవో నిబంధనల్ని అనుసరిస్తూనే సమీకృత ప్రణాళికను రచించాల్సిన అవసరముంది. ఓ నిర్దిష్టమైన విధానంతో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ఇది రచయిత వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. దీంతో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు)

- సిస్టా విశ్వనాథ్
మాజీ డైరెక్టర్, హెచ్‌ఎండీఏ

వట్టినాగులపల్లిలో భూసేకరణ..

వట్టినాగులపల్లి.. ఉస్మాన్ సాగర్ దిగువ ప్రవాహభాగంలో ఉన్నప్పటికీ, అధిక శాతం ప్రాంతం క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలోకి రాదు. ఇది 111 జీవో పరిధిలో ఉన్నా, ఉత్తర దిశలో గోపనపల్లి గుట్టల నుంచి ఓ ప్రధానమైన నాలా మాత్రమే ఉస్మాన్ సాగర్‌లోకి ప్రవహిస్తుంది. అందుకే, ఈ ప్రాంతాన్ని 111 జీవో గ్రామం జాబితాలో నుంచి తొలగించాలని గతంలో ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు చేసింది. ఈ ప్రాంతం ఓఆర్‌ఆర్‌కి కిలోమీటర్‌లోపే ఉంటుంది. గ్రోత్ కారిడార్‌లోకి వస్తుందన్నమాట. 111 జీవో నిబంధనల్ని పాటిస్తూనే.. ఒకవైపు పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే.. పట్టణ ప్రణాళికను అవలంభిస్తే ఎలా ఉంటుంది? 2017 హెచ్‌ఎండీఏ ల్యాండ్ పూలింగ్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని వట్టినాగులపల్లిలో ఎలాంటి ప్రణాళికల్ని రచించవచ్చు?

- వట్టినాగులపల్లి రెవెన్యూ గ్రామంలో 1875 ఎకరాల్లో ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేయాలి.
- ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే నాలాలు, మూడు నీటి కుంటలున్నాయి. వీటి ప్రవాహంపై దృష్టి పెట్టాలి.
- మొత్తం అరవై శాతం ప్రాంతంలో ఖాళీ స్థలాలను వదిలేయాలి. రహదారులను అభివృద్ధి చేయాలి. మూడు శాతం ఎమినిటీస్ కోసం కేటాయించాలి. ముప్పయ్ ఐదు శాతం స్థలాన్ని నాలా, గుట్టలు, మూడు నీటి కుంటల చుట్టూ వదిలేయాలి. 5 శాతం స్థలంలో పార్కులు, ఆటస్థలాలను అభివృద్ధి చేయాలి. మిగా ముప్పయ్ శాతం స్థలాన్ని రిజర్వు ఫారెస్ట్ ఏరియాగా ప్రకటించాలి.
- మిగతా నలభై శాతం స్థలాన్ని హెచ్‌ఎండీఏ, స్థల యజమానులకు మధ్య 60:40 శాతం మధ్య ఒప్పందం కుదరాలి. దీంతో ఒక్క ఎకరానికి సుమారు 1160 గజాల స్థలం భూయజమానికి వస్తుంది. అమరావతిలో జరిగిన భూసేకరణలో ఎకరాకు వెయ్యి గజాలు వచ్చిన విషయాన్ని మర్చిపోవద్దు.
- కేవలం వ్యక్తిగత భవనాలను అనుమతించాలి. ప్రతి సైటులో రెండు బ్లాకులను అనుమతించాలి. అపార్టుమెంట్లు, రో హౌజెస్‌ను అనుమతించకూడదు.
- రెసిడెన్షియల్, ఐటీఈఎస్, విద్యాసంస్థలు, కంపెనీలను మాత్రమే అనుమతించాలి. హోటళ్లు, పరిశ్రమలు, ఉత్పత్తి సంస్థలను అనుమతించకూడదు.
- ఉత్పత్తి, తయారీ, ప్రాసెసింగ్, ఫ్యాబ్రికేషన్, రీసైక్లింగ్, ఇతర కాలుష్యకారక పరిశ్రమల్ని ఈ స్థలాల్లో అనుమతించకూడదు.
- కాలుష్యరహిత కార్యకలాపాలకు అనుమతించే విషయంలో ఆయా సంస్థను బట్టి అనుమతించాలి.
- మూడు శాతం ఎమినిటీస్ స్థలంలో.. విద్యా సంస్థలు, కంపెనీలు, షాపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- ఎకరా భూమిలో 25 శాతం స్థలంలోనే నిర్మాణాలను అనుమతించాలి. బహుళ అంతస్తుల భవనాలు, ఆకాశహర్మ్యాలను నిర్మించకూడదు. గరిష్ఠంగా మూడు అంతస్తులకే అనుమతివ్వాలి.
- డీవాట్స్ విధానాన్ని ప్రతిఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి చేసిన నీటికి ఆయా ప్లాటు కోసమే వినియోగించాలి.
- అరవై శాతం స్థలంలో చెట్లను విధిగా పెంచాలి.
- ఈ ప్లాట్లను రిజిస్టర్డ్ అసోసియేషన్ లేదా సంస్థ ద్వారా నిర్వహించాలి. సుశిక్షితులైన నిపుణులకు ఇందుకోసం వినియోగించాలి.
- ఈ విధానాన్ని తొలుత వట్టినాగులపల్లిలో అమలు చేసి.. ఫలితాల ఆధారంగా రెండు చెరువులు పారని ప్రాంతాల్లో అమలు చేసే దిశగా ఆలోచించాలి.


వరుణ్‌తేజ్

'జయాపజయాల గురించి పెద్దగా ఆలోచించను. ప్రయోగాల ప్రయాణాన్నే ఇష్టపడతాను. నేను చేసే ప్రతి పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేయాలని తపిస్తాను' అన్నారు వరుణ్‌తేజ్. 'కంచె' 'ఫిదా' చిత్రాలతో తెలుగు చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సృష్టించుకున్నారు వరుణ్‌తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో వరుణ్‌తేజ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆయన చెప్పిన సంగతులివి..

ఆ టైమ్‌లో అమ్మాయిలెవరూ మమ్మల్ని చూసేవారు కాదు!

మీ జీవితంలోని తొలిప్రేమ అనుభూతి గురించి ..?

• స్కూల్‌రోజుల్లోనే ఫస్ట్‌క్రష్ (తొలిప్రేమ) అనుభవం ఉంది. అయితే ఆ సంఘటన అంతగా గుర్తులేదు.

'తొలిప్రేమ'లో మీ పాత్ర చిత్రణ ఎలా వుంటుంది?

• కొంచెం అగ్రెసివ్‌గా (దూకుడు) కనిపిస్తాను. హుషారు, చలాకీతనం కలబోతగా సరికొత్త పంథాలో నా పాత్ర సాగుతుంది. మూడు దశల్లోని ప్రేమ భావనలకు అద్దంపట్టే చిత్రమిది. షూటింగ్ జరుగుతున్నప్పుడు మళ్లీ కాలేజీ కొచ్చాననే అనుభూతి కలిగింది.

చాలా ప్రేమకథలొస్తున్నాయి కదా..ఇందులో కొత్తగా ఏం చెప్పబోతున్నారు?

• ప్రతి ఒక్కరి జీవితంలో తొలిప్రేమ భావన గొప్పగా వుంటుంది. ఆ జ్ఞాపకాల నుంచి బయటపడటం అంత సులభం కాదు. ఆ మధురానుభూతులు ఎప్పుడూ మన హృదయాల్ని వెంటాడుతుంటాయి. ఈ విషయాలన్నింటిని ఎనిమిదేళ్ల కాలవ్యవధిలో హృద్యంగా ఆవిష్కరించాం.

ఈ సినిమా చేస్తున్నప్పుడు మీ తొలిప్రేమ అనుభవాలు ఏమైనా గుర్తుకొచ్చాయా?

• కాలేజీ రోజుల్లో ప్రేమకోసం నేను ఎక్కువగా టైమ్ కేటాయించలేదు (నవ్వుతూ). కానీ మా స్నేహితుల తొలిప్రేమ అనుభవాల గురించి బాగా తెలుసు. ప్రస్తుతం వారిలో చాలా మంది పెళ్లిచేసుకోని సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నారు. నా ఫ్రెండ్స్ అనుభవాల్ని సినిమాలోని నా పాత్రకు అన్వయించుకున్నాను.

కథాపరంగా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నారు. వృత్తిపరంగా మిమ్మల్ని ఎవరు మార్గదర్శనం చేస్తున్నారు?

• నేను సినిమా ప్రేమికుణ్ణి. కాలేజీ రోజుల నుంచి విడుదలయ్యే ప్రతి సినిమాను చూసేవాణ్ణి. ప్రపంచ సినిమాపై కూడా మంచి పరిజ్ఞానం ఉంది. కొన్ని సినిమాల్ని చూస్తున్నప్పుడు తెలుగులో ఇలాంటి ఎందుకు రావు అనిపించేది. ఆ సినిమాల స్ఫూర్తితో కథాంశాలపరంగా కొత్తగా ప్రయత్నించాలనే ఆలోచన పెరిగింది.

స్టార్ ఇమేజ్, మంచి నటుడనే పేరు..ఈ రెండింటిలో మీరు దేనిని ఎక్కువగా ఇష్టపడతారు?

• నేను చేసే ప్రతి పాత్రకు వందశాతం న్యాయం చేయాలని తపిస్తాను. ఏ రోజైనా సరే స్టార్ అనే పేరుకంటే పర్‌ఫార్మర్ అనే ఇమేజ్‌నే ఎక్కువగా ఇష్టపడతాను. నటుడిగా ఏదో ఒక మూసకు పరిమితం కావొద్దనే వైవిధ్యమైన కథల్ని ఎంపిక చేసుకుంటున్నాను.

తదుపరి సినిమాల గురించి?

• ప్రస్తుతం రెండుమూడు నెలలు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. ఆ తర్వాత 'ఘాజీ' దర్శకుడు సంకల్ప్‌రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నాను. రోదసికి సంబంధించిన కథ అది. శ్రీహరి కోట నేపథ్యంలో నడుస్తుంది. గ్రాఫిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.

'ఫిదా' తర్వాత కథల ఎంపికలో మీ ప్రాధామ్యాలు ఏమైనా మారాయా?

• 'ఫిదా' నటుడిగా కొత్త దృక్పథాన్ని తీసుకొచ్చింది. సంప్రదాయ సినిమాలకు భిన్నంగా నవీన పంథాలో కథాంశాల్ని ఎంచుకోవాలనే స్ఫూర్తినిచ్చింది. కథల ఎంపికలో నా ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచింది.

కెరీర్‌పరంగా అపజయాల్ని ఎలా స్వీకరిస్తారు?

• పరాజయాలు తప్పకుండా బాధిస్తాయి. అయితే వాటి గురించి ఎక్కువగా ఆలోచించను. ఒక సినిమా ఫెయిల్ అయితే ఎక్కడ తప్పు జరిగిందో వెంటనే తెలిసిపోతుంది. కంటెంట్ బాగుండి సినిమా ఆడకపోవడమనేది చాలా అరుదైన విషయం. కొన్ని సినిమాలు కొంత మంది ప్రేక్షకులకే నచ్చుతాయి. 'కంచె' వంటి సినిమాలు అందరికి నచ్చవు. కానీ ఆ సినిమా నాకు వ్యక్తిగతంగా మంచి గుర్తింపును తీసుకొచ్చింది. 'కంచె'కు కలెక్షన్స్ ఎక్కువగా వస్తే హ్యాపీగా ఫీలయ్యేవాడిని.

మీ స్వీయనిర్మాణ సంస్థ అంజనా ప్రొడక్షన్స్‌లో సినిమాలు చేసే ఆలోచన వుందా?

• తప్పకుండా చేస్తాను. నాన్నగారు కూడా ఓసారి ఈ విషయం గురించి నాతో మాట్లాడారు.' ప్రస్తుతం నీ చుట్టూ మంచి నిర్మాతలు వున్నారు. వారితో సినిమాలు పూర్తిచేయి. సరైన సమయంలో మన బ్యానర్‌లో సినిమా చేద్దాం' అని అన్నారాయన.

మీ జీవితంలో వాలెంటైన్స్ డేకు సంబంధించిన అనుభవాలు ఏమైనా వున్నాయా?

• వాలెంటైన్స్ డే రోజు మా ఫ్రెండ్స్ నలుగురితో కలిసి బయటకు వెళ్లి ప్రేమ జంటలను చూసేవాళ్లం. ఆ టైమ్‌లో అమ్మాయిలెవరూ మా గ్యాంగ్‌ను చూసేవారు కాదు (నవ్వుతూ). ఇప్పుడేమో అలాంటి రోజుల మీద ఆస్తకిపోయింది.

రామలక్ష్మి వయ్యారాలు

'రామలక్ష్మి పదహారణాల పల్లెపడుచు.ఆమె అందాన్ని గురించి చెప్పాలంటే మాటలు సరిపోవు. ఓహోహో ఏం వయ్యారాలు. ఏం వయ్యారాలు. ఏమాటకు ఆ మాటే చెప్పుకోవాలి...ఆ పిల్ల ఎదురొస్తే ఊరికే పద్దెనిమిది సంవత్సరాల వయసొచ్చినట్లుంటుంది. చిట్టిబాబు గుండెకాయను గోలేట్టించేసింది ఈ పిల్లే. రంగస్థలం ఊరికి చెందిన వారిద్దరి కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు సుకుమార్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రంగస్థలం'. రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్నారు. సమంత పాత్రకు సంబంధించిన టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో లంగావోణితో సంప్రదాయబద్ధమైన పల్లెటూరి అమ్మాయిగా సమంత కొత్త పంథాలో కనిపించి ఆకట్టుకుంటున్నది. రామలక్ష్మిగా ఆమె పాత్రను దర్శకుడు సుకుమార్ వైవిధ్యంగా తీర్చిదిద్దారు. రామ్‌చరణ్ గళంతో సమంత పాత్రను పరిచయం చేసిన తీరు, ఆమె నేపథ్యం, సైకిల్ తొక్కుకుంటూ వెళ్లే సన్నివేశాల్ని నవ్యరీతిలో ఆవిష్కరించారు. ధైర్యవంతురాలైన యువతిగా తన పాత్ర సాగుతుందని, తన కెరీర్‌లోనే గర్వపడేలా నిలిచిపోతుందని, అందరికి రామలక్ష్మి పాత్ర నచ్చుతుందనే నమ్మకముందని సమంత ట్విట్టర్ ద్వారా పేర్కొన్నది. మార్చి 30న ఈ చిత్రం విడుదలకానున్నది.


సమంత



తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ మహమ్మద్ ఖమ్రుద్దీన్ శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. ఇటీవలే మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఆయన కమిషన్ ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలను గవర్నర్‌కు తెలియజేశారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

అమరావతిలో ఏపీ రాజ్‌భవన్ నిర్మాణం

గవర్నర్‌కు తెలిపిన సీఆర్డీఏ కమిషనర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో గవర్నర్‌కు ప్రత్యేకంగా అధికార నివాసభవనం, కార్యాలయం (రాజ్‌భవన్) నిర్మించడానికి ఏర్పాట్లుచేస్తున్నది. ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) కమిషనర్ సీహెచ్ శ్రీధర్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి అమరావతిలో రాజ్‌భవన్ నిర్మాణానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజ్‌భవన్ డిజైన్లను చూపించినట్లు తెలిసింది.

నేడు సెలవు కాదు.. పనిదినమే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు శనివారం పనిచేయనున్నాయి. రెండో శనివారమైనప్పటికీ పనిదినంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జనవరి 1వ తేదీన సెలవు ఇచ్చినందున బదులుగా ఫిబ్రవరి 10వ తేదీని పనిచేయాలని గతంలో ప్రభుత్వ ప్రకటించిన విషయం తెలిసిందే. విద్యాసంస్థలు సైతం శనివారం కొనసాగనున్నాయి.



యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కృష్ణ శిలలతో ఆలయం అందంగా ముస్తాబవుతున్నది. గర్భగుడిపై శ్లాబు నిర్మాణం పూర్తయింది.

ప్రజలకు ఉపయోగపడితేనే

టెక్నాలజీకి సార్థకత

డ్రోన్ హ్యాకథాన్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్



విజేతలకు చెక్కును అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సయంట్ చైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాంకేతికరంగంలో వస్తున్న ఏ మార్పులైనా ప్రజలకు ఉపయోగపడితేనే వాటికి సార్థకత అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సామాన్యులకు ఉపయోగపడేలా సాంకేతిక ఫలాలు ఉండాలని సీఎం కేసీఆర్ పదేపదే చెప్తుంటారని గుర్తుచేశారు. ప్రఖ్యాత ఐటీ కంపెనీ సయంట్ దేశంలోనే తొలిసారిగా డీజేఐ సంస్థతో కలిసి హ్యాకడ్రోన్-2018 పేరుతో డ్రోన్ హ్యాకథాన్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గుడాలో నిర్వహించింది. విజేతలకు మంత్రి కేటీఆర్ బహుమతి ప్రదానంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేలా సాంకేతిక మార్పులు రావాలన్నారు. పురపాలక, మైనింగ్‌శాఖల్లో డ్రోన్ల వాడకాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. మహిళల రక్షణ కోసం వినూత్న ఆవిష్కరణ చేసిన మహిళల బృందానికి కేటీఆర్ బహుమతి అందించారు.ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, సయంట్ చైర్మన్ మోహన్‌రెడ్డి, మైక్రోసాఫ్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రీనాదయాల్‌యాదవ్, టీహబ్ ఉపాధ్యక్షురాలు రమాఅయ్యర్ పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్ల కొనసాగింపునకు ఓకే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కందుల కొనుగోళ్ల మద్దతు ధర పథకం (పీఎస్ఎస్) కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్రంలో 2017 వానకాలం సీజన్‌కు సంబంధించిన కందుల దిగుబడి పెరిగినందున కనీస మద్దతు ధరకు 75,300 టన్నుల వరకు కొనుగోళ్లను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందుకు అంగీకారం తెలుపుతూ కేంద్రవ్యవసాయశాఖ శుక్రవారం సమాచారం పంపింది.

టీఆర్‌బీఈఎస్ఎఫ్ అధ్యక్షుడిగా జనార్దన్‌రావు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రోడ్స్ అండ్ బిల్డింగ్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం (టీఆర్‌బీఈఎస్ఎఫ్) అధ్యక్షుడుగా ఎస్ జనార్దన్‌రావు ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఫోరం సహఅధ్యక్షుడుగా ఆర్ పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎం ప్రవీణ్‌కుమార్, ఎం రాజేశ్ కుమార్, జీ దివ్య, కార్యదర్శిగా ఎస్ వెంకటరమణ ఎన్నికయ్యారు. నూతన కమిటీని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అభినందించి, నియామకపత్రాన్ని అందజేశారు.

సింగరేణి కార్మికుల సమ్మె వాయిదా

యాజమాన్యంతో కార్మిక సంఘాల చర్చలు ఫలప్రదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిమాండ్ల సాధన కోసం ఈ నెల 14వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్‌కు కార్మిక సంఘాలు తెలియజేశాయి. యాజమాన్యంతో శుక్రవారం జరిగిన చర్చలు ఫలప్రదమైన నేపథ్యంలో సమ్మె వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు ఎస్సీఈయూ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు తెలిపారు. ఆయా సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసులపై డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో హైదరాబాద్‌లో చర్చలు జరిగాయి. డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించి కోర్టు ఉత్తర్వులపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించి చర్యలు చేపట్టనున్నట్టు యాజమాన్యం హామీ ఇచ్చిందని కార్మికనేతలు చెప్పారు.

విత్తనోత్పత్తిపై వ్యవసాయ వర్సిటీలో శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విత్తనోత్పత్తి, విత్తన నాణ్యత పరీక్షల్లో అనుసరించాల్సిన సాంకేతిక అంశాల్లో మార్చిలో అధికారులకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. విత్తనాభివృద్ధి, విత్తన నాణ్యత ధ్రువీకరణలో ఇండో జర్మన్ సహకారంపై శుక్రవారం వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథిని సచివాలయంలోని ఆయన చాంబర్‌లో జర్మన్ ప్రతినిధి ఎక్కేహర్డ్ ష్రోడర్ కలిశారు. విత్తనాభివృద్ధిలో ఒప్పందాలు, శిక్షణ అంశాలపై చర్చించారు. సమావేశంలో విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు పాల్గొన్నారు.

టీఎస్ ఐపాస్‌తో భారీగా పెట్టుబడులు

- మూడున్నర ఏండ్లలోనే అద్భుతమైన ప్రగతి
- ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ వెల్లడి



హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో ఎన్ఈఎల్ పేరిట డిజైన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

కేపీహెచ్‌బీ కాలనీ: టీఎస్ ఐపాస్ విధానంతో ఆకర్షితులవుతున్న ప్రపంచ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పరిశ్రమల రాకతో ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుతున్నాయని ఆయన చెప్పారు. అబుధాబీకి చెందిన పెట్టుబడుల దిగ్గజం సీనత్ కంపెనీ అనుబంధ సంస్థ నేషనల్ పెట్రోలియం కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్పీసీసీ) శుక్రవారం హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలోని మంజీరా కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఎన్ఈఎల్ పేరిట డిజైన్ కేంద్రం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఈటల మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల కాలంలోనే అద్భుతమైన ప్రగతిని సాధించిందని చెప్పారు. దేశంలో కొత్త పరిశ్రమల స్థాపన, అభివృద్ధిలో ఐదో స్థానం నుంచి మూడోస్థానానికి చేరుకుంటున్నదని తెలిపారు. టీఎస్ ఐపాస్ విధానంతో 15 రోజుల్లోనే పరిశ్రమల స్థాపనకు అనుమతి లభిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, డీసీపీ సాయిశేఖర్, ఎన్ఈఎల్ అనివా బోర్డు చైర్మన్ అఖిల్ మది, సీఈవో అహ్మద్ సలీం పాల్గొన్నారు.

టీమాస్‌ను ప్రారంభించిన మంత్రి ఈటల

మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ ఈ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ సిస్టమ్ (టీమాస్)ను ఆర్థికమంత్రి ప్రారంభించారు. జిల్లాల సమగ్రాభివృద్ధికి ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, ఎంసీహెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి, ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

బోర్డుల పరిధిలోకి ప్రాజెక్టులు

- దశలవారీగా నియంత్రణకు ప్లాన్
- కృష్ణా, గోదావరి బోర్డుల అధికారులతో కేంద్ర జలవనరుల కార్యదర్శి భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు తెలుగురాష్ట్రాల పరిధిలోని కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టులను ఆయా నదీ యాజమాన్య బోర్డుల పరిధిలోకి తెచ్చే విషయంలో కేంద్ర జలవనరులశాఖ తెలంగాణ ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. ప్రాజెక్టులవారీగా కేటాయింపులు జరిగిన తర్వాత ఈ అంశంపై ముందుకు పోవాలని తెలంగాణ గతంలో అనేకసార్లు అభ్యంతరం వ్యక్తంచేసినా పట్టించుకోవడం లేదు. శుక్రవారం ఢిల్లీలో కృష్ణా, గోదావరి బోర్డుల అధికారులతో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి భూపేంద్ర సింగ్ సమావేశం నిర్వహించారు. 'బోర్డుల పరిధిలోకి అన్ని ప్రాజెక్టులు' అంశంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. రెండు రాష్ట్రాలు బోర్డు ఆదేశాలను అమలు చేయడంలేదని, పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నాయనే సాకును చూపి అన్ని ప్రాజెక్టులను తమ పరిధిలోకి చేర్చాలని ఈ భేటీలో కృష్ణాబోర్డు తరపున హాజరైన అధికారులు కోరినట్లు తెలిసింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల పరిధిలో రెండు నదులపై ఉన్న ప్రాజెక్టులను దశలవారీగా బోర్డుల పరిధిలోకి తీసుకురావాలనే ప్రతిపాదనను అధికారులు కార్యదర్శి ముందు ఉంచారు. ముందుగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఆపై కొన్ని కాల్వలు, కొన్ని ప్రాజెక్టులు ఇలా క్రమంగా అన్ని ప్రాజెక్టులను ఆయా బోర్డుల చేతుల్లో ఉంచాలని సూచించారు. ఈ మేరకు కేంద్ర జలవనరులశాఖ నోటిఫికేషన్ జారీ చేయాలని కూడా అన్నట్లు తెలిసింది. తెలంగాణ అభ్యంతరాల గురించి ప్రస్తావనకు రాగా ఆ సంగతి తనకు తెలుసునని, ఈ నెల 15వ తేదీన సమావేశంలో ఆ విషయం చర్చిద్దామని మంత్రిత్వశాఖ కార్యదర్శి వ్యాఖ్యానించినట్లు సమాచారం. దీనిని బట్టి 15వ తేదీ సమావేశంలో ఈ అంశంలో ఇదే అంశం ప్రధాన అజెండాగా ఉంటుందని స్పష్టమవుతున్నది.

తలాఖ్ చట్టాన్ని ఒప్పుకోం

ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యవర్గం తీర్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుతం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ట్రిపుల్ తలాఖ్‌ను యథాతథంగా అమలుచేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యవర్గం తీర్మానించింది. ట్రిపుల్ తలాఖ్ ముసుగులో మొత్తం తలాఖ్ విధానాన్నే నిషేధించే కుట్రలు జరుగుతున్నాయని కార్యవర్గం మండిపడింది. బోర్డు అధ్యక్షుడు మౌలానా రాబేహుస్సేన్ నద్వీ అధ్యక్షతన కోర్‌కమిటీ 26వ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం నగరంలోని ఒవైసీ దవాఖాన ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. బోర్డు కార్యవర్గ సభ్యుడైన మౌలానా సల్మాన్‌హుస్సేన్ నద్వీ గురువారం రోజున అయోధ్య స్థలవివాదానికి సంబంధించి పండిట్ రవిశంకర్‌తో భేటీ కావడంపై కోర్ కమిటీలోని మెజారిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బాబ్రీ మసీద్ టైటిల్‌కు సంబంధించి లక్నోబెంచ్ ముందున్న కేసుపై కూడా చర్చ జరిగింది.



హైదరాబాద్‌లో సమావేశమైన ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యవర్గం

సుప్రీంకోర్టు తీర్పే శిరోధార్యం

సమావేశం అనంతరం మజ్లిస్ అధినేత, బోర్డు సభ్యుడైన అసదుద్దీన్ ఒవైసీతో కలిసి బోర్డు కార్యదర్శి ఉమ్రాన్ మహఫూజ్ రహ్మానీ మీడియాతో మాట్లడుతూ.. బాబ్రీమసీదు స్థలం విషయంలో ముస్లిం పర్సనల్ లా బోర్డు వైఖరిలో ఎలాంటి మార్పులేదని తెలిపారు. స్థలవివాదంపై సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

కువైట్ బాధితులకు

సర్కార్ సాయం

రవాణా చార్జీలు చెల్లించి రప్పించే ప్రయత్నాలు ముమ్మరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించిన నేపథ్యంలో వీసాలు లేకుండా అక్కడున్న తెలంగాణవారి నందరినీ సొంత రాష్ట్రానికి తరలించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర జీఏడీ ముఖ్య కార్యదర్శి కువైట్ క్షమాభిక్ష పొందినవారి వివరాలను కేంద్ర విదేశీవ్యవహారాలశాఖ కార్యదర్శికి పంపించారు. కువైట్‌లో భారతదేశానికి చెందిన తొమ్మిది వేలమంది చిక్కుకోగా, తెలంగాణకు చెందినవారు 1,200 మంది వరకు ఉన్నారు. వీరంతా నిరుపేదలు. విమానటికెట్లు కొనుక్కోలేని స్థితిలో ఉన్నారు. దీంతో ప్రభుత్వమే రవాణాచార్జీలు చెల్లించి, స్వరాష్ట్రానికి తరలిస్తున్నది.



కేంద్రమంత్రి జేపీ నడ్డాకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్రమంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో వేణుగోపాలచారి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, సీతారాంనాయక్, నగేష్

ఎయిమ్స్‌కు నిధులు కేటాయించండి

కేంద్రానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎయిమ్స్ ప్రకటించిన నేపథ్యంలో దీని నిర్మాణానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి కేంద్రమంత్రులను కోరారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్‌భవన్‌లో కేంద్ర ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీ, కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ హెల్త్‌హబ్‌గా మారిన నేపథ్యంలో ఎయిమ్స్ అవసరాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సీఎం ఆదేశాలమేరకు కేంద్ర మంత్రులను కలిసి ఎయిమ్స్ నిధులపై చర్చించినట్టు మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు.అనంతరం కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతీ సూడాన్‌తో సమావేశమయ్యారు. లక్ష్మారెడ్డివెంట ఎంపీలు ఏపీ జితేందర్‌రెడ్డి, నగేశ్, సీతారాంనాయక్, కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, మంత్రి ఓఎస్డీ తాడూరి గంగాధర్ తదితరులున్నారు.

సిరిసిల్ల సెస్ అభివృద్ధికి తోడ్పాటందించండి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ వినోద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిరిసిల్ల సెస్ (కో ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీ) అభివృద్ధికి సహకరించాలని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్కేసింగ్‌ను ఎంపీ బీ వినోద్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ఆర్కేసింగ్‌ను ఎంపీ వినోద్ కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయదారులకు ఉచితవిద్యుత్‌ను అందిస్తున్నట్టు వివరించారు. పాత లైన్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. కొత్త లైన్ల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సిరిసిల్ల సెస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు ఉన్నారు.

యూకే గేమింగ్ సంస్థలతో ఎంవోయూ

ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యూకేకు చెందిన దాదాపు పదిహేను సంస్థలు తెలంగాణలోని గేమింగ్ సంస్థలతో ఉమ్మడి ఒప్పందాలను కుదుర్చుకోవడానికి ముందుకొచ్చాయని ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో బ్రిటిష్ హైకమిషన్‌తో కలిసి గేమింగ్, టెక్ సమ్మిట్‌ను నిర్వహించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు యానియేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ పరిశ్రమ రానున్న రోజుల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నదని జయేశ్ రంజన్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతం కావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడిందని తెలిపారు.

అడవుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎండకాలంలో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని అధికారులను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం అటవీశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో రక్షిత అటవీ ప్రాంతానికి 24వేల కిలోమీటర్ల సరిహద్దు ఉన్నదని చెప్పారు. సాధ్యమైనంత మేర కందకాలు తవ్వి అగ్నిప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేటినుంచి వే బిల్లులు తప్పనిసరి

హైదరాబాద్, సమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సరుకుల రవాణాకు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వే-బిల్లు ఉండాలని వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ వీ అనిల్‌కుమార్ స్పష్టంచేశారు. రూ.50 వేలకు పైబడి విలువ కలిగిన సరుకులకు వే-బిల్లు లేకపోతే స్టేట్ జీఎస్టీ యాక్ట్-2017 ప్రకారం శనివారం నుంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు, వ్యాపారులు తమ పోర్టల్‌లో www.tgct.gov.in లాగిన్ అయి ఈ-వే బిల్లులను తీసుకోవాలని సూచించారు.

మధ్యవర్తిత్వంపై 18న జాతీయసదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశం-ఇన్‌స్టిట్యూషనల్ ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం) హబ్‌పై ఈ నెల 18న హైదరాబాద్‌లో జాతీయసదస్సును నిర్వహించనున్నారు. గగన్ విహార్ ఐసీఏడీఆర్ ప్రాంతీయ కార్యాలయంలో ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ (ఐసీఏడీఆర్), సెంటర్ ఫర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో అంతర్జాతీయంగా పేరుగడించిన మధ్యవర్తులు పాల్గొననున్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై నిఘా

- మూడేండ్లలో 12వేల లైసెన్స్‌లు సస్పెన్షన్
- నిబంధనలు పాటించనివారిపై చర్యలు
- మూడు లేదా ఆరు నెలలపాటు లైసెన్స్ రద్దు
- పోలీస్, రవాణాశాఖల సంయుక్తదాడులు



వివిధ కేసుల్లో డ్రైవింగ్ లైసెన్స్‌ల సస్పెన్షన్ వివరాలు ఇలా..

డ్రంకన్ డ్రైవ్	1,601
సెల్‌ఫోన్ డ్రైవింగ్	662
ఓవర్‌లోడ్ వాహనాలు	2,618
గూడ్స్ వాహనాల్లో ప్రయాణికుల తరలింపు	739
అతివేగం	61
సిగ్నల్ జంపింగ్	173
వాహన ప్రమాదాలు	1,381
నిర్లక్ష్యపు డ్రైవింగ్	4784
మొత్తం	12,019

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నవారిపై, నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడుపుతున్నవారిపై రవాణాశాఖ కఠినచర్యలు తీసుకుంటున్నది. వాహనదారులకు జరిమానాలు విధించడంతోపాటు, వారి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ చేస్తున్నది. 2015 నుంచి 2018 జనవరి నెలాఖరు వరకు మూండేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా 12,019 డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దుచేసింది. మూడునెలలు, ఆరునెలలు రెండు క్యాటగిరీలుగా విభజించి సస్పెన్షన్‌ను అమలుచేస్తున్నారు. ఒకసారి సస్పెన్షన్‌కు గురైన లైసెన్స్‌దారుడు నిర్దేశితకాలంలో రాష్ట్రంలో మరెక్కడా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోకుండా రవాణాశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీస్, రవాణాశాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నాయి. అయితే డ్రైవింగ్ లైసెన్స్‌ల సస్పెన్షన్‌పై పోలీస్‌శాఖ సిఫారసు చేసిన కేసులే అధికంగా ఉన్నాయి. డ్రంకన్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, తదితర నిర్లక్ష్యపు డ్రైవింగ్ కేసుల్లో పోలీస్‌శాఖ 8,672 మంది లైసెన్స్‌ల సస్పెన్షన్ చేయాలని రవాణాశాఖకు సిఫారసు చేసింది. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికుల తరలింపు, ఓవర్‌లోడ్ వాహనాలకు సంబంధించి రవాణాశాఖ 3,347మంది లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది. పోలీస్‌శాఖ చేసిన సిఫారసుల్లో డ్రంకన్‌డ్రైవ్‌లో 1,601, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లో 662, వివిధ రకాల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కింద 4,784 మంది లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది.

వివిధ కారణాలతో కేసులు నమోదైన వ్యక్తిని కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు తీర్పును అనుసరించి అతడి లైసెన్స్‌ను పూర్తిగా రద్దుచేస్తామని రవాణాశాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జేటీసీ రమేశ్ తెలిపారు. పోలీస్, రవాణాశాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా దాడులు ఉధృతం చేస్తున్నామని చెప్పారు. దీంతో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయని అన్నారు.

రామప్పలో 'శివరాత్రి' సాంస్కృతిక కార్యక్రమాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూపాలపల్లి జిల్లాలోని రామప్ప ఆలయంలో శివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పర్యాటక, గిరిజన సంక్షేమశాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. ఆలయానికి ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపును తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా సాంస్కృతిక కదంబాన్ని ఏర్పాటుచేసినట్టు శుక్రవారం సచివాలయంలో మీడియాకు తెలిపారు. హరికథలు, నాట్య ప్రదర్శనలు, శివపార్వతీ కల్యాణాలకు సంబంధించిన నృత్య కళారూపాలను కళాకారులు ప్రదర్శిస్తారని వివరించారు. శివరాత్రి కార్యక్రమాలను వీక్షించేందుకు వచ్చే వారి కోసం ఏర్పాట్లు చేస్తున్నామని పర్యాటక కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.

యువజన శాఖ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర యువజన సర్వీసులశాఖ మైదానంలో శుక్రవారం కూచిపూడి, భరతనాట్యం, కథక్, మణిపురి, వీణ, సితార్, తబలా, మృదంగం, గిటార్, హార్మోనియం, మురళి తదితర విభాగాల్లో రాష్ట్ర యువజన సర్వీసులశాఖ పోటీలను నిర్వహించింది. శనివారం కూడా పోటీలను నిర్వహిస్తామని ఆ శాఖ సంచాలకుడు మహమ్మద్ అబ్దుల్ అజీమ్ తెలిపారు.



ఎఫ్‌డీసీ కార్యాలయంలో మాట్లాడుతున్న పీ రామ్మోహన్‌రావు, ఎం రాజేంద్రన్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

తెలంగాణలో యుద్ధకళ 'సిలంబం'

- స్వీయ రక్షణకు ఉపకరించే యుద్ధక్రీడ
- శారీరక ఆరోగ్యానికి ఉపయుక్తం
- 'సిలంబం' అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పీ రామ్మోహన్‌రావు

సినిమాడెస్క్: 'తమిళనాడులో అత్యంత ప్రాచుర్యం పొందిన యుద్ధకళ 'సిలంబం'ను తెలంగాణలో ప్రవేశపెట్టబోతున్నాం. విద్యార్థుల శారీరక, మనోశక్తుల వృద్ధికి ఈ మార్షల్ ఆర్ట్ ఎంతగానో ఉపకరిస్తుంది' అన్నారు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీ రామ్మోహన్‌రావు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సిలంబం' కర్రసాము తరహాలో సాగే మార్షల్ ఆర్ట్. వేల సంవత్సరాల క్రితమే తమిళనాడులో ఉద్భవించింది. తెలంగాణలో శాతవాహనులు, కాకతీయ రాజవంశాలు స్వీయరక్షణ కోసం ఈ యుద్ధకళలో ప్రావీణ్యం సంపాదించారు. అనంతర కాలంలో బ్రిటీష్‌వారు ఈ క్రీడను నిషేధించారు. ప్రస్తుతం దేశంలోని 22 రాష్ట్రాల్లో ఈ క్రీడ అమలులో ఉంది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వారితో చర్చించి మన రాష్ట్రంలో ఈ క్రీడను ప్రవేశపెట్టాలనే ఆలోచనతో ఉన్నాం. త్వరలో రెండు రోజుల పాటు ఎంపిక చేసిన కేంద్రాల్లో 'సిలంబం' గురించి విద్యార్థులకు వర్క్‌షాప్‌ను నిర్వహించబోతున్నాం. ప్రతి జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులకు ఎంపిక చేస్తాం' అన్నారు. కార్యక్రమంలో 'సిలంబం' తమిళనాడు అధ్యక్షుడు, ఐఏఎస్ అధికారి ఎమ్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు రాష్ట్రంలోని ఎంపిక చేసిన రెండు ప్రాంతాల్లో 'సిలంబం' క్రీడలో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. సాట్స్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'వేల ఏండ్ల నుంచి ప్రాచుర్యం పొందిన క్రీడను తెలంగాణలో పరిచయం చేయబోతున్నామన్నారు.

జనవరినాటికి గజ్వేల్‌కు రైలు నడిపించండి



శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌తో సమావేశమైన నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్ ఉన్నారు.

- మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్‌ను త్వరగా పూర్తిచేయండి
- దక్షిణమధ్య రైల్వే జీఎంతో సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే ఏడాది జనవరి నాటికి గజ్వేల్‌కు రైలు నడిపించాలని, అందుకోసం మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో తన నివాసంలో దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌తో సమావేశం అయ్యారు. రైల్వే ప్రాజెక్టు తీరుతెన్నులపై చర్చించారు. రైల్వే పనులు సీఎం కేసీఆర్ అంచనాల కన్నా నెమ్మదిగా సాగుతున్నాయని, పనుల్లో వేగం పెరుగాలని హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట, గజ్వేల్ రైల్వే స్టేషన్లను ఆధునికంగా నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మనోహరాబాద్- కొత్తపల్లి మార్గంలో కుకునూర్‌పల్లి, దుద్దెడ ప్రాంతాల్లో మినహా మిగతాచోట్ల భూసేకరణ పూర్తి కావొచ్చిందని తెలిపారు. తూప్రాన్ మండలం పరికిబండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూమి సేకరణకు అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. రామాయంపల్లి దగ్గర ఆర్వోబీ, గజ్వేల్ సమీపంలో మరో ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మిస్తున్నట్టు మంత్రికి వివరించారు. మనోహరాబాద్- గజ్వేల్ మధ్య రైల్వే పనులు వేగం పుంజుకున్నాయని, ఫేజ్-2 కింద గజ్వేల్ -సిద్దిపేట పనులు చేపడుతున్నామని తెలియజేశారు. సమీక్ష సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ వెంకటరామిరెడ్డి, రైల్వే సీఈ పాల్గొన్నారు.



సచివాలయంలో ఫ్రెంచ్ ఏరియల్ షో బ్రోచర్‌ను విడుదలచేస్తున్న మంత్రి చందూలాల్, పర్యాటకశాఖ కార్యదర్శి బీ వెంకటేశం, ఫ్రెంచ్ డైరెక్టర్ ఎమిలిన్

13న పీపుల్స్ ప్లాజాలో ఫ్రెంచ్ ఏరియల్ షో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 13న ఫ్రెంచ్ ఏరియల్ షో నిర్వహించనున్నారు. ఇండో-ఫ్రెంచ్ ఒప్పందంలో భాగంగా దేశంలోని 33 నగరాల్లో ఈ షోలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయని, తొలిసారి హైదరాబాద్‌లో ఉత్సవాలు జరుగుతున్నాయని మంత్రి చందూలాల్ పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో భారీస్థాయి సాంస్కృతిక ప్రదర్శనలు, గాలిలో విన్యాసాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రభుత్వ సలహాదారు పాపారావు, ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రాన్సిస్ డైరెక్టర్ ఎమిలిన్ పాల్గొన్నారు.

ఏపీ హైకోర్టు కోసం భవనాల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేయడానికి ఏపీ సర్కార్ ఎంపికచేసిన తాత్కాలిక భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తుల కమిటీ విజయవాడకు వెళ్లింది. జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ టీ సునీల్‌చౌదరి, జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తిలతో కూడిన భవనాల పరిశీలన కమిటీ శని, ఆదివారాల్లో భవనాలను పరిశీలించనున్నది.

పీఏసీ, పీయూసీ కమిటీల సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీఏసీ కమిటీ శుక్రవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో సమావేశమై విద్యుత్, సింగరేణి అంశాలపై చర్చించింది. కమిటీ చైర్మన్ గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా సింగరేణికి సంబంధించిన అంశాలపై పవర్ పాయింట్ ద్వారా సభ్యులకు వివరించారు. సమావేశంలో సభ్యులు టీ జీవన్‌రెడ్డి, రాములునాయక్, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ స్నేహలత, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. పీయూసీ కమిటీ లెదర్ పరిశ్రమకు సంబంధించిన అంశాలపై చర్చించింది. ఈ సమావేశంలో చైర్మన్ దివాకరరావు, సభ్యులు కర్నె ప్రభాకర్, చింత ప్రభాకర్, బిగాల గణేశ్, సంపత్‌కుమార్, సంజీవరావు పాల్గొన్నారు.

టీఆర్టీ అభ్యర్థుల కోసం మొబైల్ యాప్

బషీర్‌బాగ్: టీఆర్టీకి సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ-ఎగ్జామ్స్/ఈ-ఎగ్జామ్స్ మొబైల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని యాప్ వ్యవస్థాపకులు వంగల కుమార్, కత్తి గోపాలకృష్ణ తెలిపారు. యాప్‌లో టీఆర్టీ నూతన సిలబస్ 3200 నమూనా ప్రశ్నలు ఉన్నట్టు చెప్పారు. ఈ-ఎగ్జామ్స్/ఈ-ఎగ్జామ్స్ అని ప్లేస్టోర్‌లో టైప్‌చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పురుషోత్తంరెడ్డి బినామీలు అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పరారీలో ఉన్న హెచ్ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం ఏసీబీ అధికారుల ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఓ వైపు నిందితుడి ఆచూకీ కోసం ఆరాతీస్తూనే మరోవైపు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం పురుషోత్తంరెడ్డి బినామీలుగా భావిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసినట్టు ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు తెలిపారు. పురుషోత్తంరెడ్డి అక్రమ సంపాదనను రియల్‌ఎస్టేట్, భవన నిర్మాణ వ్యాపారంలో పెట్టుబడులుగా పెట్టి, వాటికి బినామీలుగా ఉన్న ఏ యాదవరెడ్డి, జీ నిశాంత్‌రెడ్డిను అరెస్టుచేశారు. వీరిద్దరినీ ఏసీబీ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపర్చారు. వీరు పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాసరెడ్డి ద్వారా ఆయన అక్రమ సంపాదనకు బినామీలుగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. యాదవరెడ్డి శ్రీసాయిహరిహర ఎస్టేట్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు ఎండీగా వ్యవహరిస్తుండగా, నిశాంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామపరిధిలో విల్లాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఏసీబీ పోలీసులు అదుపులోకి తీసుకున్న రాధాచరణ్‌రెడ్డికి సంబంధించిన సోమాజిగూడలోని జమ్రుద్‌రెసిడెన్సీ, ఫస్ట్‌ఫ్లోర్‌లోని చరన్స్ లైఫ్ డివైజెస్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో సోదాలు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ తెలిపారు.

కేవీ రమణాచారి ప్రత్యేక సంచికగా 'వికలాంగుల పిలుపు'

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి పుట్టినరోజు సందర్భంగా 'వికలాంగుల పిలుపు' మాసపత్రిక ప్రత్యేక సంచిక తీసుకొచ్చారు. శుక్రవారం సచివాలయంలో కేవీ రమణాచారి సంచికను ఆవిష్కరించారు. నాలుగు దశాబ్దాలపాటు ప్రభుత్వ అధికారిగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హోదాలో వికలాంగులకు రమణాచారి సేవలందిస్తున్నారని ప్రత్యేక సంచిక ఎడిటర్ కొల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్స్ అధికారాలను కొనసాగించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సెలవులు, ఇంక్రిమెంట్లు మంజూరు చేసే అధికారాన్ని జిల్లా విద్యాధికారులకు ఇవ్వడం సమంజసం కాదని తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం ఈ నెల మూడున ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీ రాములు కోరారు.

పీడీపీఈటీ వెరిఫికేషన్‌కు నేటివరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఫర్ ఎలిమెంటరి టీచర్ (పీడీపీఈటీ) ఆరునెలల కోర్సు దరఖాస్తుల పరిశీలనకు ఈ నెల 10 శనివారం వరకు గడువు విధించారు. శుక్రవారం ఎన్ఐవోఎస్ ప్రాంతీయ డైరెక్టర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకులను గుర్తుచేసుకొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ సరోత్తంరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణ విమోచన కమిషన్ ఏమైంది?

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేయకపోవడంపై ఉమ్మడి హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మూడునెలల్లో కమిషన్‌ను ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీ గడువు గత ఏడాది నవంబర్ 21తో ముగిసిందనే విషయాన్ని విస్మరించరాదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఉద్దేశించి న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోర్టుకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించరాదో తెలియజేయాలని సీఎస్‌కు నోటీసులు జారీచేసింది.

ఆ భూములపై లోతైన విచారణ : హైదరాబాద్ గడ్డిఅన్నారం పరిధిలోని అస్మాన్‌ఘడ్ (ఫెర్న్ హిల్స్)లో పురావస్తుశాఖ తమదిగా పేర్కొంటున్న వివాదాస్పద స్థలంపై లోతైన విచారణ చేపడుతామని హైకోర్టు స్పష్టంచేసింది. ప్రైవేట్ వ్యక్తుల భూమిలో పురావస్తుశాఖ బలవంతంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని, రూ. 20 వేల జరిమానా చెల్లించాలంటూ గత ఏడాది సింగిల్ జడ్జి న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలను నాలుగువారాలపాటు నిలిపివేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలి

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: విభజన హామీలను అమలు చేయాలని అమరావతిలో ఏపీ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్రం తీరును నిరసిస్తూ భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా నిరసన ర్యాలీ నిర్వహించారు. హామీలు నెరవేర్చకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ చెప్పారు.

కేంద్రంపై ఒత్తిడి పెంచండి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి నిధులను రాబట్టాలని ఏపీ ఎంపీలకు శుక్రవారం ఉదయం టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. హామీలపై కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకు ఆందోళన చేయాలని, కేంద్రమంత్రులను ఎక్కడ దొరికితే అక్కడ నిలదీయాలని వారికి ఉద్బోధించారు. దీంతో కేంద్రమంత్రి సుజనాచౌదరి మరోసారి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభ లాబీల్లో వాగ్వాదానికి దిగారు.



హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో సమావేశంలో మాట్లాడుతున్న 15వ ఆర్థికసంఘం కార్యదర్శి అరవింద్ మెహతా, సీఎస్ ఎస్కే జోషి తదితరులు.



15వ ఆర్థిక సంఘం ప్రతినిధులతో సమావేశమైన ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్

అన్ని రాష్ట్రాలను ఒకేలా చూడొద్దు

- తెలంగాణను ప్రత్యేకంగా ప్రోత్సహించాలి
- పదిహేనో ఆర్థికసంఘానికి మంత్రి ఈటల వినతి.. రాష్ట్ర పరిస్థితుల అధ్యయనానికి వచ్చిన అధికారులు
- నేడు కాళేశ్వరం సందర్శన

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను బట్టి ప్రాధాన్యక్రమంలో వాటికి నిధులను కేటాయించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ 15వ ఆర్థికసంఘం అధికారులను కోరారు. అన్ని రాష్ట్రాలను ఒకే దృష్టికోణంలో చూడటం తగదని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఒక్కోరాష్ట్రానికి ఒక్కోరకమైన ప్రాధాన్యాలు, విధానాలు ఉంటాయని తెలిపారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలను ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆర్థికసంఘం అధికారులకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో మంత్రి ఈటల మధ్యాహ్నం విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో కొద్దిసేపు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ఇస్తున్న ప్రాధాన్యాల గురించి వివరించారు. ఎన్కేసింగ్ చైర్మన్‌గా కేంద్రప్రభుత్వం నియమించిన 15వ ఆర్థికసంఘం తను చేయాల్సిన సిఫారసుల కోసం రాష్ట్రాల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై అధ్యయనం ప్రారంభించింది. ఇందులోభాగంగా పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రతినిధుల బృందాన్ని హైదరాబాద్‌కు పంపించింది. ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి అరవింద్ మెహతా, జాయింట్ సెక్రటరీ భాటియా, ఇతర అధికారులు సందీప్, నితీశ్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్ర ఆర్థికవిధానాలు, బడ్జెట్, ఆర్థిక క్రమశిక్షణ, నగదు నిల్వలు, సామాజిక పరిస్థితులను తెలుసుకుంటున్నది. ఆర్థికసంఘం 30 అక్టోబర్ 2019 నాటికి తన తుదినివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఆర్థికసంఘం అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికసలహాదారు జీఆర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి శివశంకర్, అదనపు కార్యదర్శి రామ్మోహన్, డిప్యూటీ కార్యదర్శి సాయిప్రసాద్ తదితరులు సమావేశమయ్యారు.

నేడు కాళేశ్వరానికి ఆర్థికసంఘం బృందం

పదిహేనో ఆర్థికసంఘం అధికారుల బృందం శనివారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నది. ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం సాయం అందించాలని తెలంగాణ కోరుతున్నది. ఈ క్రమంలో అరవింద్‌మెహతా బృందం కాళేశ్వరం సందర్శించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

పంటలకు అనుగుణంగా పరిశ్రమలు

- నియోజకవర్గాలవారీగా ప్రాసెసింగ్ ఇండస్ట్రీలు
- అగ్రిటెక్‌సౌత్ సదస్సులో మంత్రి పోచారం



రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియం మైదానంలో ఏర్పాటుచేసిన అగ్రిటెక్ సౌత్ -2018 ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్, నమస్తే తెలంగాణ: ఏ ప్రాంతంలో అత్యధిక పంటలు పండుతాయో.. ఆయా పంటలకు అనుగుణంగా ప్రాసెసింగ్ ఇండస్ట్రీని నియోజకవర్గాలవారీగా నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రైతులు పంటపెట్టుబడి కోసం బ్యాంకు చుట్టూ, షావుకార్ల వద్దకు వెళ్లకుండా సొంత పెట్టుబడులు పెట్టుకొనేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అగ్రిటెక్ సౌత్ 2018 ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ వచ్చే బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేందుకు సుముఖత వ్యక్తంచేశారని తెలిపారు. సీఐఐ సదరన్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు, సీఐఐ నేషనల్ కమిటీ వాటర్ చైర్మన్ అండ్ ఎండీ రామేశ్ డాట్ల మాట్లాడారు. అనంతరం ఆడిటోరియం సమీపంలో క్రీడా మైదానంలో యంత్ర పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను పోచారం ప్రారంభించారు. సదస్సులో టీఆర్ కేశవ్, సమీర్‌గోయల్, సంజయ్‌సింగ్, అనిల్‌కుమార్ ఏపూరి, రైతులు పాల్గొన్నారు.



ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర గ్రంథాలయాల సమాఖ్య క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు


గ్రంథాలయాలకు పూర్వవైభవం

- గ్రంథాలయ ఉద్యోగుల మహాసభలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్
- సంస్థ ఉద్యోగులకు జీవో 010 ద్వారా వేతనాలు అందేలా కృషి: హోంమంత్రి నాయిని

తెలుగు యూనివర్సిటీ: గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర గ్రంథాలయాల సమాఖ్య ఆధ్వర్యంలో పబ్లిక్‌గార్డెన్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఉద్యోగుల నాలుగో రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిగౌడ్.. సమాఖ్య రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రంథాలయాల ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా 010 పద్దుకింద వేతనాలు అందేలా ప్రయత్నం చేస్తామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. ఆర్థికశాఖ అధికారులతో చర్చించి 1వ తేదీనే వేతనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్ పేర్కొన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి, విజ్ఞానాన్ని సముపార్జించిన ఉద్యమనేత కే చంద్రశేఖర్‌రావు.. సీఎం అయ్యారని సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని టీఎన్జీవోస్ గ్రంథాలయాల సమాఖ్య కేంద్ర సంఘం అధ్యక్షుడు కే దేవేందర్, కార్యదర్శి శాగంటి అయోధ్య కోరారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కే రవీందర్‌రెడ్డి, కోశాధికారి రేచల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్, వివిధ జిల్లాల గ్రంథాలయాల చైర్మన్లు కే ప్రసన్న రామ్మూర్తి, డాక్టర్ అమరేందర్ గౌడ్, కే భద్రాద్రి, కే పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

త్వరలో సౌరవిద్యుత్, ఈ-వెహికిల్ పాలసీలు!

- నేషనల్ పవర్ సమ్మిట్‌లో విద్యుత్‌శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌మిశ్రా వెల్లడి
- బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్, స్వీడన్ ఎంబసీ కౌన్సెలర్ హాజరు



శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో జరిగిన నేషనల్ పవర్ సమ్మిట్‌లో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విభిన్నమైన, వినూత్నమైన పారిశ్రామికపాలసీతో దూసుకుపోతున్న తెలంగాణ త్వరలో నూతన సౌరవిద్యుత్, ఈ-వెహికిల్ పాలసీలను ప్రకటించనున్నదని విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా తెలిపారు. ఈ పాలసీలు సిద్ధం కాగానే పరిశ్రమలు, సంస్థలు, వ్యక్తులనుంచి అభిప్రాయాలను సేకరిస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో నేషనల్ పవర్ సమ్మిట్ ఒకరోజు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ విద్యుత్ శాఖ, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరులశాఖ, ఎలెట్స్ టెక్నోమీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లు సంయుక్తంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన అజయ్‌మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ త్వరలోనే థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో 10 వేల మెగావాట్లకు చేరుకుంటుందన్నారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ను అందిస్తున్నతీరును ట్రాన్స్‌కో జేఎం డీ శ్రీనివాసరావు వివరించారు. భారీ, మధ్యతరహా సామర్థ్యం ఉన్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల (సౌర, వాయు, చిన్నపాటి జల విద్యుత్)పై సమ్మిట్‌లో చర్చించారు. సమ్మిట్‌కు బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ అండ్రూ ఫ్లెమింగ్, స్వీడన్ రాయబార కార్యాలయంలోని వాణిజ్య వ్యవహారాల విభాగం కౌన్సెలర్ జోస కర్రె, తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ వీసీ, ఎండీ ఏ సుధాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, 10 రాష్ట్రాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని సంస్థలకు ఎక్స్‌లెన్స్, లీడర్‌షిప్ అవార్డులను అందజేశారు.

మార్చి 31లోగా రిటర్నులు

- లేదంటే చట్టపరమైన చర్యలు, శిక్షలు తథ్యం
- పెద్ద నోట్ల రద్దు అనంతరం భారీ డిపాజిట్లు చేసిన వారికి ఐటీ విభాగం హెచ్చరిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పెద్ద నోట్ల రద్దు అనంతరం బ్యాంకుల్లో భారీగా నగదు డిపాజిట్లు చేసిన వ్యక్తులు, సంస్థలు మార్చి 31వ తేదీలోగా తమ రిటర్నులు దాఖలు చేయాలని ఆదాయం పన్ను (ఐటీ) విభాగం స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వును పాటించని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి శిక్షించడం జరుగుతుందని హెచ్చరించింది. అర్హత పొందిన ట్రస్టులు, రాజకీయ పార్టీలు, సంఘాలు కూడా వచ్చే నెల 31వ తేదీలోగా ఆదాయం పన్ను రిటర్నులు దాఖలు చేసి మచ్చ లేకుండా బయటపడాలని సూచించింది. ఈ మేరకు ఐటీ విభాగం ప్రముఖ దినపత్రికల్లో బహిరంగ ప్రకటనలు జారీ చేసింది. 2016-17, 2017-18 మదింపు సంవత్సరాలకు సంబంధించి ఆలస్యమైన లేదా సవరించిన ఆదాయం పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు ఇదే చివరి సూచన అని ఆ ప్రకటనలో పేర్కొన్నది. ఈ కేటగిరీల్లోని పన్ను చెల్లింపుదారులకు ఇంకా చాలా సమయం ఉన్నదని, కనుక వారంతా గడువు తేదీకి ముందే రిటర్నులు దాఖలు చేసి చివరి నిమిషంలో రద్దీ లేకుండా చూసుకోవాలని ఐటీ విభాగం సూచించింది.



హైదరాబాద్‌లో శుక్రవారం సరికొత్త మారుతి స్విఫ్ట్ కారును ఆవిష్కరిస్తున్న ఐపీఎస్ అధికారి అకున్ సభర్వాల్, వరుణ్ మోటార్స్ ఈడీ ఆర్‌సీ రాజు

మార్కెట్లు మళ్లీ ఢమాల్

సెన్సెక్స్ 407, నిఫ్టీ 122 పాయింట్లు పతనం

ఐదు రోజుల్లో 1,067 పాయింట్లు మటాష్

ముంబై, ఫిబ్రవరి 9: అగ్రరాజ్యం అమెరికా దెబ్బకు ప్రపంచ మార్కెట్లు గజగజలాడుతున్నాయి. ద్రవ్యోల్బణం భారీగా పెరిగిన నేపథ్యంలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వు త్వరలో వడ్డీరేట్లను పెంచబోతున్నదనే భయాందోళనలతో అంతర్జాతీయ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఇదే క్రమంలో దేశీయ సూచీలు ఒక శాతానికి పైగా పడిపోయాయి. ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్నుతో డీలాపడిన సూచీలకు అమెరికా మార్కెట్లు గట్టి షాక్ ఇస్తున్నాయి. ప్రారంభంలోనే 500 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 407.40 పాయింట్లు లేదా 1.18 శాతం పడిపోయి 34,005.76 వద్దకు జారుకున్నది. జనవరి 4 తర్వాత సూచీలకు ఇదే కనిష్ఠ స్థాయి ముగింపు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 10,500 దిగువకు జారుకున్నది. నిన్నటి ముగింపుతో పోలిస్తే 121.90 పాయింట్లు (1.15 శాతం) తగ్గి 10,454.95 వద్ద స్థిరపడింది. మొత్తం మీద ఈ వారంలో సెన్సెక్స్ 1,066.99 పాయింట్లు (3.02 శాతం), నిఫ్టీ 305.65 పాయింట్లు (2.84 శాతం) జారుకున్నాయి. గతేడాది ఆగస్టు తర్వాత ఒక వారంలో ఇంతటి స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. సార్వత్రిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు సూచీలు 5.7 శాతం మేర పతనం చెందాయి. ద్రవ్యోల్బణం దెబ్బకు డౌజోన్స్ వెయ్యి పాయింట్లకు పైగా పడిపోగా, అంతర్జాతీయ దేశాల ఆర్థిక పరిస్థితులు ఆందోళన కరంగా ఉండటం మదుపరులలో సెంటిమెంట్ నీరుగార్చినదని బీఎన్‌పీ పరిబాస్ ఫండ్ సీనియర్ మేనేజర్ కార్థిక్రాజ్ లక్ష్మణ్ తెలిపారు. యూఎస్ వడ్డీరేట్లను పెంచనున్నందన్న అంచనాలతో దేశీయంగా వడ్డీరేట్లకు సంబంధించిన రంగాల్లో అమ్మకాలు పోటెత్తాయి. బీఎస్‌ఈ బ్యాంకెక్స్ సూచీ 1.76 శాతం వరకు పతనమైంది. యెస్ బ్యాంక్ బ్యాంక్ అత్యధికంగా 2.84 శాతం కోల్పోగా, ఐసీఐసీఐ బ్యాంక్ 2.33 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 2.13 శాతం, ఇన్ఫోసిస్ 2.01 శాతం పతనమయ్యాయి. యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, కొటక్ బ్యాంక్, విప్రో, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఎల్ అండ్ టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హీరో మోటోకార్ప్‌లు ఒక శాతంకు పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. వీటితోపాటు మారుతి, ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీలు నష్టపోయాయి. కానీ టాటా స్టీల్ 1.83 శాతం లాభపడటం విశేషం. డాక్టర్ రెడ్డీస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, కోల్ ఇండియాలు లాభపడ్డాయి.



18% లాభపడ్డ ఫోర్టిస్ హెల్త్‌కేర్

స్టాక్ మార్కెట్లు భారీగా పతనం చెందినప్పటికీ ఫోర్టిస్ హెల్త్‌కేర్ లాభాల్లో ముగియడం విశేషం. టీపీజీకి చెందిన మణిపాల్ హాస్పిటల్‌ను విలీనం చేసుకుంటున్నట్లు వార్తలు గుప్పుమనడంతో కంపెనీ సూచీలు ఎగువముఖం పట్టడానికి కారణమయ్యాయి. ఇంట్రాడేలో 24.54 శాతం లాభపడిన కంపెనీ షేరు ధర చివరకు 17.61 శాతం లాభంతో రూ.148.30 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,152.54 కోట్లు పెరిగి రూ.7,691.54 కోట్లకు చేరుకుంది.

1000 పాయింట్లు డౌజోన్స్ డౌన్

అమెరికా స్టాక్ మార్కెట్ సూచీ డౌజోన్స్ మరింత పతనం చెందింది. ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచనున్నదన్న అంచనాతో డౌజోన్స్ 1,000 పాయింట్లకు పైగా పతనం చెంది 23,860.46 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పీ 500 సూచీ 3.8 శాతం తగ్గి 2,581కి జారుకోగా.. నాస్‌డాక్ 3.9 శాతం దిగువకు పడిపోయి 6,777.16 వద్ద స్థిరపడింది. ఈ దెబ్బకు ఆసియన్ స్టాక్ మార్కెట్లు కూడా కుదేలయ్యాయి. షాంఘై కంపోసైట్ ఇండెక్స్ 5.5 శాతం తగ్గగా, టోక్యో నిక్కీ 225, హాంకాంగ్ హ్యాంగ్‌సంగ్ 4.2 శాతం చొప్పున పడిపోయాయి.



తలసరి విదేశీ అప్పు రూ.26 వేలు

మన రుణాలు 495.7 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రపంచంలో అత్యధికంగా అప్పులు తీసుకున్న దేశాల జాబితాలో భారత్ లేదని, మన విదేశీ రుణ భారం నియంత్రించదగిన పరిమితుల్లోనే ఉన్నదని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికం (2017 సెప్టెంబర్) చివరి నాటికి విదేశాల నుంచి మన దేశం తీసుకున్న రుణాలు 495.7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32 లక్షల కోట్ల)కు చేరాయని శుక్రవారం లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పీ రాధాకృష్ణన్ వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి మన తలసరి విదేశీ రుణ భారం 409.3 డాలర్లు (సుమారు రూ.26 వేలు)గా ఉన్నదని, ప్రపంచ వ్యాప్తంగా అధిక రుణ భారం ఉన్న దేశాల జాబితాలో 2017 జూన్ చివరి నాటికి మన దేం 26వ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.



రూపాయికే మొబైల్ ఫోన్

తొలివార్షికోత్సవం సందర్భంగా సెల్‌బే ఆఫర్

హైదరాబాద్, ఫిబ్రవరి 9: మొబైల్ రిటైల్ రంగంలో దూసుకుపోతున్న సెల్ బే తొలి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ల కింద రూపాయికే మొబైల్ ఫోన్‌ను అందిస్తున్నట్లు ప్రకటించింది. వీటితోపాటు రూ.1,499కే 4జీ స్మార్ట్‌ఫోన్, రూ.5 వేల విలువైన వస్తువులు కొనుగోలు చేసిన వారికి కచ్చితమైన బహుమతిని ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ షేక్ రఫీ మాట్లాడుతూ.. ఇప్పటికే 60 స్టోర్లను ఏర్పాటు చేశామని, ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్యను 150కి పెంచాలనుకుంటున్నట్లు చెప్పారు.

ఎస్‌బీఐ నష్టం 1,887 కోట్లు

ముంచుతున్న మొండి బకాయిలు.. రూ.2 లక్షల కోట్లకు చేరిన నిరర్థక ఆస్తులు

ముంబై, ఫిబ్రవరి 9:

ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆర్థిక ఫలితాలకు మొండి బకాయిల సెగ గట్టిగానే తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.1,886.57 కోట్ల నష్టం వచ్చినట్లు బ్యాంక్ ప్రకించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు వెచ్చించడంతో లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 2016-17 ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.2,152.14 కోట్ల లాభాన్ని గడించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విషయానికి వస్తే 7.23 శాతం నుంచి 10.35 శాతానికి చేరుకున్నాయి. ప్రసుత్తం బ్యాంకు మొండి బకాయిలు అక్షరాలా రూ.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాదిలో రూ.1.08 లక్షల కోట్లుగా ఉన్న నిరర్థక ఆస్తుల విలువ ఏడాది కాలంలో మరో లక్ష కోట్లు పెరుగడం బ్యాంక్ కలవరానికి గురిచేస్తున్నది. గడిచిన త్రైమాసికంలో వడ్డీయేతర ఆదాయం 29.75 శాతం తగ్గి రూ.8,084 కోట్లకు పరిమితమైనట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. గడిచిన త్రైమాసికంలో నిరాశాజనక పనితీరు కనబరిచినట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆశావహంగా ఉండనున్నదని ఎస్‌బీఐ చైర్మన్ రాజ్‌నీష్ కుమార్ తెలిపారు. మూడో త్రైమాసికంలో రూ.25 వేల కోట్లు తాజాగా మొండి బకాయిల జాబితాలోకి చేరయన్నారు. వీటిలో రూ.10 వేల కోట్లు విద్యుత్ రంగానికి ఇచ్చినవని ఆయన పేర్కొన్నారు. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.17,759 కోట్ల నిధులను వెచ్చించింది. అంతక్రితం ఏడాది కేటాయించిన రూ.7,244 కోట్లతో పోలిస్తే రెండింతలు పెరిగాయి. ఆర్బీఐ మార్గదర్శకాలకు లోబడి 48 ఖాతాలకు ఇచ్చిన రూ.78 వేల కోట్ల రుణాలను వసూలు చేయడానికి దివాలా చట్టం కింద చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. బ్యాంకులో నాన్-ప్రమోటర్ల వాటాను విక్రయించడం ద్వారా రూ.20 వేల కోట్ల నిధుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. దీంతో బ్యాంకులో ప్రభుత్వం వాటా నాలుగు శాతం వరకు తగ్గనున్నది. నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.17 శాతం పెరిగి రూ.18,686 కోట్లకు చేరుకున్నది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 1.18 శాతం తగ్గి రూ.296.40కి చేరుకున్నది.



రాజ్‌నీష్ కుమార్

బీవోబీ లాభంలో 56 శాతం డౌన్



మరో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 56 శాతం తగ్గి రూ.112 కోట్లకు పరిమితమైంది. 2016-17 ఏడాది ఇదే కాలానికి లాభం రూ.253 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో ఆదాయం 6.53 శాతం పెరిగి రూ.12,976 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. నికర వడ్డీ ఆదాయంలో 40.20 శాతం వృద్ధిచెంది రూ.4,394 కోట్లుగా నమోదైంది. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ అడ్వాన్స్‌లో 11.31 శాతానికి చేరుకున్నాయి. విలువ పరంగా చూస్తే ఇది రూ.48,480.44 కోట్లుగా ఉన్నది. నికర ఎన్‌పీఏ 4.97 శాతానికి(రూ.19,006.33 కోట్లు) తగ్గింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.3,155 కోట్ల నిధులను వెచ్చించింది. గతేడాది వెచ్చించిన దాంతో పోలిస్తే 92.61 శాతం పెరిగాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 1.68 శాతం పతనం చెంది రూ.296.40 వద్ద ముగిసింది.

నిరాశపరిచిన సిండికేట్ బ్యాంక్



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.870 కోట్ల నష్టం వచ్చినట్లు సిండికేట్ బ్యాంక్ ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.93.56 కోట్ల లాభాన్ని గడిచింది. ఆదాయం విషయానికి వస్తే రూ.6,554.04 కోట్ల స్థాయి నుంచి రూ.5,964.15 కోట్లకు పరిమితమైంది. ఎన్‌పీఏలను పూడ్చుకోవడానికి రూ.2,089.99 కోట్ల నిధులను వెచ్చించినట్లు తెలిపింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 9.62 శాతానికి చేరుకోగా, నికర ఎన్‌పీఏ 5.44 శాతానికి తగ్గింది.

రాష్ట్రంలో టఫే వ్యవసాయ ఉపకరణాల యూనిట్

- రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న సంస్థ

హైదరాబాద్, ఫిబ్రవరి 9: దేశంలో రెండో అతిపెద్ద ట్రాక్టర్ల తయారీ సంస్థ ట్రాక్టర్ అండ్ ఫార్మ్ ఈక్విప్‌మెంట్ లిమిటెడ్ (టఫే) రాష్ట్రంలో వ్యవసాయ ఉపకరణాల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. రూ.100-200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌పై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు కంపెనీ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ అధికారి టీఆర్ కేశవన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్ద రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్న ఆయన.. వారికి చైతన్యం కలిగించడానికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్ల పరిశ్రమ 13 నుంచి 14 శాతం మేరకు వృద్ధి చెందుతుందని భావిస్తున్నామన్నారు.



వేడుకకు హాజరైన అశేష భక్తజనం

నేత్రపర్వంగా పోలేపల్లి ఎల్లమ్మ సిడె

కోస్గి: మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం పోలేపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ సిడె వేడుక శుక్రవారం నేత్రపర్వంగా కొనసాగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, వికారాబాద్, మహారాష్ట్రలోని షోలాపూర్, భీవండి, గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్‌ల నుంచి దాదాపు 4 లక్షల మంది భక్తులు హాజరయ్యారు. అంతకుముందు జల్ది ఉత్సవంలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో మేళతాళాలు, కొమ్ము వాయిద్యాల మధ్య ఆలయ సమీపంలోని బావి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ బావిలో అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేయించిన తర్వాత తిరిగి ఆలయంలోకి తీసుకొచ్చారు. ఆలయ చైర్మన్ ముచ్చటి వెంకటేశ్, దేవస్థానం మేనేజర్ రాజేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిడెతో ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించారు. ఈ సమయంలో అమ్మవారి సిడెను లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత దేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



మంచిర్యాలలోని గోదావరి నదిలో దేవుళ్లను శుద్ధి చేస్తున్న పూజారులు

గాంధారి మైసమ్మ జాతర ప్రారంభం

రామకృష్ణాపూర్: మాఘ శుద్ధ పౌర్ణమిన నాయక్‌పోడు రొడ్డ వంశస్థుల పూజలతో మంచిర్యాల జిల్లాలోని బొక్కలగుట్ట గాంధారిఖిల్లా జాతర శుక్రవారం ప్రారంభమైంది. సదర్ల భీమన్నకు పూజలు చేసి, తప్పెటగూళ్ల దరువు చప్పుళ్లు, పిల్లన గ్రోవిలతో ఊరేగింపుగా మంచిర్యాల గోదావరికి వెళ్లి గంగాజలంతో దేవతా విగ్రహాలను శుద్ధి చేశారు. అనంతరం నైవేద్యం వండి దేవుళ్లకు సమర్పించి తిరిగి సాయంత్రం బొక్కలగుట్టకు చేరుకున్నారు. రాత్రి దేవుళ్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. జాతర ఏర్పాట్లను కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. ముందుగా సదర్ల భీమన్నగుట్టపై మైసమ్మకు పూజలు చేశారు. శనివారం నాయక్‌పోడ్ సంప్రదాయ కళారూపాల ఆటాపాటలు, ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహిస్తారు.

కాంగ్రెస్ జెండా మోసేటోళ్లుండరు

జాతీయ పార్టీలను నమ్ముకుంటే బిచ్చగాళ్లను చేస్తరు

- దేశానికి అన్నంపెట్టే కల్పతరువుగా మారుస్తాం..
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు
- అభివృద్ధిని చూసే చేరికలు: మంత్రి ఈటల



కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి ఈటల, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యేలు గంగుల, దాసరి



కరీంనగర్ రూరల్ మండలం నల్లగుంటపల్లి సర్పంచ్ అట్ల లక్ష్మికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ జెండా మోసేందుకు కార్యకర్త కూడా మిగలడని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఉండి కాంగ్రెస్ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారనీ, కింద స్థాయికి వచ్చి చూస్తే వాస్తవాలు కండ్లకు కనిపిస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలను నమ్ముకుంటే మనల్ని బిచ్చగాళ్లను చేస్తారనీ, బానిసలుగా మార్చుతారన్నారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. సభలో మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్, బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలో ఆ పార్టీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్‌కు ఎందుకు ఓటెయ్యాలో వంద కారణాలు చెబుతానన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతులకు రుణమాఫీ, ఆరు కిలోల బియ్యం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న తీరును ఈ సందర్భంగా వివరించారు. తెలంగాణకు మీరేం చేశారని ఓట్లడుగుతారు? అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. గోదావరి నదికి ఎక్కువ పరీవాహక ప్రాంతం కరీంనగర్ జిల్లాలోనే ఉందని, నీళ్లు మాత్రం ఉభయ గోదావరి జిల్లాలకు తరలి వెళ్తున్నాయన్నారు. గోదావరి నీళ్లు ఉభయ గోదావరి జిల్లాల్లో పారించి కరీంనగర్‌లో నెత్తురు పారించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల కల్లోలిత ప్రాంతాలుగా చూసి, గోదావరి జిల్లాలను మాత్రం సస్యశ్యామలం చేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అటు కృష్ణా నది నీటిని కృష్ణా జిల్లాకు తరలించి మహబూబ్‌నగర్‌ను కరువు ప్రాంతంగా చేశారని మండిపడ్డారు. ఈ పాపం కాంగ్రెస్ నాయకులదేనని ధ్వజమెత్తారు. కానీ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో సాధించుకున్న తెలంగాణను రాబోయే కొద్దిరోజుల్లోనే దేశానికి అన్నం పెట్టే తల్లిగా మార్చుతామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసిన ప్రతి ఒక్కరు దేశానికే ఆదర్శమని కొనియాడుతున్నారన్నారు. ఆ నాడు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం కొట్లాడగా, ఇప్పుడు బంగారు తెలంగాణ కోసం తండ్లాడుతున్నామన్నారు. అప్పుడు పార్టీలకతీతంగా రాష్ట్రం కోసం పోరాడితే, ఇప్పుడు రాజకీయాలకతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 'మన రాష్ట్రం–మన పార్టీ'ని ఆదరిస్తేనే.. కేసీఆర్ నాయకత్వంలో మరింత ముందుకు పోతామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి..

12 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్ ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతున్నదని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి తమ గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.

భారీగా చేరికలు..

కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీకి చెందిన ప్రముఖ నాయకులు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. సుమారు రెండు వేల మంది కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలో చేరగా, మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మేయర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో రోగితో మాట్లాడుతున్న మంత్రి జోగు రామన్న

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతు

బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న


బోథ్/ఎదులాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గల్లంతు కావడం ఖాయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న జోస్యం చెప్పారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఏడు సీట్లు కూడా రావన్నారు. వరంగల్, గ్రేటర్ హైదరాబాద్, నారాయణఖేడ్, పాలేరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతే ముక్కు నేలకు రాస్తామన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ తరువాత మాట నిలబెట్టుకోలేక పోయారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా, రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. దవాఖాన పరిసరాలను, పలు వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.



వనపర్తిలో వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిరంజన్‌రెడ్డి

ప్రాజెక్టుల పూర్తితో వనపర్తి సస్యశ్యామలం

వనపర్తి, నమస్తే తెలంగాణ: పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితో వనపర్తి జిల్లా సస్యశ్యామలంగా మారిందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మార్కెట్ యార్డులో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. యావత్తు తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ కంకణబద్ధులై ఉన్నారనీ, అందులో భాగంగానే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నారన్నారు. జిల్లాలో గతేడాది పుష్కలంగా నీరందడంతో వేరుశనగ సాగు పెరిగి, దేశంలోనే రికార్డు స్థాయి దిగుబడి సాధించిన జిల్లాగా ఖ్యాతి పొందిందన్నారు. ఈ యేడు కూడా రికార్డు సాధించడం ఖాయమన్నారు. వనపర్తిలో వేరుశనగ విత్తన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు త్వరలోనే సఫలమవుతాయన్నారు. 20 వేరుశనగ శ్యాంపిల్స్‌ను కలెక్టర్ ఇక్రిశాట్ ద్వారా పంపిస్తే 19 నమూనాలు అర్హత సాధించాయన్నారు. భవిష్యత్తులో వనపర్తి నుంచి వేరుశనగ ఎగుమతి చేసే అవకాశమున్నదన్నారు.




కరీంనగర్ ఆశ్రమంలో రాత్రి బస చేస్తున్న వాసుదేవరెడ్డి

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర సర్కారు కృషి చేస్తున్నదని వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కార్ఖనగడ్డ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని హాస్టళ్లు, ఆశ్రమాల్లో రాత్రి నిద్రించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని తెలిపారు. సమస్యలన్నింటిపై ఓ నివేదికను తయారు చేసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయన వెంట టీఆర్‌ఎస్వీ నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, మధు, వికలాంగుల సంఘ నాయకులు సంపత్, అశోక్, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి వద్ద కృష్ణమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కృష్ణమ్మ రాకతో సస్యశ్యామలం

ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు: కృష్ణాజలాల రాకతో నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సస్యశ్యామలం అవుతుందని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కొండారెడ్డిపల్లి శివారులో ప్రధాన కాల్వ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కృష్ణమ్మకు పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల కృషితోనే కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుందన్నారు.

గులాబీ పార్టీలోకి భారీగా చేరికలు







నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న నర్సాపూర్(జి) మండల వాసులు.. ఖమ్మం జిల్లా ఏరుగట్లలో మంత్రి తుమ్మల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కీలక నేత వినీల్... జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ముస్లిం నేతలకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు శుక్రవారం పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఏరుగట్లకు చెందిన సుమారు 100 కుటుంబాల వారు లక్కినేని వినీల్ ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్‌లో చేరగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో 240మంది గులాబీ గూటికి చేరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహదేవపూర్ మండలాలకు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీ, పలు యువజన సంఘాల వారు మంథని ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో కాంగ్రెస్ నాయకులు, యువకులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలానికి చెందిన 15మంది కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గికి చెందిన 12మంది రజక సంఘం నేతలు టీఆర్‌ఎస్ రాష్ట్ర నేత దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి సమక్షంలో, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో 200 మంది ముస్లిం నాయకులు టీఆర్‌ఎస్ గూటికి చేరారు.

ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్

ఖమ్మం క్రైం: ఖమ్మం వికలాంగుల సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రావు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు దొరికాడు. ఏసీబీ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం... తిరుమలాయ పాలెం మండలానికి చెందిన నాగమణి వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ఫ్లోర్ మిల్ కోసం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ రూ.లక్ష రుణం మంజూరు చేశారు. ఆ మొత్తాన్ని డీసీసీబీ ద్వారా చెల్లించాల్సి ఉంది. డీసీసీ బ్యాంకులో ఆన్‌లైన్ సౌకర్యం లేని కారణంగా తమ కార్యాలయంలో చెక్కు తీసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ అధికారి సూచించారు. లబ్ధిదారు నాగమణి పలుమార్లు వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయానికి వచ్చి తనకు మంజూరైన రుణానికి సంబంధించిన చెక్కును ఇవ్వాలని జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌ను కోరగా అతను రూ.5 వేలు లంచం డిమాండ్ చేసి చివరకు రూ.2 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అదే సమయంలో ఆమె ఖమ్మంలోని ఏసీబీ అధికారులను సంప్రదించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ తన కార్యాలయంలో రూ.2 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు.

సబ్సిడీ గొర్రెల పట్టివేత

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 80 సబ్సిడీ గొర్రెలను పట్టుకున్నట్టు డీఎస్పీ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడ ఠాణాలో వివరాలు వెల్లడించారు. సబ్సిడీ గొర్రెలను కృష్ణా జిల్లాకు తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఎస్సై సతీష్ రంగంలోకి దిగి గొర్రెలు తరలిస్తున్న మూడు వాహనాలను పట్టుకున్నట్టు చెప్పారు. గొర్రెలను స్వాధీనం చేసుకొని, కృష్ణా జిల్లా బొనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన పాపిగండి వెంకటయ్య, గద్దల శ్రీను, సాయ గోపాల్‌రావు, కుక్కల పుల్లయ్య, డ్యాగల రాంబాబు, షేక్ పాషా, లబ్ధిదారులు కొమ్మణబోయిన సమ్మయ్య, బండి కుమారస్వామిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు డీఎస్పీ చెప్పారు.

342 క్వింటాళ్ల కందుల సీజ్

హాలియా, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా హాలియాలో అక్రమంగా నిల్వ ఉంచిన 342 క్వింటాళ్ల కందులను శుక్రవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కేసీ ప్రమీల తెలిపిన వివరాలు.. హాలియా పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఓ వ్యాపారికి చెందిన గోదాములో కందులు నిల్వ ఉన్నట్టు అందిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. పట్టణానికి చెందిన వ్యాపారి గూడవల్లి శ్రీనివాస్‌రావు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి, అక్రమంగా నిల్వ ఉంచిన 684 బస్తాలు (342క్వింటాళ్లు) కందులను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారి ఆంధ్రా ప్రాంతంలోని వినుకొండ నుంచి 178క్వింటాళ్లు, మిగతావి హాలియాలోని పలువురు రైతుల వద్ద కొనుగోలు చేసి అధిక ధరకు అమ్మే ఉద్దేశంతో నిల్వ చేసినట్టు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. వీటిని హాలియా ఎస్సై సతీశ్‌కు అప్పగించి, సదరు వ్యాపారిపై చర్యల కోసం జేసీకి నివేదించినట్టు పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి ఆదేశం
- ఐదు జిల్లాల అధికారులతో సమీక్ష



వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి. వేదికపై అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి

వరంగల్ అర్బన్ కలెక్టరేట్: గ్రామ పంచాయతీల పాలక వర్గాల గడువు జూలై 31తో పూర్తవుతున్న నేపథ్యంలో ఆ లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నదని రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి తెలిపారు. ఈ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రణాళికలపై శుక్రవారం ఆయన వరంగల్ అర్బన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగాం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, జేసీలు, అధికారులతో సమీక్షించారు. పంచాయతీల ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనలు, తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. పార్టీల రహితంగా, కేటాయించిన గుర్తుల ఆధారంగా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. అవసరమైతే బ్యాలెట్ బాక్స్‌లను మహారాష్ట్ర, కర్ణాటక నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. పింక్ బ్యాలెట్ పేపర్‌ను సర్పంచ్‌కు, వార్డు మెంబర్‌కు వైట్ బ్యాలెట్ పేపర్ నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతున్నదని, దాని ఆధారంగా ఓట్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్, వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ జీ సుధీర్‌బాబు, ఆయా జిల్లాల జేసీలు, ఆర్డీవోలు, డీపీవోలు, ఎస్పీలు పాల్గొన్నారు.

త్వరలో 800 జేఎల్‌ఎం పోస్టుల భర్తీ

ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

నర్సంపేట, నమస్తే తెలంగాణ (వరంగల్ రూరల్): ఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలో 800 జేఎల్‌ఎం పోస్టులను భర్తీ చేయనున్నట్టు సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో ఎన్పీడీసీఎల్ డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలోని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే 108 మందిని ఏఈ పోస్టులకు ఎంపిక చేసి శిక్షణ కోసం పంపించామన్నారు. జేఎల్‌ఎం పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. విద్యుత్‌శాఖను నష్టాల నుంచి లాభాల బాటలో పయనించేలా కిందిస్థాయి నుంచి పైస్థాయి దాకా ఉద్యోగులు బాధ్యతతో పని చేయాలని కోరారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ శివరాం, తదితరులు పాల్గొన్నారు.

500 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

చిలుపూరు: జనగామ జిల్లా రాజవరంలో అక్రమంగా నిల్వచేసిన సుమారు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ వెంకటేశ్వరబాబు కథనం ప్రకారం.. చిలుపూరు మండలం రాజవరంలో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని నిల్వ చేసినట్టు సమాచారం అందడంతో ఏసీపీ వెంకటేశ్వరబాబు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఇక్కడి వ్యవసాయ క్షేత్రంలో నిల్వ చేసిన సుమారు 500 క్వింటాళ్ల బియ్యాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో ట్రాలీ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని ఆరాతీయడంతో బియ్యం దందా వెలుగుచూసింది. సీజ్ చేసిన బియ్యాన్ని స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. అక్రమంగా నిల్వ చేసిన మోటం రాజు, మోటం జంపయ్య, మోటం గురువయ్య, సిరిగిరి శంకర్‌పై కేసు నమోదు చేసినట్టు ఏసీపీ వెంకటేశ్వరబాబు తెలిపారు.



జగిత్యాల జిల్లా ఎస్సారెస్పీ డీ-74 కాల్వలో శ్రమదానంచేస్తున్న కొప్పుల ఈశ్వర్

ఎస్సారెస్పీ కాల్వలో కొప్పుల ఈశ్వర్ శ్రమదానం

పెగడపల్లి: జగిత్యాల జిల్లాలోని ఎస్సారెస్పీ డీ–74 కాల్వ మరమ్మతుల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ శ్రమదానం చేశారు. 'మన ఊరు–మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా పెగడపల్లి మండలం మద్దులపల్లిలో గురువారం రాత్రి పల్లె నిద్ర చేసిన ఆయన, శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



మెదక్ మావెరిక్స్ ఘన విజయం

సిద్దిపేట, నమస్తే తెలంగాణ: జీ వెంకటస్వామి మెమోరియల్ టీ20 లీగ్ రెండోదశలో భాగంగా సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లోనూ మెదక్ మావెరిక్స్ జట్టు చెలరేగింది. శుక్రవారం సిద్దిపేటలోని మినీ స్టేడియంలో ఖమ్మం తిరా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టులో జునైద్ అలీ 59 ఒక్కడే రాణించగా నిర్ణీత ఓవర్లలో 115 పరుగులు చేసింది. మెదక్ బౌలర్లలో భరత్(2),ప్రణీత్(2) వికెట్లు పడగొట్టారు. 116 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు కేవలం 11 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఘన విజయం సాధించింది. మెదక్ ఓపెనర్ మల్లికార్జున్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. స్టేడియంలో సిక్సర్ల వర్షం కురిపించి 70 పరుగులు చేసి అదురగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. మరో ఓపెనర్ అభిరత్ రెడ్డి 25, అఫ్రిది 10 పరుగులు చేసారు. శనివారం జరిగే మ్యాచ్‌లలో ఉదయం నల్లగొండ, హైదరాబాద్ జట్లు తలపడనుండగా, మధ్యాహ్నం 1.30కి జరిగే మ్యాచ్‌లో నిజామాబాద్, రంగారెడ్డి జట్లు తలపడనున్నాయి. రంగారెడ్డి జట్టులో సినీనటుడు అఖిల్ ఆడనుండగా.. ఈ పోటీని తిలకించేందుకు సినీనటుడు వెంకటేశ్ రానుండడం విశేషం.



ఘనంగా వీఐటీ చెన్నై వైబ్రాన్స్ 2018

హైదరాబాద్, ఫిబ్రవరి 9: వీఐటీ జాతీయస్థాయి వార్షిక సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలు శుక్రవారం చెన్నైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వైబ్రాన్స్- 2018 పేరిట నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఉత్సవాలలో ప్రముఖ రెజ్లర్ బబితాకుమారి ఫోగట్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీఐటీ చెన్నై వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎన్ సంబంధం తదితరుల సమక్షంలో ఆమె పలువురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కొత్త శకానికి కౌంట్‌డౌన్

దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ దిశగా.. వాండరర్స్‌లో నాలుగో వన్డే

జొహన్నెస్‌బర్గ్: భారత క్రికెట్ చరిత్రలో అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు విరాట్‌సేన మరో అడుగు దూరంలో ఉంది. దక్షిణాఫ్రికాతో శనివారం ఇక్కడ జరుగనున్న నాలుగో వన్డేలో గెలిచి తొలిసారిగా సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది. 1992-93 నుంచి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లడమే తప్ప ఒక్కసారీ సిరీస్‌ను గెలిచిందే లేదు. 2010-11లో మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలోని భారత్ 2-3తో తృటిలో సిరీస్‌ను చేజార్చుకుంది. ఆరేండ్ల తర్వాత మళ్లీ ఆ సువర్ణావకాశం వచ్చింది. ఆరు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే 3-0 ఆధిక్యం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌లో గెలిస్తే 4-0తో సిరీస్‌ను గెలుచుకుంటుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా గెలిస్తే, మనోళ్లు మరో మ్యాచ్ వరకూ వేచి చూడాల్సిందే. అయితే ప్రస్తుతం ఫాం, పరిస్థితుల ప్రకారం టీమ్‌ఇండియాకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతకు ముందు ఇక్కడ జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ గెలువడం సానుకూలాంశం.

రోహిత్ ఒక్కడే: ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ రోహిత్‌శర్మ వరుస వైఫల్యాలే భారత్‌ను కొంత కలవరపెడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ఐనా ఈ ముంబైకర్ గాడిలో పడితే భారత్‌కు అదనపు బలం చేకూరుతుంది. వరుస సెంచరీలతో దుమ్మురేపుతున్న కెప్టెన్ కోహ్లీ



మరోసారి దుమ్మురేపితే భారీ స్కోరు ఖాయం. ధవన్ ఫాంలో ఉండటం .. స్పిన్ ద్వయం చహల్, కుల్దీప్ చెలరేగడం టీమ్‌ఇండియాకు అనూకూల అంశం. బ్యాటింగ్‌లో అవకాశమొస్తే ధోనీ, పాండ్య తమదైన జోరు చూపిస్తే భారత్‌కు తిరుగుండదు.

గులాబీ మ్యాచ్: రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా దక్షిణాఫ్రికా జట్టు ఈ వన్డేలో గులాబీ దుస్తులు ధరించి ఆడనుంది. ఈ మ్యాచ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్యాన్సర్‌తో బాధపడే వారి సహాయార్థం అందిస్తారు. దక్షిణాఫ్రికా 2011 నుంచి యేటా ఒకసారి పింక్ డ్రెస్ ధరించి మ్యాచ్ ఆడుతున్నది.

ఏబీతో జాగ్రత్త: గాయం కారణంగా గత మూడు వన్డేలకు దూరమైన డివిలియర్స్ ఈ మ్యాచ్‌కు బరిలో దిగుతుండడం భారత్‌కు కొంత ప్రతికూల అంశం. ఈ ధనాధన్ ఆటగాడు కుదురుకున్నాడంటే మ్యాచ్‌నూ పూర్తిగా ఏకపక్షం చేయగలడు. అందులోనూ పింక్ దుస్తులు ధరించి ఆడిన ప్రతీసారి ఇతడికి కలిసొచ్చినట్టు గత గణాంకాలు చెబుతున్నాయి. 2015లో వెస్టిండీస్‌పై 44 బంతుల్లోనే 149, 2013లో భారత్‌పై 47 బంతుల్లోనే 77 పరుగులు సాధించాడు. దీంతో ఈ మ్యాచ్‌లో భారత్‌కు ఏబీ డివిలియర్స్ నుంచి ముప్పు ఉండొచ్చు. ఇతడు జట్టులోకి రావడంతో జోండో, మిల్లర్‌లో ఒకరిపై వేటు పడే అవకాశం ఉంది.మోర్కెల్‌ను తుదిజట్టులో తీసుకోవచ్చు. ఇక మార్క్రమ్‌ను కెప్టెన్‌గా కొనసాగిస్తారా? డివిలియర్స్‌కే పగ్గాలు అప్పగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

క్రీడాకారులకు అదనపు చేయూత

మంత్రి హరీశ్‌రావు

గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులకు అదనపు సౌకర్యాలు అందించడంతో పాటు వారికి ప్రోత్సాహకాలను అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. శుక్రవారం సిద్దిపేటలోని మినీస్టేడియంలో మెదక్, ఖమ్మం జట్లమధ్య జరిగిన మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. జీ వెంకటస్వామి పేరుతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న టోర్నీకి హైదరాబాద్ తర్వాత రెండో వేదికగా సిద్దిపేటను ఎంచుకున్నందుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేకానందకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే క్రీడాకారులకు ఉదారంగా ఇండ్ల స్థలాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఈ టోర్నీ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను అంతర్జాతీయ వేదికపై రాణించేందుకు తగిన వేదిక అని కొనియాడారు. మరో 15 రోజుల్లో మినీ స్టేడియానికి ఫ్లడ్‌లైట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి కాసేపు బౌలింగ్ చేయగా..హరీశ్ సరదాగా బ్యాటింగ్ చేసి అలరించారు. ఆయన బ్యాటింగ్ చేస్తున్నంతసేపు ప్రేక్షకుల అరుపులు, కేకలతో స్టేడియం దద్దరిల్లింది. సిద్దిపేట మినీస్టేడియాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడంలో మంత్రి హరీశ్‌రావు ఎంతో కృషి చేశారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేకానంద ప్రశంసించారు. ఈ స్టేడియంలో రాబోయే సీజన్‌లో రంజీ మ్యాచ్‌ల నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి, తెలంగాణ టీ20 లీగ్ డైరెక్టర్ ఆగమరావు, మెదక్ మావెరిక్స్ ఓనర్ జగన్మోహనరావు, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.